Deccan Land

Deccan

JUNE 2026



జూన్ - 2026

DECCAN LAND, HYDERABAD

166

JUNE - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784

₹30

సంపుటి : 14

సంచిక : 10

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

UNESCO, India Tentative List (TL) Site - 2022: SUN TEMPLE, MODHERA AND ITS ADJOINING MONUMENTS



VOL. 14వ వసంతంలో

166 ISSUES నూట అరవై ఆరవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- చరిత్ర, సంస్కృతికి మ్యూజియంలే శాశ్వత నిలయం
- కాకతీయుల నాటి శివాలయం చరిత్ర తుడిపివేత
- తెలంగాణలో పైశాచి భాష
- రాతికొండలపై రాచనగరం





## JUNE 2026

A celebration of culture, where dance carries stories from one generation to the next. Students performing the Lavani dance at the 45th Annual Day Celebrations of Oxford Grammar School, at Lalitha Kala Thoranam.


Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE


| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |
| | | | | | | |

**Important Dates**

21 June - International Yoga Day
26 June - Muharram

NOTES :

Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph.+91 90599 50055

**Where others see obstacles, leaders see opportunities.**




UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2022
Serial Nomination for
SUN TEMPLE, MODHERA AND ITS ADJOINING MONUMENTS
Gujarat State, Mehsana District Province or Region India.
Category: Cultural

## సూర్య దేవాలయం

భారతదేశంలో సూర్యారాధన సంప్రదాయం మూలాలు హిందూ మతానికి చెందిన వేద గ్రంథాలలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇది వేల సంవత్సరాల నాటి ప్రాచీన సంప్రదాయాన్ని తెలియజేస్తుంది. మొధేరాను కొన్నిసార్లు 'ముందేరా' అని కూడా పిలుస్తారు. ఇది మొధా బ్రాహ్మణుల అసలైన నివాస స్థలం. శ్రీరాముడు, సీతమ్మల వివాహ సందర్భంలో ఈ ప్రాంతాన్ని వారికి 'కృష్ణార్పణం' (దానం)గా ఇచ్చినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. వీరు మొధా వనియాలకు (వర్తక సమాజం) గురువులుగా వ్యవహరించేవారు. ప్రముఖ జైన ఆచార్యుడైన హేమచంద్రుడు కూడా ఈ మొధా వంశానికి చెందినవారే. గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా, బెచరాజీ తాలూకాలో ఉన్న రూపాన్ నది ఉపనది అయిన పుష్పవతి నది ఎడమ గట్టున ఈ అద్భుతమైన మొధేరా సూర్య దేవాలయం ఉంది.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## జెంటిల్మన్ షికారి – కెన్నెల్ అండర్సన్

ప్రకృతి సంరక్షకుడు కెన్నెల్ అండర్సన్. ప్రకృతి రచనలు చేసిన వారిలో ప్రముఖుడు. ఎన్నో భిన్నమైన, విశిష్టమైన ప్రకృతి వ్యాసాలు రాశాడు. వీరికి వేట అనేది వినోద క్రీడ. మనిషి మాంసానికి అలవాటు పడిన పులుల్ని, చిరుతలను మాత్రమే వేటాడుతారు. అందుకే వేటను వినోద క్రీడగా భావించే భవిష్యత్ క్రీడాకారులకు 'మీ చేతుల్లో రైఫిల్ కంటే కెమెరా ఉండటం వల్లనే ఎక్కువ సంతోషం పొందుతారు' అని తెలియజేస్తారు వీరి రచనల్లో. వీరి తండ్రి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో మిలిటరీ అధికారి. వీరికి కన్నడం, తమిళం, కొంత తెలుగు కూడా వచ్చు. అనారోగ్యం కారణంగా 1974 ఆగస్టు 30న మరణించడం దురదృష్టకరం. అండర్సన్ గురించి అనేక విషయాలు తెలియజేసిన డా. సీతారాం గారికి హృదయపూర్వ ధన్యవాదాలు. – **అఖిల,** సిద్ధిపేట

❖ ❖ ❖

## ఆదిమానవుని సృజనకు తెలంగాణ తొలిబడి

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, ప్రస్తుత జోగులాంబ–గద్వాల్ జిల్లా, అలంపూరు దగ్గరలోని చాగటూరులో 1978లో చేపట్టిన తవ్వకాల్లో ఇనుపయుగపు సమాధిగ, ఒక గోడ రాతిపై వింత ముడి కనిపించడమే కాకుండా, ఈ ముడి గుర్తుతోపాటు నిలబడి ఉండి చేతులు పైకెత్తి నమస్కరిస్తూ, ముందున్న పాదముద్రలకు మొక్కుతున్న మనిషి రేఖా చిత్రం కూడా ఆ తవ్వకాల్లో బయల్పడింది. వింత ముడి ముగ్గుల జాబితాలో చేరినా, 2500 సం॥ల పూర్వమే సింధు నాగరికతతో సంబంధం లేని తెలంగాణలో బయల్పడి 'సృజన'కు తెలంగాణ తొలిబడి అయ్యింది. ఇలా రాతి యుగం, శిలాయుగం గురించి, పురావస్తు శాఖ తవ్వకాల్లో బయల్పడిన చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లను దక్కన్‌ల్యాండ్ పాఠకులకు తెలియజేసిన రచయిత శివనాగిరెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. – **కె. యాదగిరి,** మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## చంబల్ పాత రాతియుగం చిత్రాలు

ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో రాతి చిత్రాలు ఉన్న ప్రాంతాలు చంబల్ బేసిన్. మధ్య భారతదేశం గుర్తింపు పొందాయి. పాతరాతియుగం, మధ్యరాతియుగం, నవీనరాతియుగం, చారిత్రక కాలాలకు చెందిన ఈ చిత్రకళా కేంద్రాలు తరచుగా తామ్ర శిలాయుగం, బృహత్ శిలాయుగం, పూర్వ చారిత్రక కాలాల అంశాలతో పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. ఈ రాతి చిత్రాలు యునెస్కో గుర్తింపు జాబితాలో చోటు చేసుకోవడం హర్షణీయం.

– **ఎం. రామమోహన్,** కర్నూలు

❖ ❖ ❖

## స్టేజీ మాంత్రికుడు బబ్బన్‌ఖాన్

1943లో హైదరాబాద్‌లో జన్మించిన బబ్బన్ ఖాన్ బాల్యం నుండే పేదరికాన్ని అనుభవించాడు. ఆయన కన్నా ముందు పుట్టిన పిల్లలు పౌష్టికాహార లోపంతో చనిపోయారు. ఇతను కూడా బతుకుతాడనే నమ్మకం లేక ఆయనకు పేరు కూడా పెట్టలేదు. ముద్దుగా బబ్బన్ అని పిలుచుకొనేవారు. పదేళ్లు బతికాక అదే పేరు ఖాయం అయ్యింది. కుటుంబాన్ని పోషించడానికి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొన్నాడు. 'ఏక్ పియాలీ చాయ్ పే బేచారా ఏక్ లతీఫా సునాతా థా భాయ్' అని ఒక జోక్ చెప్పి, ఒక కప్పు టీ తీసుకునేవాడు. ఆరేళ్లకే తండ్రిని కోల్పోయాడు. వీధి దీపం కింద కూచొని 22వ ఏట 'అద్రక్ కే పంజే' నాటకాన్ని మూడు గంటల వ్యవధిలో రాశాడు. కుటుంబ నియంత్రణ పాటించాలని, తక్కువ మంది పిల్లలను కనాలనే సందేశంతో ఈ నాటకం ముగుస్తుంది. ఇది కుటుంబ నియంత్రణ శాఖ యొక్క 'చిన్న కుటుంబం సంతోషకరమైన కుటుంబం' అనే భావనను తెలుపుతుంది. నాటక ప్రదర్శన కోసం తల్లి మెడలో ఉన్న ఒకే ఒక బంగారు నగని అమ్మేసి వచ్చిన సొమ్ముతో తొలి ప్రదర్శనను రవీంద్రభారతిలో ఏర్పాటు చేశారు. అయిదు వేలకు పైగా ప్రదర్శనలు పూర్తి చేసుకొని గిన్నిస్ బుక్‌లో చేరింది. మార్గరెట్ థాచర్, నెల్సన్ మండేలా, ఇందిరాగాంధీ వంటి ప్రముఖులు ఈ నాటకాన్ని తిలకించారు. బబ్బన్ ఒక్కరే చేయగల నాటకం 'అద్రక్ కే పంజే' అనడంలో ఎలాంటి సందేహం లేదు. చక్కటి సమాచారాన్ని అందించిన రచయిత ఎసికె. శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– **షేక్ మహమ్మద్ హుసేన్,** హైదరాబాద్ ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com – **ఎడిటర్**

ISSN 2581-3188

**విషయసూచిక**

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 10 పేజీలు : 60

జూన్ - 2026

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

వాణిజ్య ప్రకటనలు
**కె. సచిన్**
86866 64949

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**సూర్య దేవాలయం**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020
Mobile: 90599 50055
deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

## లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో



ఇంటి నెంబరు
20-6-296



యుద్ధోన్మాదం!
జీవరాశికి ప్రాణసంకటం!!

అజిత్ ఖాన్ జీవనయానం ..... దక్కన్ న్యూస్ ..... 6
మన ఆరోగ్యమే మన సంపద... (ఎడిటోరియల్) ..... వేదకుమార్. యం ..... 7
బ్రహ్మమణి ..... చకిలం వేణుగోపాలరావు ..... 9
కళలను ప్రోత్సహించే సమాజమే సంస్కృతిని కాపాడగలదు ..... కొత్వాల్ సచిన్ ..... 12
ఇంటి నెంబరు 20-6-296 ..... పరవస్తు లోకేశ్వర్ ..... 13
విదేశీ మద్యాన్ని రుచిచూచిన తెలంగాణా ..... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ..... 16
ప్రకృతి రాయబారి డేవిడ్ అటెంబరో ..... డా॥ ఆర్. సీతారామారావు ..... 17
చరిత్ర, సంస్కృతికి మ్యూజియంలే శాశ్వత నిలయం ..... కట్టా ప్రభాకర్ ..... 18
తెలంగాణలో పైశాచి భాష ..... ద్యావనపల్లి సత్యనారాయణ ..... 21
డెక్కన్ కోటలలోని ఫిరంగులు చరిత్రకు సజీవ సాక్ష్యాలు ..... డా॥ ఎస్. జైకిషన్ ..... 23
బెంగాలీ సంగీతంతో మైమరపించిన లమకాన్ వేదిక! ..... సంఘమిత్ర మాలిక్ ..... 25
వెనేడియం మూలకం యొక్క ఖనిజాలు ..... కమతం మహేందర్‌రెడ్డి ..... 27
ఇరానీ అనుబంధాన్ని చాటే సూర్య దేవాలయం ..... ఎన్. వంశీమోహన్ ..... 29
డెస్టినేషన్ తెలంగాణ - ది రోడ్ అహెడ్ ..... డా॥ నీరజ్ గోహిల్ ..... 34
గజేంద్రమోక్ష శిల్పం పామిడి గ్రామం ..... డా॥ జి.యస్. రామయ్య ..... 35
శ్రీనివాస రామానుజన్ సతీమణి జానకి అమ్మాళ్ ..... డా॥ నాగసూరి వేణుగోపాల్ ..... 37
రాతి కొండలపై రాచనగరం.. ..... డా॥ తుమ్మల దేవరావ్ ..... 39
సంగీతం ఒక మెడిసిన్ ..... జుగాష్‌విలి ..... 42
కాకతీయుల నాటి శివాలయం చరిత్ర తుడిపివేత ..... శ్రీరామోజు హరగోపాల్ ..... 43
యుద్ధోన్మాదం! జీవరాశికి ప్రాణసంకటం!! ..... డా॥ లచ్చయ్య గాండ్ల ..... 46
గన్‌ఫౌండ్రీలో స్వచ్ఛత కార్యక్రమం ..... సయ్యద్ ఖైజర్ ..... 49
అమోఘమైన రాతి సౌందర్యం ..... భూమన్ ..... 51
పప్పుధాన్యాల దిగుమతితో రైతులపై ధరల ఒత్తిడి ..... వివేక్ మిశ్రా ..... 53
ఆంగ్లేయులు: 1611-1947 ..... మహ్మద్ సిలార్ ..... 55
FBH 26 ఏళ్ల ప్రయాణం ..... శోభా సింగ్ ..... 57
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ..... ఎసికె. శ్రీహరి ..... 58

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

## ముంబయి వీధుల్లో మొదలైన అడుగులు...

## భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన

# అజిత్ జీవనయానం

అజిత్ భారతీయ హిందీ చిత్రసీమలో ప్రతినాయక పాత్రలకు కొత్త శైలి, గంభీరత, ప్రత్యేక వ్యక్తిత్వాన్ని అందించిన మహానటుడు. ఆయన అసలు పేరు హమీద్ అలీ ఖాన్. 1922 జనవరి 27న హైదరాబాద్ రాష్ట్రంలోని గోల్కొండ ప్రాంతంలో జన్మించిన అజిత్, భారతీయ సినీ చరిత్రలో "స్టైలిష్ విలన్"గా చిరస్థాయిగా నిలిచిపోయారు. పఠాన్ సంప్రదాయానికి చెందిన ఆయన కుటుంబ మూలాలు ఆఫ్ఘనిస్తాన్‌లోని కందహార్ ప్రాంతానికి చెందినవని, అక్కడి నుండి ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడినట్లు చారిత్రక వివరాలు తెలియ జేస్తున్నాయి. ఆయన తండ్రి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వద్ద డ్రైవర్‌గా పనిచేసేవారు. కుటుంబంలో క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. తన కుమారుడు వైద్యుడు లేదా న్యాయవాది కావాలని తండ్రి ఆశించినప్పటికీ, చిన్ననాటి నుంచే అజిత్ మనసు కళల వైపు మళ్లింది.



సినిమాల్లో నటించాలనే బలమైన సంకల్పంతో యువకుడైన అజిత్ హైదరాబాద్ నుండి ముంబయికి వెళ్లారు. అయితే ఆ ప్రయాణం అంత సులభం కాదు. ఆర్థిక ఇబ్బందులు, ఆకలి, ఆశ్రయం లేని రోజులు ఆయన జీవితంలో భాగమయ్యాయి. కొన్నిసార్లు రోడ్ల పక్కన, గటర్ల దగ్గర కూడా నిద్రించిన సందర్భాలు ఉన్నాయని ఆయన కుమారుడు షహ్‌జాద్ ఖాన్ తరువాత వెల్లడించారు. అయినప్పటికీ నటుడిగా ఎదగాలనే తపన ఆయనలో ఏమాత్రం తగ్గలేదు. చిన్న చిన్న పనులు చేస్తూ, స్టూడియోల చుట్టూ తిరుగుతూ అవకాశాల కోసం నిరంతరం ప్రయత్నించారు.

అజిత్ సినీ ప్రస్థానం చిన్న పాత్రలతో ప్రారంభమైంది. క్రమంగా ఆయనకు హీరోగా అవకాశాలు దక్కాయి. "బేకసూర్", "నాస్తిక్", "బడా భాయ్", "మిలన్", "బారా దరీ" వంటి చిత్రాల్లో హీరోగా నటించి మంచి గుర్తింపు పొందారు. తరువాత "ముగల్-ఏ-ఆజమ్", "నయా దౌర్" వంటి చిత్రాల్లో ముఖ్యమైన పాత్రలు పోషించారు. అయితే ఆ కాలంలో హీరోల మధ్య తీవ్ర పోటీ ఉండటంతో అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. అలాంటి సమయంలో ప్రముఖ నటుడు రాజేంద్ర కుమార్ ఇచ్చిన సలహా ఆయన సినీ జీవితాన్ని మలుపుతిప్పింది. హీరో పాత్రలకన్నా ప్రతినాయక పాత్రల్లో నటించాలని సూచించడంతో అజిత్ కొత్త దారిని ఎంచుకున్నారు.

"సూరజ్" చిత్రంతో అజిత్ ప్రతినాయకుడిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆ తరువాత "జంజీర్", "యాదోం కీ బారాత్", "కాలీచరణ్", "ప్రిన్స్", "సూరజ్" వంటి చిత్రాల్లో ఆయన నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ కాలంలో విలన్ పాత్రలు ఎక్కువగా గట్టిగా మాట్లాడే, కోపంతో ప్రవర్తించే విధంగా ఉండేవి. కానీ అజిత్ మాత్రం ప్రశాంతమైన గంభీరతతో, నెమ్మదైన సంభాషణ శైలితో, చిరునవ్వుతోనే భయాన్ని వ్యక్తపరచే వినూత్న నటనను తెరపై ఆవిష్కరించారు. సూట్‌లు, కళ్లజోడు, సిగరెట్ పట్టుకునే తీరు, గంభీర స్వరం ఆయనను ఇతర నటుల నుండి ప్రత్యేకంగా నిలబెట్టాయి. "లయన్" వంటి పాత్రల ద్వారా ఆయన అపారమైన ప్రజాదరణను సంపాదించారు.

అజిత్ పేరు వినగానే సినీ అభిమానులకు ముందుగా గుర్తుకు వచ్చేది "మోనా డార్లింగ్" అనే సంభాషణ. ఈ ఒక్క డైలాగ్ ఆయనకు చిరస్థాయి గుర్తింపును తీసుకువచ్చింది. తరువాత అనేక హాస్య కార్యక్రమాల్లో, సినిమాల్లో, వేదికలపై ఈ డైలాగ్‌ను అనుకరించారు. భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రసిద్ధి చెందిన ప్రతినాయక సంభాషణలలో ఇది ఒకటిగా నిలిచింది.

(మిగతా 8వ పేజీలో)




# మన ఆరోగ్యమే మన సంపద

ఎండలు మండిపోతున్నాయి. ఋతుపవనాలు వెనక్కి పోతున్నాయి. ఋతుపవనాలు వచ్చినా, వర్షాలు కురిసినా వేడిమి తగ్గే అవకాశాలు లేవని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. పర్యావరణంలోని అసమతుల్యత ఎండ తీవ్రతకి కారణమవుతుంది. తీవ్రమైన ఎండలు ప్రకృతిలోని ప్రతి జీవి జీవనశైలికి హాని చేస్తాయి.

భూగర్భ జలాలు ఇంకిపోతాయి. తాగునీటి కొరత ఏర్పడుతుంది. ఒంటిలో నీరు తగ్గి నీరసం వస్తుంది. వడదెబ్బ వల్ల నీరసము, దద్దుర్లు, కళ్ళనొప్పులు వస్తాయి. ఎండల నుంచి పూర్తి రక్షణ తీసుకోవాలి. మధ్యాహ్న వేళ బయటకు వెళ్లకూడదు. నీరు, కొబ్బరి నీరు, పళ్ళ రసాలు, మజ్జిగ వంటివి ఎక్కువగా తాగాలి. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. గొడుగు టోపీ వంటి రక్షణ కవచాలు ఉపయోగించాలి.

తీవ్రమైన ఎండ సమస్యను పర్యావరణంలో భాగంగా చూడాలి. పర్యావరణ పరిరక్షణ కోసం చేసే కృషిని తీవ్రతరం చేయాలి.

శుభ్రమైన గాలి, శుభ్రమైన నీరు, సరియైన పరిశుభ్రత స్థిరమైన పర్యావరణ వ్యవస్థలు మానవ ఆరోగ్యానికి కీలకం. పర్యావరణ మార్పులు, పర్యావరణ సమస్యల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి. పర్యావరణం కలుషితమైతే మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవన శైలీ వ్యాధులు సంభవిస్తాయి. ప్రతి సంవత్సరం 25% ప్రపంచ వ్యాధులు నేరుగా పర్యావరణ కాలుష్యం వల్ల వ్యాప్తి చెందుతున్నాయి.

పర్యావరణమంటే మన చుట్టూ ఉండే సహజ వాతావరణం గాలి, నీరు, భూమి, వృక్షజాతులు, జీవరాసులు, జంతుజాలాలు గురించి అవగాహన కల్పించడానికి, పరిరక్షించడానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు జరుపుకుంటున్నాయి.

ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి. దానికి నీరు పోసి సంరక్షించాలి. ప్లాస్టిక్ బదులు జనప నార, బట్ట సంచులు లేక పేపరు బ్యాగ్స్ వాడాలి. నీరు వృధా చేయకూడదు.

వాతావరణ కాలుష్యానికి మనం కారణం కాకూడదు అనే ప్రతిజ్ఞ తీసుకోవాలి.

చిన్న చిన్న ప్రయత్నాలే గొప్ప విజయానికి దారి చూపుతాయి.

కాలుష్యరహిత పర్యావరణ నిర్మాణం, రక్షణ మన రోజువారీ జీవితంలో భాగం కావాలి.

మన ఆరోగ్యమే మన సంపద.

మీ

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

అజిత్ వ్యక్తిగత జీవితం కూడా ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఆయన మూడు వివాహాలు చేసుకున్నారు. మొదట గ్వెన్ అనే ఆంగ్లో-ఇండియన్ మహిళను ప్రేమించి వివాహం చేసుకున్నారు. అయితే సంస్కృతి భేదాల కారణంగా ఆ వివాహ జీవితం ఎక్కువకాలం కొనసాగలేదు. వారికి సంతానం లేదు. తరువాత కుటుంబ సభ్యుల సూచనతో తన బంధువురాలు షాహిదాను వివాహం చేసుకున్నారు. ఈ దాంపత్య జీవితం ఎంతో ప్రశాంతంగా సాగింది. వీరికి షాహిద్ అలీ ఖాన్, జాహిద్ అలీ ఖాన్, అబిద్ అలీ ఖాన్ అనే ముగ్గురు కుమారులు జన్మించారు.



తరువాత అజిత్ జీవితంలో సారా ప్రవేశించారు. ఆమె అర్ధ కెనడియన్, అర్ధ భారతీయ ముస్లిం కుటుంబానికి చెందినవారు. ప్రముఖ నటుడు జయంత్ ద్వారా ఈ పరిచయం ఏర్పడిందని చెబుతారు. సారాతో అజిత్‌కు ఏర్పడిన అనుబంధం తరువాత మరో కుటుంబ జీవితం ప్రారంభమైంది. వీరికి షహ్‌జాద్ ఖాన్, అర్బాజ్ అలీ ఖాన్ అనే ఇద్దరు కుమారులు జన్మించారు. వీరిలో ముఖ్యంగా షహ్‌జాద్ ఖాన్ తరువాత హిందీ చిత్రసీమలో నటుడిగా గుర్తింపు పొందారు. “అందాజ్ అప్నా అప్నా” వంటి చిత్రాల్లో హాస్య పాత్రల ద్వారా ఆయనకు ప్రత్యేక ప్రజాదరణ లభించింది.

కుటుంబ జీవితంలో ఎన్నో సంక్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, అజిత్ తన పిల్లలందరికీ బాధ్యతగల తండ్రిగానే వ్యవహరించారని కుటుంబ సభ్యులు చెబుతారు. తన కుమారులు సినీ రంగంలోకి రావాలని చెప్పినప్పుడు కూడా ఆయన ఎలాంటి సిఫారసులు చేయలేదు. “నా పేరు ఉపయోగించుకోకుండా, మీ ప్రతిభతోనే ఎదగాలి” అని చెప్పేవారని షహ్‌జాద్ ఖాన్ వెల్లడించారు. ఈ ఆలోచన ఆయన వ్యక్తిత్వంలోని క్రమశిక్షణను, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

తెరపై ఎంత గంభీరమైన ప్రతినాయకుడిగా కనిపించినా, నిజజీవితంలో అజిత్ ఎంతో సాధారణ వ్యక్తి. సాధారణ దుస్తులు, పుస్తకాలపై ఆసక్తి, ప్రశాంత జీవనశైలి ఆయన వ్యక్తిత్వంలోని ముఖ్య లక్షణాలు. ఆర్భాటానికి దూరంగా ఉండే ఆయన రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా స్థిరపడ్డారు.

1981లో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న తరువాత ఆయన కొంతకాలం సినిమాలకు దూరమయ్యారు. అయినప్పటికీ ఆయన నటన ప్రభావం మాత్రం తగ్గలేదు. 1998 అక్టోబర్ 22న హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. ఆయన మరణం భారతీయ చిత్రసీమకు పెద్ద లోటుగా భావించబడింది.

నేటికీ హిందీ చిత్రసీమలో శైలీబద్ధమైన ప్రతినాయకుడి గురించి మాట్లాడినప్పుడు అజిత్ పేరు ముందుగా గుర్తుకు వస్తుంది. ఆయన గంభీర స్వరం, ప్రత్యేక సంభాషణలు, ప్రశాంత నటన, విలాసవంతమైన తెరప్రభావం భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన




పెద్దలు రాసిన పిల్లల కథలు
(ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300
ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# బ్రహ్మమణి/ Tektites

**భూ**మి మీద ఉన్న రత్నాన్ని భూమి నుంచి ఉద్భవించినవే. ఇందుకు భిన్నంగా అక్కడక్కడా పరిసరాల్లో ఉన్న శిలలకు ఏరకమైన సంబంధం లేకుండా ఉండే గాజు పదార్థాలు కనిపిస్తాయి. ఇవి తెలుపు, నలుపు, ఆకుపచ్చ వంటి వివిధ రంగుల్లో పారదర్శకంగా, అర్ధ పారదర్శకంగా లేక పారదర్శకంగా ఉండి పూసలు, కండెలు బిందువులు చక్రికలు వంటి వివిధ ఆకారాలుగా ఉంటాయి. వీటి పై కొన్ని ప్రత్యేక రకమైన గుంతలు గీతల వంటివి ఉంటాయి. భూ సంబంధిత గాజు పదార్థాల కంటే ఎంతో భిన్నంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిఉండే ఈ భౌమ్యేతరమైన గాజు పదార్థాలను సులభంగా గుర్తించవచ్చు. వీటిని టెక్టైట్, ఇంపాక్టైట్ వంటి శాస్త్రీయ నామాలతో వ్యవహరిస్తారు.



అనాదిగా వీటిని మానవులు పనిముట్లుగాను రత్నాలుగా వాడుతున్నారు. సహజంగానే వీటికి కొన్ని అతీత శక్తులు కూడా ఆపాదించడం జరిగింది.

**ఎలా ఏర్పడుతాయి:**

ఉల్కలు భూమిని ఢీ కొన్న సమయంలో వాయుమండలంలో ఎత్తుకు వెళ్ళి, వేల కి.మీ. దూరం వెదజల్లపడే గాజు పదార్థాలు టెక్టైట్ గాను, ఉల్కలు ఢీ కొన్న తర్వాత తక్కువ దూరంలో ఏర్పడిన లిబియన్ డెజర్ట్ గ్లాస్ వంటి ఇంపాక్ట్ గ్లాస్ మరియు సుయెవైట్ వంటి అయస్కాంత ఖనిజ ముక్కలు + గాజు కలిసిన శిలలు, షాటర్ కోన్స్ వంటి షాక్ వేవ్‌ల వల్ల శంఖాకారంగా మారిన శిలలు గాను లభిస్తాయి. వీటిలో అధిక సిలికా శాతం ఉండి నీరు లేకుండా ఉండటం, స్ఫటిక నిర్మాణం కూడా లేకుండా ఉండటం వీటి ప్రత్యేకత.



**టెక్టైట్ల ప్రధాన రకాలు**

ఉల్కల ప్రభావం వల్ల భూమి నుండి ఎగిసిపడిన శిలా పదార్థం గాలిలో చల్లబడి, గాజువలె గడ్డకట్టి తిరిగి భూమిపై పడటం వల్ల టెక్టైట్ లు ఏర్పడతాయి. వీటి మూలం, లభించే ప్రదేశం, వయస్సు మరియు రూపంలో భేదాలను బట్టి వీటి పేర్లు ఉంటాయి.

టెక్టైట్లు అవి ఏర్పడిన భౌగోళిక ప్రాంతం (స్ట్రూన్ ఫీల్డ్) ఆధారంగా వర్గీకరించబడ్డాయి.

**బెడియాసైట్లు**

అమెరికాలోని తూర్పు టెక్సాస్‌లో, ప్రధానంగా బెడియాస్ పట్టణం దగ్గర, సుమారు 9 కౌంటీలలో 7,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో కనిపిస్తాయి.

వీటి వయస్సు 3.4 కోట్ల సంవత్సరాలు. ఉత్తర అమెరికా స్ట్రెన్‌ఫీల్డ్‌తో సంబంధం కలిగి ఉన్నాయి. ఇది చెసాపీక్ బే ఇంపాక్ట్ క్రేటర్‌తో వల్ల ఏర్పడినవి. ఇవి ఎక్కువగా నలుపు రంగులో, అపారదర్శకంగా ఉంటాయి. అయితే కొన్ని సన్నని ముక్కలు పాక్షికంగా పారదర్శకంగా ఉంటాయి. ఈయోసీన్ అవక్షేపాలలో ఉండటం వల్ల రసాయనికంగా శిథిలమై, గుంటలు మరియు ఒరిపిడి గుర్తులు కలిగి ఉంటాయి.

పరిమాణంలో ఇవి చిన్నవి. వీటిలో అతిపెద్దవి 50 గ్రాముల కంటే ఎక్కువ బరువు ఉంటాయి. కొన్ని 200 గ్రాముల వరకు ఉంటాయి. మొదటిసారిగా 1936లో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌కు చెందిన జార్జ్ డి. రావ్‌సే వీటిని గుర్తించారు.

**బిల్లిటోనైట్లు (బటు సటమ్)**

ఇవి ఇండోనేషియాలోని బెలితుంగ్ ద్వీపం (పూర్వం బిల్లిటన్)లో ప్రధానంగా టిన్ మైనర్లకు ఒండ్రు నిక్షేపాలలో, కొన్నిసార్లు 30 అడుగుల లోతులో దొరికాయి.

వీటి వయస్సు సుమారు 7,50,000 సంవత్సరాల క్రితం ఆస్ట్రలేషియస్ట్రెన్‌ఫీల్డ్‌లో భాగంగా ఏర్పడ్డాయి.

ఇవి కాకి నలుపు రంగులో, నునుపైన ఎనామిల్ లాంటి మెరుపుతో ఉంటాయి. ఆమ్ల, టిన్-అధికంగా ఉండే భూగర్భ జలాల వల్ల ఏర్పడిన లోతైన, ఖ-ఆకారపు గాడులు మరియు గుంటలు వీటి ప్రత్యేకత.

గుండ్రంగా, కన్నీటి బొట్టు ఆకారంలో లేదా డంబెల్



ఆకారంలో ఉంటాయి.

స్థానికంగా వీటిని'బటు సటమ్' అంటారు. బెలితుంగ్ ద్వీపవాసులు వీటికి ప్రతికూల శక్తి నుండి రక్షించే మాయా శక్తులు ఉన్నాయని నమ్ముతారు.

**ఫీల్డ్‌ల ఆధారంగా వర్గీకరించబడిన మరికొన్ని ముఖ్యమైన రకాలు:**

1. ఆస్ట్రేలేషియన్ స్ట్రూన్ ఫీల్డ్ (సుమారు 7,80,000 సంవత్సరాల క్రితం భూమి పైకి వచ్చినవి).

ఇది అతి విశాలమైన మరియు అతి తక్కువ వయస్సు గల ప్రధాన స్ట్రూన్ ఫీల్డ్, భూమి మీద దాదాపు 10% వరకు విస్తరించి ఉంది.

**ఇండోచైనైట్లు:** ఆగ్నేయాసియా అంతటా లభిస్తాయి (థాయిలాండ్, వియత్నాం, లావోస్, కంబోడియాలలో). ఇవి సాధారణంగా నల్లగా ఉంటాయి మరియు "స్ప్లాష్ రూపాల" నుండి (కన్నీటి చుక్కలు, డంబెల్ ఆకారాలు) పెద్ద, బ్లాక్ లాంటి ముయాంగ్ నాంగ్-రకం పొరలు పొరలుగా ఉన్న టెక్టైట్ల వరకు ఉంటాయి.

**ఆస్ట్రలైట్లు:** ఆస్ట్రేలియాలో లభిస్తాయి. వాతావరణంలోకి తిరిగి ప్రవేశించేటప్పుడు ఏరోడైనమిక్ అబ్లేషన్ వల్ల ఏర్పడిన ప్రత్యేకమైన ఫ్లాంజ్డ్ బటన్ ఆకారాలకు ఇవి ప్రసిద్ధి.

**ఫిలిప్పినైట్లు (రిజాలైట్లు):**

ఫిలిప్పీన్స్‌లో లభిస్తాయి. సాధారణంగా నల్లగా, గుండ్రంగా ఉండి లోతైన, విలక్షణమైన "గుంటలు" లేదా గాడులతో ఉంటాయి.

2. మధ్య ఐరోపా స్ట్రూన్ ఫీల్డ్ (సుమారు 1.48--1.5 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడినవి)

జర్మనీలోని నోర్డ్లింగర్ రీస్ ఇంపాక్ట్ క్రేటర్‌తో సంబంధం కలిగి ఉంది.

**మొల్డావైట్లు:** ప్రధానంగా చెక్ రిపబ్లిక్‌లో లభిస్తాయి. ఇవి రత్నాలుగా చెలామణి అవుతున్న "జెమ్-క్వాలిటీ" టెక్టైట్లు, పారదర్శకమైన అడవి-ఆకుపచ్చ రంగు మరియు క్లిష్టమైన, ఫెర్న్ లాంటి ఉపరితల ఆకృతులు కలిగి ఉంటాయి.

3. ఉత్తర అమెరికా స్ట్రూన్ ఫీల్డ్ (సుమారు 3.4-3.5 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడినవి)

**చెసాపీక్ బే ఇంపాక్ట్ నుండి ఉద్భవించిన జార్జియైట్లు:**

ఇవి అమెరికాలోని జార్జియాలో లభిస్తాయి. ఇవి పారదర్శకమైన పసుపు-ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

4. ఐవరీ కోస్ట్ స్ట్రూన్ ఫీల్డ్ (సుమారు 10 లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడినవి)

ఘనాలోని లేక్ బోసుమ్ట్వి క్రేటర్‌తో సంబంధం కలిగి ఉంది.

**ఐవొరైట్లు:** కోట్ డి ఐవోర్‌లో లభించే అత్యంత అరుదైన నల్లటి టెక్టైట్లు.

**ఇతర ముఖ్యమైన ఇంపాక్ట్ గ్లాసెస్**

ఇవి నిజమైన దూరంనుంచి వచ్చిన టెక్టైట్లుగా వర్గీకరించబడనప్పటికీ, వాటితో దగ్గరి సంబంధం ఉన్న ఇంపాక్ట్ ద్వారా ఏర్పడిన గాజు పదార్థాలు:

**లిబియన్ డెసర్ట్ గ్లాస్:**

లిబియన్ డెసర్ట్ గ్లాస్ (Libyan Desert Glass - LDG) అనేది ఈజిప్ట్ మరియు లిబియా సరిహద్దుల్లోని సహారా ఎడారిలో దొరికే అత్యంత అరుదైన, పసుపు రంగు సహజ గాజు పదార్థం. సుమారు 29 మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడినది.

ఇది దాదాపు 98% స్వచ్ఛమైన సిలికా (Silica) కలిగి ఉంటుంది. ఇది భూమిపై దొరికే అతిపెద్ద ఇంపాక్ట్ గ్లాస్ (Impact Glass) క్షేత్రాలలో ఒకటి.

ఉల్కాపాతం (Meteorite impact) లేదా భారీ అంతరిక్ష శిల భూమిని ఢీకొట్టినప్పుడు ఏర్పడిన తీవ్రమైన ఉష్ణోగ్రత మరియు పీడనం కారణంగా ఇసుక కరిగి ఈ గాజు ఏర్పడిందని శాస్త్రవేత్తలు భావిస్తారు.ఇది పాలిమర్ పసుపు నుండి నిమ్మకాయ పసుపు రంగులో ఉంటుంది. ఇది కొంతవరకు పారదర్శకంగా లేదా అర్ధ-పారదర్శకంగా ఉండి, గాలి బుడగలను కలిగి ఉంటుంది.

ఈజిప్టు ఫారో రాజు తుతంఖామున్ (Tutankhamun) సమాధిలో దొరికిన నెక్లెస్‌లోని స్కారాబ్ (scarab) కీటకం బొమ్మ ఈ లిబియన్ డెసర్ట్ గ్లాస్ తోనే తయారు చేయబడింది, అనాదిగా దీనిని ఆభరణాల తయారీకి వాడుతున్నారు.

**డార్విన్ గ్లాస్**

టాస్మానియాలోని డార్విన్ క్రేటర్ దగ్గర లభిస్తుంది. సాధారణంగా ఆకుపచ్చ నుండి నలుపు రంగులో ఉండి తరచుగా వంకరగా లేదా క్రమరహిత ఆకారంలో ఉంటుంది.

**ఇర్గిజైట్లు:**

కజకిస్తాన్‌లోని ఝామన్షిన్ ఇంపాక్ట్ క్రేటర్ వద్ద నేరుగా

లభించే చిన్న చిన్న బిందువు లాంటి గాజు పదార్థాలు.

**మన సాహిత్యంలో:**

మన ప్రాచీన సాహిత్యంలో భౌమ్యేతరమైన గాజు పదార్థాలను బ్రహ్మ మణి, అగ్ని మణి, ఆకాశ మణి, చింతామణి వంటి పేర్లతో వ్యవహరించారు. ఈ పేర్లు లక్షణ పరమైనవి కాబట్టి వీటిలో ఇతర ఖనిజాలు కూడా ఉండవచ్చు. మన పురాణాల ప్రకారం మణులన్నీ సంహరించబడిన బలి రాక్షసుడి శరీర భాగాలే. ఈ తేజోమయ మణుల ప్రస్తావన ఇలా ఉంది;

*యే పతన్తి నగేన్ద్రేషు పావకాదిత్యవర్చసః ।*
*తత్ర తత్రైవ జాయన్తే మణయః పావకప్రభాః ॥*

**తాత్పర్యం:**

అగ్ని మరియు సూర్యుని వంటి తేజస్సు కలిగిన వలుని (వలాసురుని) శరీర భాగాలు ఏ ఏ శ్రేష్ఠమైన పర్వతాల మీద పడ్డాయో, ఆయా ప్రదేశాలలో అగ్ని వంటి ప్రకాశం కలిగిన రత్నాలు (మణులు) ఉద్భవించాయి.




సంస్కృత సాహిత్యంలో, బ్రహ్మమణి ప్రాథమిక మహా రత్నాల కంటే చాలా అరుదైనది.

ఆగమ శాస్త్రాలు, తాంత్రిక గ్రంథాలు మరియు లక్షణాల (శుభ సంకేతాలు) గురించి వివరించే పురాణ భాగాలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.

**స్కాంధ పురాణం:**

పంచభూతాల నుండి ఉద్భవించిన వివిధ మణుల గురించి స్కంద పురాణం పేర్కొంటుంది. బ్రహ్మమణి "బ్రహ్మవిద్య"ను ప్రసాదించే రత్నంగా వర్ణించబడింది.

*"బ్రహ్మరంధ్రసముద్భూతం బ్రహ్మమణిం విదుర్బుధాః।*
*తస్య దర్శనమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే॥"*

"బ్రహ్మరంధ్రం (ద్రైవిక శక్తి కేంద్రం) నుండి ఉద్భవించిన దానిని జ్ఞానులు బ్రహ్మమణిగా గుర్తిస్తారు. దీనిని దర్శించినంత మాత్రాన సర్వ పాపాల నుండి విముక్తి లభిస్తుంది." అని దీని భావం.

బృహత్ సంహిత (వరాహమిహిరుడు)లో

ఉల్కాపాతాల సమయంలో పడే ప్రత్యేక లక్షణాలు కలిగిన రాళ్ల గురించి పేర్కొన్నారు. సాధారణ ఖనిజాల కంటే భిన్నంగా ఉండే గాజు వంటి, నల్లటి, స్ఫటిక రహిత రాళ్లను విడిగా వివరించించారు. వరాహమిహిరుడు హిమాలయాల వంటి నిర్దిష్ట భౌగోళిక ప్రాంతం లో దొరికే సంపూర్ణంగా తెల్లగా, స్పష్టంగా ఉండి, అంతర్గత కాంతితో ప్రకాశించే రాళ్లను బ్రహ్మ మణులుగా వర్గీకరించారు.

**గరుడ పురాణం ప్రకారం**

*శుక్లః శశనిభః స్వచ్ఛః సర్వదోషవివర్జితః।*
*బ్రహ్మణో విహితో హ్యేష మణిరుత్తమలక్షణః॥*

"చంద్రుని వలె తెల్లగా, పారదర్శకంగా మరియు ఎటువంటి లోపాలు లేని ఆ రత్నం, అత్యున్నతమైన శుభ లక్షణాలను కలిగి ఉన్న బ్రహ్మమణిగా నిర్ణయించబడింది." అని దీని భావము.

సంస్కృత గ్రంథాలలో బ్రహ్మమణిని గుర్తించడానికి ఈ క్రింది వర్ణనలను గమనిస్తే ఇవిసాధారణంగా 'శుక్ల' (స్వచ్ఛమైన తెలుపు) లేదా 'పద్మ-వర్ణ' (తామర రంగు) కలిగి సహజంగా ఏర్పడే "బ్రహ్మ-రేఖలతో ఉంటాయి.

శక్తి కోసం అగ్నిమణి, వ్యాప్తి కోసం ఆకాశమణి ఉన్నట్లుగా, బ్రహ్మమణి ప్రత్యేకంగా 'సత్వ గుణాన్ని' పెంచడానికి, అంటే పవిత్రతను మరియు మేధోపరమైన స్పష్టతను పెంపొందించడానికి ఉపయోగపడుతుందని నమ్మేవారు.

'రస జల నిధి' వంటి గ్రంథాలలో బ్రహ్మమణి ప్రస్తావించబడింది, "దేహ-సిద్ధి" (శరీర పరిపూర్ణత) కోసం ఉపయోగించబడతాయని నమ్మేవారు.

ఆకాశం నుండి పడిన గాజు వంటి రాళ్లను (Tektites) గురించి ఇంకా మన ప్రాచీన సాహిత్యంలో అగస్త్యమతము (Agastyamata). "ఆకాశజ మణి" (ఆకాశం నుండి పుట్టిన రత్నాలు) అని పిలువబడే ఖగోళ మూలం ఉన్న రాళ్ల ప్రస్తావనలు ఉన్నాయి. స్ఫటిక నిర్మాణం లేని నల్లటి గాజు రాళ్లను గురించి ఇందులో ప్రస్తావన ఉంది. ఇది టెక్టైట్ (Tektite) లక్షణాలతో సరిపోలుతుంది.

**రత్నపరీక్షలో శక్కర ఫేరూ:**

భౌమ్యేతరమైన వివిధ రకాల గాజు వంటి రాళ్లను గురించి ప్రస్తావించారు. ఆకాశం నుండి పడే "దివ్య అగ్ని" ద్వారా ఈ రాళ్లు ఏర్పడినట్టు ఇందులో ప్రస్తావన ఉంది.

**మన దేశంలో:**

భారత దేశంలో టెక్టైట్‌లు తూర్పు కోస్తా ప్రాంతంలో అక్కడక్కడా లభిస్తాయి. చిల్కా సరస్సు ప్రాంతంలో లభించే ఆకుపచ్చ రంగు రాళ్ళు ఈ రకమైనవే అని శాస్త్రవేత్తల భావన. బంగాళాఖాతంలోని వండలి మట్టిలో కూడా లభిస్తాయి.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com






# కళలను ప్రోత్సహించే సమాజమే సంస్కృతిని కాపాడగలదు

## ● బి. నర్సింగ్ రావు ● బాల కళాకారుడు రిక్కీ తేజ్ చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన

ఏప్రిల్ 25న హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతికవేదిక లమకాన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాల ప్రతిభాశాలి రిక్కీతేజ్ రూపొందించిన "చార్కోల్ స్టోరీస్" చిత్ర ప్రదర్శన ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీదర్శకుడు, చిత్రకారుడు బి. నర్సింగ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై చిత్రాలను ఆవిష్కరించారు.

ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే రిక్కీ తేజ్ అసాధారణ కళా నైపుణ్యాన్ని కనబరుస్తున్నాడని అభినందించారు. ముఖ్యంగా పౌరాణిక కథాంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన బొగ్గు రేఖా చిత్రాలు జీవంతో నిండినట్లుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి చిత్రంలో భావవ్యక్తీకరణ, శిల్పనైపుణ్యం, ఆలోచనా లోతు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. కళ పట్ల అతనికి ఉన్న అంకితభావం భవిష్యత్తులో అతన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, మట్టి కళలు, క్రీడలు వంటి సృజనాత్మక రంగాలలో పాల్గొనాలని సూచించారు. కళలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే శక్తిగా నిలుస్తాయని చెప్పారు. "కళలు వికసిస్తే సంస్కృతి వికసిస్తుంది" అని ఉద్ఘాటిస్తూ, కళలను సాధించడం మాత్రమే కాదు, వాటిని ఆస్వాదించడం కూడా గొప్ప అనుభూతి అని తెలిపారు. తెలంగాణ నేల కళలకు పుట్టినిల్లుగా నిలిచిందని, ఇలాంటి బాల ప్రతిభలను ప్రోత్సహించడంలో రాష్ట్రం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

సీనియర్ పాత్రికేయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రిక్కీ తేజ్ చిత్రాలలో కనిపిస్తున్న భావవ్యక్తీకరణ ఎంతో ఆకట్టుకుందని అన్నారు. బాలచెలిమి పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సాహిత్య, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ గారు చిన్నారుల్లో పఠనాసక్తి, సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించే దిశగా బాలచెలిమి మాస పత్రిక ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు.

సంపాదకీయ వ్యంగ్యచిత్రకారుడు నర్సిం మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యతో పాటు కళలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రూప్-1 అధికారి డాక్టర్ సాహితి మాట్లాడుతూ, పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే తల్లిదండ్రులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. తుమ్మలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేముల సైదులు మాట్లాడుతూ, రిక్కీ తేజ్ విద్య, కళలు, క్రీడలు, సామాజిక స్పృహ వంటి అనేక రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నాడని ప్రశంసించారు.

రిక్కీ తేజ్ తండ్రి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ చిత్ర ప్రదర్శన విజయవంతం కావడానికి సహకరించిన బాలచెలిమి సంస్థకు, ముఖ్య అతిథి బి. నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, నర్సిం, సాహితి, సైదులు, ఉపాధ్యాయులు, కళాభిమానులు, విద్యార్థులు, స్నేహితులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

– కొత్వాల్ సచిన్, m : 86866 64949
e: desk.deccan@gmail.com

# ఇంటి నెంబరు 20-6-296

అప్పటికింకా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించనే లేదు. 1948 సెప్టెంబరు పోలీస్ యాక్షన్ కూడా జరగనేలేదు. అలనాటి నైజాం రాజ్యంలోని హైద్రాబాద్ బల్దియా వారు మా ఇంటికి కేటాయించిన నంబరు 20-6-296. అనగా దాదాపు ఎనిమిది దశాబ్దాల క్రిందటి ఇంటి నెంబరు ఇది. ఈ నెంబరు ఇప్పటికి కొనసాగుతూనే ఉంది. పవిత్ర గంగా నది గోముఖ్‌లో, గోదావరి నది త్రయంబకంలో, కృష్ణానది మహాబలేశ్వరం కొండకోనలలో పుట్టినట్లు నా సుదీర్ఘ జీవన యానం ఇంటి నెంబరు 20-6-296 నుండి ప్రారంభమై నేటికీ నిరంతర ప్రవాహంగా ప్రవహిస్తూనే ఉన్నది. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే నా అస్తిత్వం, నా ఐడెంటిటీ, నా పతా, నా అడ్రస్, నా చిరునామా ఏదైనా కానివ్వండి ఆ ఇంటి నెంబరు 20-6-296లనే దాగి ఉన్నది. పవిత్ర ఖురాన్‌లో 786 నెంబరుకు ఎంత ప్రాధాన్యత ఉన్నదో నా జీవితంలో 20-6-296కు కూడా అంతే ప్రాముఖ్యత ఉన్నది. ఈ నెంబరు కేటాయించిన ఆనాటి నైజాం బల్దియా వారికి నా హృదయపూర్వక ఆకుపచ్చ సలాంలు.



బల్దియా అంటే మున్సిపాలిటీ లేదా తెలుగులో పురపాలక సంస్థ. ఉర్దూలో బల్దా అంటే ప్రాంతం. ఆ పదం నుండే బల్దియా అన్న పదం పుట్టింది. 1908లో నగరంలో మూసీ వరదలు వచ్చిన తర్వాత నైజాం సర్కారు సిటీ ఇంప్రూవ్‌మెంటు బోర్డు (సీఐబీ) అనే సంస్థను ప్రారంభించినంక హైద్రాబాద్ నగరాన్ని అనేక వార్డులుగా విభజించి ప్రతి వార్డుకు అక్కడి ప్రజలు ఒక కౌన్సిలర్‌ను ఎన్నుకునే ఏర్పాటు చేశారు. వారు ఐదు సంవత్సరాలు పదవిలో ఉండి ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ ప్రజాసేవలో ఉండేవారు. తర్వాత కాలంలో వారు తమ విధులను విస్మరించి "అమ్యామ్యాలకు" అలవాటు పడేసరికి విసుగెత్తిన ప్రజలు "బల్దియాపై వ్యంగ్యంగా విసుర్లు ప్రారంభించారు.

అది :

"పాంచ్ సాల్ కా బల్దియా
ఖాయా, పియా చల్దియా"

ఆ వారసత్వం ఇప్పటి కార్పొరేటర్లలో కూడా కొనసాగటం జగమెరిగిన సత్యమే కదా!

తోకలేని పిట్ట తొంబై ఆమడల దూరం ప్రయాణించిందట. పోస్టు కార్డుకు సంబంధించిన సామెత లేదా పొడుపు కథ అది. పామర జనం నోళ్లల్ల 'కార్డు' అన్న పదం నాని, నాని 'కారట్' అయ్యింది. లేదా ఉత్తరంగా మారింది. మా శాలీబండల ఒక పోస్టు ఆఫీసు ఉండేది. మేం దానిని 'టపాఖానా' అనే వాళ్లం. హిందీలో 'డాక్ ఘర్'. పోస్ట్‌మ్యాన్‌ను టపాజవాన్ అని పిలిచేవాళ్లం. ఈ ఖానా అన్న పదం ఉర్దూనే అయినా మూలం మాత్రం అరబ్బీనో, ఫార్సీనో కావచ్చు. మా చిన్నతనంల నగరంల చాలా 'ఖానా'లు ఉండేటివి.

దవాఖానా, ఖైద్‌ఖానా, యతీమ్‌ఖానా, పాయిఖానా, ఖుతుబ్ ఖానా ( గ్రంథాలయం) దివాన్‌ఖానా, మెహమాన్ లాంటివి. ఇప్పుడంటే సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల యుగం వచ్చి సమాచారాలు చిటికెల మీద అందుతున్నాయి. కాని మా చిన్నప్పుడు బంధుమిత్రుల క్షేమసమాచారాలు తెలుసుకోవటానికి కారట్ ముక్క ఒక్కటే గతి. దూరాలను కలిపే దారాలు ఆ రోజులల్ల ఉత్తరాలు మాత్రమే. చాలా కారట్ల మీద "శ్రీరాములు నీవే కలవు" అన్న టైటిల్‌తో ప్రజలు ఉత్తరం ప్రారంభించేవారు. దేవుడు, దయ్యం పట్ల భయభక్తులు కల్గిన సత్యకాలం అది. పాతనగరం కార్వాన్ దగ్గిర 'టపాచబూత్రా' అనే ఒక చౌరాస్తా ఉంది. ఖుతుబ్‌షాహీ నవాబుల కాలం అక్కడ 'టప్పా'ను వివిధ ప్రాంతాలకు పంపే ఒక 'ధఫ్తర్' (ఆఫీసు) ఉండేది. అట్లా అది టపా చబుత్రాగా నామకరణం జరిగి ఇప్పటికీ అట్లనే వర్ధిల్లుతుంది.

'నోట్లో పాన్ ఇంట్లో ఫోన్' అన్న సామెత ప్రజల దర్జాకు, హోదాకు సంబంధించినది. మా బాపుకు నోట్లె పాన్ ఎప్పుడూ ఉండేది. కాని మా ఇంట్ల ఫోను మాత్రం లేకుండే. ఒక్క మా ఇంట్లనే కాదు పాతనగరంలనే ఫోన్ ఒకరిద్దరి ఇండ్లల్ల మాత్రమే విలసిల్లే విలాసవంతమైన వస్తువు. కావున ఇందు మూలంగా తెలియచేయునదేమనగా ప్రజలందరూ తమతమ బాగోగులు, క్షేమ సమాచారాలు తెలుపటానికి "తోకలేని పిట్ట మీదనే" ఆధారపడేవారు. నైజాం రాజ్యం మొహర్ (ముద్ర) ఉన్న కారట్ టప్పాఖానాల బుడ్డపైసకో, పెద్ద పైసకో దొరకేది. అది నైజాం "హాలీ' కరెన్సీ జమానా, మా ఇంటికి వచ్చే కారట్ల మీద మా ఇంటి పతా (అడ్రసు లేదా చిరునామా, లేదా ఇంకనూ వివరంగా చెప్పాలంటే విలాసము) ఈ క్రింది విధముగా రాయబడేది.

టు:
పేరు: పి. జియ్యరుస్వామి
గల్లీ: నానక్ బావులీ (బౌలీ)
ఘర్‌కా నంబర్: 20-6-296
మోహల్లా : రూప్‌లాల్ బజార్
ఫోస్టు : శాలిబండా
షహర్ : హైద్రాబాద్ దక్కన్.

కారట్ల మీద మా ఇంటి పతా ఇంత ఖుల్లంఖుల్లాగ ఉంటే టపా జవానే కాదు కండ్లు కనబడని గుడ్డోడు భీ చాలా ఆసాన్‌గ ఆ ఉత్తరాన్ని మా ఇంటికి వచ్చి అందిచ్చెటోడు. ఆ రోజులల్ల మా పాతనగరంల గల్లీలకేం తక్కువ, బస్తీలల్ల సందుగొందులకేం తక్కువ? ప్రతి బస్తీల, వాడకట్టలల్ల పద్మవ్యూహం లాంటి గల్లీలు. అందుకే మన గోరెటి వెంకన్న "గల్లీ సిన్నదీ" అన్న పాట రాసిండు. మా గల్లీ ఎదురుంగ ఉండేదే నానక్ బౌలీ, దాని నీళ్లను ఎవరూ వాడనందున బాగా నాచుపట్టి ఆకుపచ్చ రంగుతో చిన్న తటాకంలా కనబడేది. పాత నగరంల చాలా బస్తీలు ''బౌలీ''ల పేర్లతో విలసిల్లినవి. హరీబౌలీ, దూద్‌బౌలీ, హమామ్ బౌలీ, రేతీబౌలీ, ఇంజన్ బౌలీ ఇట్లన్న మాట. చెరువులకు కూడా ఏం కొదువ లేకుండే. మీరాలం చెరువు, జల్‌పల్లి చెరువు, రా చెరువు (ఇప్పటి పేరు తలాబ్ కట్ట), సరూర్‌నగర్ చెరువు. ఇటువంటి అనేక చెర్వులను, కుంటలను తర్వాత కాలంల భూ భకాసురులు ఆక్రమించి రియల్ ఎస్టేట్ దందాలు చేసే సరికి మన 'ముల్కీల' గుండెలు చెరువులైపాయె.



మరి మా గల్లీ ఎదురుంగ ఉన్న బౌలీకి "నానక్" అన్న పేరు ఎందుకొచ్చిందో నాకు సమజ్ కాక చాలా మందిని అడిగి కోశీష్ చేసిన. ఎవడ్ని అడిగినా "మేరే కో మాలూం నహీం" అన్న జవాబ్ మాత్రమే వచ్చింది. ఇగ ఆఖరీల పంజాబు నుండి సిఖ్ఖు మత గురువు గురునానక్ వచ్చి ఆ తటాకం వద్ద బసచేసి ఉండొచ్చని నాకు నేను నచ్చ చెప్పుకుని "ఖుష్" ఐన.



ఇగ మా మొహల్లా "రూప్ లాల్ బజార్". బౌలీని వదిలిపెట్టి మా బజార్‌కు రూప్‌లాల్ అన్న పేరెట్ల వచ్చిందోనని మల్లీ "తవ్వకం పనులు" శురూ చేసిన. మేం కొంతమంది దోస్తులం ప్రతిదినం "పటేల్ ప్లే గ్రౌండ్"ను ఆనుకుని ఉండే చమన్‌ల సాయంత్రాలు కల్సుకుని ఆవగింజ దగ్గర్నుండి ఆటంబాంబు వరకు చర్చలు చేసి కోడి గుడ్డు మీద ఈకలు పీకి పీకి రాత్రయ్యేసరికి ఆకలయ్యి ఇండ్లల్లకు ఉడాయించేవాళ్లం. ఒక దినం నేను "అరే భై ఈ రూప్‌లాల్ అనేటోడు ఎవ్వడు భై. వాని పేరు మీద ఈ బజార్ ఎందుకు ఏర్పడింది" అని భయపడుకుంటనే అడిగిన. షోలే సీన్మాల హేమామాలిని అందం గురించి రసవత్తర చర్చలో మునిగున్న వాల్లందరికీ నా ప్రశ్నతో ఒళ్లు బగ్గున మండి "పనిలేనోడు పిల్లి తల కొరిగిండన్నట్లు నీకిదేం బుద్ధిరా బోసిడీకే! ఎప్పుడూ బౌలీలు, బస్తీలు, బజార్ల పేర్లు వెదుకుతుంటావ్ అని అందరూ కయ్యిమని అరచి నా నోరు మూపిచ్చింద్రు. అయినా నేను "హమ్ నహీం సుద్‌రింగే" బాపతు కావున చానా దినాలు దేవులాడి దేవులాడి "బజార్ అన్న పదం పర్షియన్ భాష నుండి వచ్చిందనీ, చాలా ఇస్లామిక్ దేశాలలో ఈ బజార్ అన్న పదం ఉంటదని తెలుసుకుని మల్లీ ఏనాడో చచ్చి సమాధిలో సుఖంగా నిద్రపోతున్న "రూప్‌లాల్" కోసం వెదకటం శురూ చేస్తే ఆఖరీల తెల్సిందేమిటంటే ఆరవ నిజాం మహబూబ్ అలీ పాషా జమానాల మహారాజా కిషన్ పర్షాద్ దివాన్ గ పని చేస్తున్నప్పుడు హైద్రాబాద్ కోత్వాల్ దఫ్తర్‌ల ఇంకో కాయస్తాయిన "రూప్‌లాల్" పోలీస్ అమీన్‌గ పని చేసేటోడట. ఆ అమీన్ సాబ్ దొంగల దగ్గరా, దొరల దగ్గరా బాగా దాక్ బిఠాయించి అడ్డదిడ్డంగా కమాయించి రాత్రోరాత్రి అమీర్ అయ్యిండట. ఆయన లాఠీ ఝుళిపింపులకు బయపడిన ప్రజలందరూ ఆయన నివసించే బస్తీకి "రూప్‌లాల్ బజార్" అని పేరు పెట్టింద్రట. "జిన్‌కా లాఠీ ఉన్‌కా బస్తీ" అన్న మాట.

ఇగ శాలిబండ పేరు ప్రఖ్యాతుల గురించి నేనెంత చెప్పినా తక్కువే గద. 1960లల్ల ఎల్.ఆర్. ఈశ్వరి అనే మైకం కమ్మిన మత్తుగొంతు హస్కీ విస్కీ గాయిని "పట్నంలో శాలిబండా పేరైనా గోలుకొండా" అని పాడి హోల్ ఆంధ్రప్రదేశ్‌కు శాలిబండ ఘనత గురించి ఢంకా బజాయించి చెప్పకనే చెప్పే.

కావున పాఠక సుజనులారా మల్లీ మనం మా 20-6-296 ఇంట్లకు పోదాం పదుండ్రి. ఎంత చెప్పినా వొడవని ముచ్చట అది.

నేను పుట్టిందేమో అలియాబాద్ కుర్మగూడెం బస్తీల. నాకు ఐదు ఏండ్లు ఉన్నప్పుడు ఆ ఇల్లుగల్లాయన ఫౌరన్ ఇల్లు ఖాళీ చేయమని హుకుం జారీ చేసిండట. అప్పుడు మా అమ్మా బాపులు "ఇల్లో రామచంద్రా" అని కిరాయి ఇంటి కోసం అన్ని బస్తీలల్ల దేవులాట శురూ చేసింద్రంట. పాత నగరంల అన్నీ గల్లీలు, బస్తీలు కాలికి బలపం కట్టుకుని తిరిగినా సరైన కిరాయి ఇల్లు ఎక్కడ భీ దొరకలేదట. ఇగ ఆఖరీల రూప్‌లాల్ బజార్ బస్తీలకు ప్రవేశించి నలుగురిని అడుగుతుంటే దారిన బోయే దానయ్య ఒకడు వాల్లకు అడ్డంవొచ్చి "ఏం పరేషాన్ కాకుండ్రి అగో ఆ నానక్‌బౌలీ గల్లీల ఒక మరాఠీ ముసలాయన ఇల్లు బేరానికి తయ్యార్‌గ ఉన్నది అని ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడట. అట్ల మా అమ్మాబాపు ఇంటి నెంబరు 20-6-296ల కుడికాలు బెట్టి లోపలికి పొయ్యింద్రట.

లోపలికి పోంగనే దట్టంగా పూసిన మల్లెపూల చెట్టు ఘుమఘుమల సువాసనలతో వారికి స్వాగతం చెప్పిందట. ఎండలబడి చెమటలు కారుతూ వచ్చిన వారిద్దరి పైన పరుచుకున్న మల్లెపూల పచ్చని పందిరి చల్లని నీడ అందించి సేద తీర్చిందట. వాళ్లిద్దరికీ ఏదో ముని వాకిట్లోకి ప్రవేశించినట్లు సంతోషం కల్గిందట. ఎడమవైపు ఖాళీ స్థలంలో ఒక జామచెట్టు నిండా విరగపండిన జాంపండ్లతో తియ్యటి సువాసనతో స్వాగతం పలికిందట. దాని పక్కనే పొడుగ్గా నిలబడ్డ పొప్పడిపండ్ల చెట్ల ఆకులు గాలికి గలగలా లోపలికి రాంఢ్రి అని తన నిశ్శబ్ద భాషలో ఆహ్వానించిందట. నా మాతాపితరులకు అవన్నీ శుభసంకేతాలు, శుభసూచనలుగా అన్పించి లోపలికి పోంగనే ఒక మరాఠీ పండు వృద్ధుడు ఎదురుగా వచ్చి "క్యా పాయిజే"? అని తన భాషలో పలకరించిండట. అంటే ఏం కావాలి అని అర్థం. అప్పుడు మా బాపు "ఘర్ కీ తలాష్ మే హమ్ ఆయేహైఁ" అని ఫసీ (స్వచ్ఛమైన) ఉర్దూలో జవాబిచ్చిండట.



అప్పుడా వృద్ధుడు మా బాపుకు సంబంధించిన కైఫియతులు, మతలబులూ అన్నీ విచారించి మీరు మాస్టర్‌సాబ్ కావున కిరాయకు కాదు గాని, ఇది మా తాతల ఇల్లు మీకు చాలా అగ్గువకు, సస్తాగా తక్కువ ధరకు అమ్ముతా ఇది చాలా మంచి, చల్లని ఇల్లు. మీరు మీ పిల్లా పాపలతో కలకాలం చిరకాలం కాచిపూసిన పచ్చని చెట్టులా వర్ధిల్లుతారు అని నచ్చచెప్పాడట. మా అమ్మకు హిందీ రాదు, ఉర్దూ రాదు. "ఈ ముసలాయన ఏమంటున్నాడూ? అని బాపును అడిగితే.. "ఇల్లు అగ్గువ ధరకు అమ్ముతా అంటున్నాడు" అని తర్జుమా చేసి చెప్పాడట.

అప్పుడు ఆ దివ్యక్షణాన ఆ ముసలాయన సమక్షంలో మా అమ్మ కండ్ల ముందు అమావాస్య చీకటి ఆకాశంలో వెలిగే నక్షత్రాలు మిలమిలా మెరిసాయి. మండుటెండల ఇసుక ఎడారిలో చల్లని చలివేంద్రం లాంటి ఒయాసిస్ కనిపించింది. మిట్ట మధ్యాహ్నపు మండే ఎండ పగలే వెన్నలగా మారిపోయింది. కష్టాల కడలిలో కిరాయి ఇండ్లల్లో అష్టకష్టాలతో ముందుకు సాగుతున్న జీవిత నావ ఒక తీరానికి చేరుకున్నట్లు అనిపించింది.

"ఎంతకిస్తడో అడగరాదా" అని ఆశతో అడిగింది.

కాటికి కాళ్లు చాపుకున్న ఆ మరాఠీ బ్రాహ్మణ పండితుడు ఎక్కువ బేరసారాలు చేయకుండానే చాలా దయతో పన్నెండు వందల హాలీసిక్కా రూపాయలకు ఇల్లు అమ్మకానికి పెట్టాడు.

ఆ పన్నెండు వందల మాట వినగానే మా బాపుకు మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు అయ్యి గుడ్లు వెళ్లబెట్టాడు. ఆయన సాదా సీదా సర్కారీ ప్రైమరీ ఇస్కూలుకు ఒక చిన్న మాస్టార్ సాబ్. పహెలీ తారీఖున వచ్చే తనఖాతో దినదినగండం నూరేళ్ల ఆయుస్సులా సంసారపు బండిని లాగుతున్న ఒక చిరుద్యోగి. 1200 మాట వినేసరికి ఒక్క మినిట్ల ఆయన ప్రాణం పరేషాన్ అయ్యింది. కాని మా అమ్మ తరీఖానే వేరు. ఆమె జర గట్టిపిండం. నావ నడిసముద్రంలో మునిగినా తీరం చేరేదాక ఈతగొట్టే మనిషి ఆమె.

భాష రాకున్నా అమ్మ తన తెలుగులనే ముసలాయనతో బ్రతిమిలాడటం శురూ చేసింది. ఆయనకు ఏం అర్థమయ్యిందో పైనున్న పెరుమాళ్లకే తెలుసుగాని, వైష్ణవ సంప్రదాయం ప్రకారం గోచీకట్టు చీరలో ఉన్న అమ్మను చూసి మరాఠీ చీరకట్టు సాంప్రదాయానికి దగ్గరగా ఉండటం ఆయనకు నచ్చింది. ఒక ఆడ మనిషి తనను అంతగనంగ బ్రతిమిలాడటంతో ఆయన మనసు పానీపానీ ఐపోయింది. కరిగిపోయింది.

సరే ముందు వెయ్యి రూపాయలు ఇవ్వండి. ఆ తర్వాత జల్దీ ఏం లేదు మీ సహూలత్‌ను బట్టి ఎటువంటి మిత్తి లేకుండనే కొంచెంకొంచెం ఇవ్వండి అని బాపుకు ఉర్దూలో సమ్జాయించిండు. ఆ దయగల్ల మాటలు విన్న మా అమ్మాబాపు కుంటివాడు ఏనుగు ఎక్కినంత సంబరపడ్డారు. మా బాపు హమేషా అన్ని దినాలలోనూ "ఉత్త చేతుల భిక్షపతే" ఆయన చిన్న జీతంతో ఆరుగురు పిల్లలతో ఇల్లు గడవటమే చాలా కటపిటగా ఉండేది. జీవితం అతుకుల బొంత మాదిరిగా పైకి గుంజితే కాళ్లకు సరిపోదు. కాళ్లకు కప్పుకుంటే తలకు సరిపోదు.

ఇంటికి వచ్చినంక మా అమ్మ పురుసత్‌గ కూచుని తన దిమాక్ లడాయించి ఒక నిర్ణయం తీసుకుంది. తన తల్లిగారు పసుపుకుంకుమల క్రింద పెట్టిన బంగారం గ్యాపకానికొచ్చింది. నాను, కంటె, గొలుసులు, ముక్కు చెవులుకున్న వస్తువులన్నీ మూటగట్టి మార్వాడీ సేటు దగ్గర "గిర్వీ" పెట్టమని బాపుకు చెప్పింది. ఆ సేట్ చాలా కంజూస్. ఏదో మెహర్బానీ చేస్తున్నట్లు రెండువేలు విలువజేసే ఆ నగలకు వేయి రూపాయలు మాత్రమే ఇచ్చి, నెలనెలా ఠంచనుగా మిత్తీలు ఇంటికొచ్చి వసూలు చేసుకునేవాడు. అట్ల అమ్మ తెగింపు పుణ్యమా అని ఇంటి నెంబరు 20-6-296 ఆమె పేరు మీదనే రిజిష్ట్రీ అయ్యింది. ఇగ మిగిలిన కథ వచ్చే నెలల చెప్త. జర సబర్ చేయండి.

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# విలాసపురుషులకు నజరాణా రెండువేల ఏళ్లనాడే విదేశీ మద్యాన్ని రుచిచూచిన తెలంగాణా

ఇప్పుడే కాదు, రెండు వేల సంవత్సరాలనాడే తెలుగువారికి విదేశీ వస్తువుల పట్ల మోజు, క్రేజీ ఉండేదని అలనాటి పురావస్తువులు తెలియజేస్తున్నాయి. రేవు పట్టణాల దగ్గర, పడవలు, ఓడలు, లంగరు వేయక ముందే రావల్సిన విదేశీ వస్తువుల్ని సొంతం చేసుకోవటానికి ఎంత సొమ్మైనా వెచ్చించటానికి పోటీపడ్డ ఆధారాలున్నాయి. ఇనుపయుగంలో ప్రారంభమైన తెలుగువారి సముద్రయానం, శాతవాహన కాలానికి ఊపందుకొంది. తీరాంధ్ర రేవుపట్టణాల ద్వారా ఇటలీ లాంటి దేశాలతో సాగించిన తెలుగువారి విదేశీ వర్తకం సా.శ.పూ.1వ శతాబ్ది నుంచి సా.శ.3వ శతాబ్ది దాకా మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది. స్థానిక వ్యాపారుల గల్లాపెట్టెలు రోమను నాణేలతో గలగలలాడేయి. ప్లినీ, టాలెమీ రాసిన గ్రంథాలు, తెలుగు నేలతో సాగిన రోమను వర్తక, వ్యాపార వివరాలనందిస్తున్నాయి. ఇక్కడి నుంచి వచ్చే నాణ్యమైన, మన్నికైన విదేశీ విలాసవస్తువులకోసం, రోమన్ ప్రజలు అర్రులు చాచేవారని ప్లినీ, సా.శ.80లో రాసిన 'నేచురలిస్ హిస్టోరియా'లో ఉంది. తెలంగాణాలోని పెద్దబంకూరు, ధూళికట్ట, కోటలింగాల, ఫణిగిరి, ఏలేశ్వర,ం కూడలి సంగమేశ్వరం, అక్కినేపెల్లి, నుస్తులాపూర్, ధర్మవారిపాలెం, నాగవరప్పాడు, కొండాపూర్ మొదలైన చోట్ల రోమన్ నాణేలు బయల్పడినాయి.



ఇదంతా ఒక ఎత్తైతే, నల్లగొండ జిల్లా కృష్ణాతీర ప్రాచీన స్థావరం ఏలేశ్వరం తవ్వకాల్లో రోమన్ నాణేలతో పాటు అందమైన రోమన్ సుందరీమణుల బొమ్మలున్న మట్టి బొమ్మలు, నునుపైన ఉపరితలతో నాజూకైన రోమన్ మట్టి మద్యం పాత్రలు కూడా బయల్పడటంతో, విదేశీ వస్తువులపట్ల రెండువేల ఏళ్ల నాడే తెలుగు వారు ఎంతమోజు పడ్డారో తెలుస్తుంది. ఆనాడే విదేశీ మద్యాన్ని రుచి చూచిన తెలంగాణా, విదేశీ మద్యాన్ని విలాస పురుషులకు నజరాణాగా అందించి, నాగరిక జీవనంలో ఒక మైలురాయిగా నిలిచింది.

(వారసత్వ తెలంగాణా శాఖకు కృతజ్ఞతలతో...)

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# ప్రకృతి రాయబారి

# డేవిడ్ అటెంబరో @ 100

మే 8వ తారీఖున శ్రీ ఊహాగారి ఫేస్‌బుక్‌లో వాల్ మీద ఒక పోస్ట్ కనిపించింది. ఆ పోస్ట్ నాకు ఒకింత ఆనందాన్నివ్వటమే కాకుండా రవ్వంత ఆశ్చర్యాన్ని కలిగిచింది. రెండు తెలుగు రాష్ట్రాలలో వేల సంఖ్యలో కవులు, రచయితలు, కథకులున్నారు. వీరెవ్వరికీ డేవిడ్ అటెంబరో తెలుసో లేదో కానీ, శ్రీ ఊహగారికి అటెంబరో ఎవరో, ఆయన చేసిన కృషి ఏమిటో తెలిసి ఉన్నందుకు సంతోషం కలిగింది. ఒక్కరికి మాత్రమే అటెంబరో తెలిసి ఉండటం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అందరికీ అన్ని విషయాలు తెలిసి ఉండాలన్న నియమమేమీ లేదు కానీ, ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో పర్యావరణ సంబంధమైనవి కూడా ఉండటం వల్ల తెలిసి ఉండాలని ఆశించడంలో తప్పేమీ లేదనుకుంటాను. శ్రీ ఊహ చాలా మంచి కథలు రాశారు. రాస్తున్నారు. అయితే పురుష రచయితలకు వచ్చినంత పేరు ప్రఖ్యాతులు స్త్రీలకు రావటం అరుదు కనుక, శ్రీ ఊహకు ఇప్పుడొచ్చిన పేరు కంటే ఎక్కువే రావల్సి ఉంది. అయితే నేనెందుకు ఎక్కువ ఆనందించానంటే డేవిడ్ అటెంబరో పైన ఒక పోస్ట్ పెట్టారు. అంటే బహుశా పర్యావరణం నేపథ్యంగా ఒక నవలో, కథలో శ్రీ ఊహ తప్పక రాస్తారనే నమ్మకం చేత.




ఇంతకీ ఈ డేవిడ్ అటెంబరో ఎవరు? 1926 మే 28న ఇంగ్లాండులో పుట్టారు. అంటే మే 8, 2026 నాటికి ఆయన నూరు సంవత్సరాలు నిండాయి. ఒక వ్యక్తి నిండా నూరేళ్లు జీవించి ఉండటం గొప్పే మరి. ఆయన ఎందుకు ప్రఖ్యాత వహించాడంటే దాదాపుగా ఒక అర్ధశతాబ్దం పాటుగా ప్రపంచానికి ఆయన ప్రకృతి, పర్యావరణల గురించి తన డాక్యుమెంటరీల ద్వారా బోధించాడు. ఎందరినో చైతన్య పరిచాడు. మరెందరినో ప్రభావితం చేశాడు. నిజానికి అతి తక్కువ మందికి మాత్రమే వందేళ్లు జీవించి ఉండే అదృష్టం దక్కుతుంది. అతి తక్కువ మందికి మాత్రమే ఇట్లా ఎందరెందరినో ప్రభావిత పరచే శక్తి, సామర్థ్యాలుంటాయి.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో జియాలజీ, జువాలజీలలో పట్టభద్రుడు అయ్యాడు 1947లో. నేవీలో కొంతకాలం పనిచేశాడు. విద్యైక విషయాలను ప్రచురించే సంస్థలో కొద్దికాలం పనిచేశాడు. 1950లలో బిబిసి రేడియో ప్రొడ్యూసర్‌గా తన తొలి ఉద్యోగ దరఖాస్తును తిరస్కరించింది. 1952 నాటికి బిబిసిలోనే ట్రైనీ ప్రొడ్యూసర్‌గా చేరాడు. 1974లో జాక్విస్ట్ ధారావాహిక మొదలు పెడితే 1979 నాటికి 'లైఫ్ ఆన్ ఎర్త్' సీరిస్ పూర్తిస్థాయిలో వికసించి విస్తరించింది.

అటెంబరోను ప్రపంచ ఖ్యాతి పొందిన ప్రకృతి శాస్త్రవేత్తగా ప్రసార కర్తగా చెప్పుకుంటే చాలదు. ఆయన పర్యావరణ ప్రేమికుడు పరిరక్షకుడు. ప్రకృతి, అరణ్యాలు, జంతువులు, భూమి, ఈ గ్రహంపై ఎంత జీవవైవిధ్యం ఉందో మొత్తం ప్రపంచానికి హృద్యంగా పరిచయం చేశాడు. తాను రూపొందించిన డాక్యుమెంటరీలు ప్రజలలో ప్రకృతి పట్ల ప్రేమను మాత్రమే కాకుండా పర్యావరణ బాధ్యతలను కూడా పెంచాయి.

'ప్లానెట్ ఎర్త్', బ్లూ ప్లానెట్, లైఫ్ ఆన్ ఎర్త్ లాంటి డాక్యుమెంటరీలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతగానో ఖ్యాతిని పొందాయి. వాటిల్లో అటెంబరో భూమిపైన ఎంతటి జీవవైవిధ్యం ఉందో కళ్లకు కట్టినట్లుగా చూపించాడు. జలచరాలు, అడవి జంతువులు, మంచు ప్రాంతాలు, రెయిన్ ఫారెస్టులు వంటి ప్రాకృతిక వైభవానికి గర్వించదగిన చిహ్నాలుగా ఎంతగా ఉన్నాయో చెపుతాడు.

అటెంబరో ప్రకృతి సౌందర్యాన్ని మాత్రమే చూసినవాడు కాదు. పర్యావరణ వినాశనం, వాతావరణంలో సంభవించే మార్పులు, ప్లాస్టిక్ సమస్యలు, కాలుష్యం లాంటి జటిలమైన వాటిని గురించి ప్రపంచానికి ఎరుకనివ్వటమే కాకుండా హెచ్చరిక కూడా చేశాడు.

అటెంబరో ఎక్కడ ఏ విషయంపై ఏమి మాట్లాడినా ఆయన ఏది చిత్రించి చూపినా అవి ప్రజలను పర్యావరణ పరిరక్షణకు గొప్ప ప్రేరేపణను అందిస్తాయి. ఎన్నో అంతర్జాతీయ పురస్కారాలు ఆయనకు అందాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజలు ఆయనను ప్రకృతి రాయబారిగా గౌరవిస్తారు.

ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతిని రక్షించడం అనేది ఆయన జీవితమిచ్చే సందేశం. ఈ భూమండలాన్ని భవిష్యత్ తరాల వారికి కాపాడి సంరక్షించి ఇవ్వటంలో మనందరి బాధ్యత ఎంతయినా ఉందని ఆయన జీవిత కాల కృషి తెలియజేస్తుంది.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com



డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఎ. వాణీ ప్రసాద్ చేతుల మీదుగా 'ముడమాల్ మెగాలిథిక్ మెన్హిర్ సైట్' పోస్టర్ ఆవిష్కరణ

# చరిత్ర, కళా వైభవం, సంస్కృతికి మ్యూజియంలే శాశ్వత నిలయం

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకొని హెరిటేజ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సాంస్కృతిక & పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఎ. వాణీ ప్రసాద్, వరల్డ్ మోన్యుమెంట్ ఫండ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ మరియు బోర్డ్ మెంబర్ శ్రీమతి షాలిని భూపాల్, ASI హైదరాబాద్ సర్కిల్‌కు చెందిన డా. నిఖిల్ దాస్, MRDCL జాయింట్ డైరెక్టర్ మరియు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ శ్రీమతి పి. గౌతమీ ఐపీఎస్, పర్యాటక శాఖ డైరెక్టర్ శ్రీ ఎల్. రంజిత్ నాయక్, ఐఎఫ్ఎస్, NITHM డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ, INTACH నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మరియు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ Er. వేదకుమార్ మణికొండ, శ్రీమతి అనురాధ రెడ్డి INTACH హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేషన్ ఆర్కిటెక్చర్ అనురాధా ఎస్. నాయక్ "Museums uniting a divided world Hyderabad : A case study" పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ కుతాడి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన "Stucco Art Displayed in the Centenary Heritage Museum, Hyderabad", "తెలంగాణలో పారమార జగద్దేవి శాసనాలు", "తెలంగాణ హెరిటేజ్ – Activities of Tourism Clubs" ఆధ్వర్యంలో రూపొందించిన "YUVA" బ్రోచర్‌తో పాటు టూరిస్టు గైడ్ల బ్రోచర్, కొలనుపాక, అలంపూర్‌కు సంబంధించిన ప్రత్యేక ప్రచురణలు, ముడుమల వారసత్వ ప్రదేశానికి సంబంధించిన పోస్టర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

హెరిటేజ్ తెలంగాణ శాఖ పలు విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకొని పురావస్తు పరిరక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని అర్జున్ కుతాడి తెలిపారు. శిల్పకళ, చారిత్రక నిర్మాణాలు, పురావస్తు పరిశోధనలపై ఆసక్తి ఉన్న యువత కోసం ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో హెరిటేజ్ శాఖలో అవకాశాల కల్పనలో ఈ కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఒక సమాజం యొక్క నాగరికత, కళా వైభవం, జీవన విధానం, చారిత్రక పరిణామాలను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయని అన్నారు. పురావస్తు సంపదను కేవలం సంరక్షించడం మాత్రమే కాకుండా, దాని వెనుక ఉన్న చారిత్రక స్ఫూర్తిని యువతలో పెంపొందించడం ప్రభుత్వ బాధ్యత అని వివరించారు.

తెలంగాణ చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే కోటలు, దేవాలయాలు, శిలాశాసనాలు, పురాతన నిర్మాణాలు, సాంస్కృతిక కట్టడాల పునరుద్ధరణకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ





చేపడుతోందని మంత్రి తెలిపారు. గత తరాల సృజనాత్మకత, శిల్పకళా నైపుణ్యం, వాస్తు వైభవం వంటి అంశాలు వారసత్వ నిర్మాణాల ద్వారా సజీవంగా దర్శనమిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక సౌకర్యాలు లేని కాలంలోనే పూర్వీకులు నిర్మించిన అద్భుత కట్టడాలు భారతీయ సంస్కృతికి చిరస్థాయి చిహ్నాలుగా నిలిచాయని వ్యాఖ్యానించారు.

తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత విశిష్ట స్థానంలో నిలబెట్టే లక్ష్యంతో వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. శిథిలావస్థకు చేరుకున్న చారిత్రక ప్రదేశాలను గుర్తించి, రక్షిత వారసత్వ కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక రంగానికి కొత్త దిశను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రను భావితరాలకు అందించడంలో మ్యూజియంలు కీలక బాధ్యత నిర్వహిస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర సాంస్కృతిక & పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్న హెరిటేజ్ కార్యకర్తలు, చరిత్రాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు, పరిశోధకులను అభినందించారు. రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపును ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ విశిష్ట పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు.

హెరిటేజ్ తెలంగాణ శాఖ పలు సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకొని చారిత్రక సంపద సంరక్షణలో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని ఆమె ప్రశంసించారు. నారాయణపేట జిల్లాలోని ముడుమల మెగాలిథిక్ మెన్‌హిర్స్ వారసత్వ ప్రదేశం యునెస్కో తాత్కాలిక జాబితాలో స్థానం పొందడం తెలంగాణకు దక్కిన విశిష్ట గౌరవమని వాణీ ప్రసాద్ తెలిపారు. ఈ గుర్తింపు రాష్ట్ర చారిత్రక వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టిందన్నారు. వారసత్వ సంపద పరిరక్షణలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సమాజం, హెరిటేజ్ కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు.

భారత పురావస్తు సర్వే (ASI) హైదరాబాద్ సర్కిల్ అధికారి డా॥ నిఖిల్ దాస్ మాట్లాడుతూ, భవిష్యత్తులో హెరిటేజ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించబడే వారసత్వ పరిరక్షణ కార్యక్రమాలకు ASI సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద సంరక్షణలో ASI ఎల్లప్పుడూ బాధ్యతాయుత పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు సురక్షితంగా అందించేందుకు ప్రభుత్వ విభాగాలు, సాంస్కృతిక సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ, మ్యూజియంల సామాజిక, సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యంపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. మ్యూజియంలు కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు కాకుండా, ఒక జాతి








ఆత్మను ప్రతిబింబించే జ్ఞాన వేదికలని ఆయన అన్నారు. తెలంగాణలోని మ్యూజియంలు రాష్ట్ర వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ నిర్మాణ సంప్రదాయాల్లో ఇరాన్-పర్షియన్ వాస్తు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. ఈ సాంస్కృతిక సమ్మేళనం హైదరాబాద్‌కు వారసత్వ నగరంగా ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టిందని తెలిపారు. మ్యూజియంలలోని ప్రతి పురావస్తువు చారిత్రక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని, యువతలో వారసత్వ అవగాహన పెంపొందించడంలో అవి ప్రభావవంతమైన విద్యా వేదికలుగా మారాల్సిన అవసరం ఉందని సూచించారు.

హెరిటేజ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌తో సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టడం సమయోచిత నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. యువ ఆర్కిటెక్ట్‌లు, పరిశోధకులు, వారసత్వ పరిరక్షణపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ కోర్సులు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముడుమల మెగాలిథిక్ సైట్‌ను యునెస్కో శాశ్వత జాబితాలో చేర్చేందుకు సమన్వయపూర్వక కృషి అవసరమని తెలిపారు.

NITHM డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ మాట్లాడుతూ, తెలంగాణలోని చారిత్రక కట్టడాల సంరక్షణ, శాస్త్రీయ నిర్వహణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో NITHM తరపున ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్ తరాలకు చరిత్రను సజీవంగా అందించాలంటే సమిష్టి కృషి అవసరమన్నారు.

ఈ కార్యక్రమం యువ నాట్యకారిణి ధన్యత కాకాని ప్రదర్శించిన 'రామయణ శబ్దం' నృత్య ప్రదర్శనతో ప్రారంభమైంది. కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖలలో పని చేసి పదవీ విరమణ పొందిన బ్రహ్మాచారి, రామాచారికి డిపార్ట్‌మెంట్ తరపున సన్మానం చేశారు.

హెరిటేజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ, అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు, హెరిటేజ్ కళాభిమానులు, వివిధ కళాశాలల విద్యార్థులు, హెరిటేజ్ మిత్రులు మరియు మీడియా ప్రతినిధులకు హెరిటేజ్ తెలంగాణ శాఖ తరపున హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో శ్రీ రామోజు హరగోపాల్ KTCB, శ్రీ చకిలం వేణుగోపాల్, శ్రీమతి సంఘమిత్ర మాలిక్, భాను మూర్తి, జూహి, కోటయ్య, రమేష్ ఫోటోగ్రాఫర్, యశోవర్ధన్ AKTC, రామాంజుల Ogs, మల్లేశం ASI, జోగారావు JBR ఆర్కిటెక్చర్ కాలేజ్, OU ఆర్కియాలజీ విభాగం, SRD, APSA, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com






# తెలంగాణలో పైశాచి భాష

సుమారు రెండు వేల సంవత్సరాలకు పూర్వం గుణాఢ్యుడు అనే కవి ప్రపంచంలో మొట్టమొదటి కథా సంకలన గ్రంథం 'బృహత్కథ'ను రచించాడు... పైశాచి భాషలో. గుణాఢ్యుడు శాతవాహన రాజు కొలువులో ఉండేవాడు. ఈ శాతవాహన రాజు పేరు కవివత్సల బిరుదాంకితుడైన హాలుడు అని పరిశోధక పండితులు తేల్చారు. శాతవాహనుడికి నిర్ణీత సమయంలో సంస్కృతం నేర్పించలేక ఇచ్చిన మాట నిలుపుకోవటం కోసం వింధ్య అడవుల్లోకి పోయి, అక్కడి ప్రజల పైశాచి భాషను నేర్చుకొని, ఆ భాషలో బృహత్కథను రాశాడని కథనం. ఆ పైశాచి భాష అప్పుడు తెలంగాణలో ఉండినదా అనే విషయం చూద్దాం. ఎందుకంటే, శాతవాహన రాజుల తొలి రాజధాని జగిత్యాల జిల్లాలోని వెల్గటూరు మండలంలో పారుతున్న గోదావరి నది కుడి ఒడ్డున ఉన్న కోటిలింగాల అని అర శతాబ్దం కిందటి నుంచి పురావస్తు తవ్వకాల వల్ల తెలుస్తున్నది. పడమటి దిక్కు రాజ్యం విస్తరించిన తర్వాత కోటిలింగాల నుంచి తమ రాజధానిని మహారాష్ట్రలో గోదావరి ఒడ్డునున్న ప్రతిష్టానపురానికి మార్చారు. వారి రాజాస్థానాలలో ఉన్న గుణాఢ్యుడు ఈ ప్రాంతీయుడు అయ్యే అవకాశం మెండుగా ఉంది. అందుకు ఆధారాలను వెతుకుదాం.

బృహత్కథ ఏడు వంతులు నష్టమై పోగా, మిగిలిన ఒక్క భాగాన్ని శాతవాహనుడు రక్షించగా, పైశాచి భాషలో ఉన్నదానిని కొద్ది కాలంలోనే... క్రీ.శ. 1వ శతాబ్దంలోనే బుద్ధస్వామి సంస్కృతంలోకి "బృహత్కథా శ్లోక సంగ్రహం" పేరిట అనువదించి, అందులో 'గుణాఢ్యుడు దక్షిణ భారతదేశంలో పుట్టాడని, అతని అసలు / మొదటి పేరు 'మాల్యవతుడు' అని రాశాడు. బృహత్కథలో పాలక అనే రాజు తన రాజ్యాన్ని విడిచి నీలగిరులకు వెళ్ళిపోయాడనే కథ ఉంది. ఈ నీలగిరులు (నీల=నల్ల ం గిరులు=మలలు), నల్లమలై అనే పేర్లతో మొన్నమొన్నటి వరకు తెలంగాణకు దక్షిణ సరిహద్దులుగా ఉన్న నల్లమల పర్వతాలను పిలిచేవారు. అరవై ఏండ్ల కిందటి వరకు భక్తులు శ్రీశైలం క్షేత్రానికి వెళ్ళడానికి ఈ నీలగిరుల / నల్లమలల గుండానే కాలినడకన ప్రయాణించి నీలగంగ రేవు (కృష్ణా నదిని) దాటి శ్రీశైల క్షేత్రాన్ని చేరుకునేవారు. కాబట్టి మాల్యవత (మలై పర్వత నివాసి) పేరు గల గుణాఢ్యుడు ఈ నల్లమలై ప్రాంతీయుడే అయ్యుండాలి.

"నేపాలీ మహాత్మ్యం" అనే గ్రంథం గుణాఢ్యుడు గోదావరి తీర ప్రతిష్టానపుర రాజ్యంలోని మదురలో జన్మించాడని ప్రస్తావించింది. ప్రతిష్టానపుర (శాతవాహనుల) రాజ్యం తొలి రాజధాని కోటిలింగాల గోదావరి తీరంపైననే ఉంది. దీనికి ఆవలి తీరం వైపు మదుర అనే పేరున్న గోండు-కోలం గిరిజనుల గ్రామం ఇప్పటికీ అదే పేరుతో ఉంది. గుణాఢ్యుడు శివ గణ అవతారుడని, అతనికి కనకభూతి అనే మరొక శివ (యక్ష) గణ వ్యక్తి బృహత్కథను పైశాచి భాషలో చెప్పాడనీ బృహత్కథలో ఉంది. ఇప్పటికీ ఈ గోండుల మదుర ప్రాంతంలో శివుడుని సిద్ధేశ్వరుడు, మహదు (మహాదేవుడు) అనే పేరుతో పూజిస్తారు. శివమెత్తేవాళ్ళను 'గణ' బాల అంటారు. ఇప్పటికీ ఇలాంటి గణ బాలలు శివమెత్తిన తరువాత పురాణ గాథలను చెప్తారు. గోండుల పురాణ

గాథలను చెప్పే ఉప కులాలను పర్ధానులు, తోటీలు అంటారు. ఇదే ప్రాంతంలో ఇప్పటికీ కనక వంశస్థులు, భూతి వంశస్థులు ఉన్నారు. దండి పైశాచి భాషను 'భూత భాష' అన్నాడు. కనక అనే దేవతను కూడా గోదావరికి ఉత్తర తీరాన ఉన్న గిరిజనులు, గిరిజనేతరులు (ఇటీవల కాలంలో) కొలుస్తున్నారు. గోదావరి ఉపనది ఐన సోనాలవాగు మధ్యలో ఉన్న జలదుర్గంలో కనక దేవత (కనకాయి) ను ఇప్పటికీ ఈ ప్రాంత ఆంధ్ తదితర గిరిజనులు కొలుస్తున్నారు. ఆంధ్ (సంస్కృతంలో ఆంధ్ర) జాతి శాతవాహనులే శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించడం గమనార్హం. వీరు ఇప్పటికీ సిర్రాల్ సాత్వాన్ (శ్రీ హాల శాతవాహన) పేరిట ఏటా పండుగ జరుపుతారు. హాల శాతవాహనుడే గుణాఢ్యుని పోషకుడు. ధర్మపురి క్షేత్రానికి ఎదురుగా గోదావరి ఒడ్డున ఉన్న పద్మలపురి 'క్షకో' (కనక అపభ్రంశం) దేవతను ఇప్పటికీ ఏటా గోండులు ఆరాధిస్తున్నారు. కనక దేవతను కనకమ్మ అని, బంగారమ్మ అని బాసర ప్రాంతీయులు పూజిస్తున్నారు. బాసర ప్రాంతంలోని కనకమ్మకు వేములవాడ చాళుక్యులు, కాకతీయుల కాలంలో గొప్ప ఆలయ మండపాలను నిర్మించారు.

బృహత్కథననుసరించి శూద్రకుడు రాసిన 'మృచ్ఛకటిక' లో పాలక అనే రాజు తన రాజ్యాన్ని గోపాలుని కొడుకైన ఆర్యక్ కు ఇస్తాడు. ఈ ఆర్యక్ వంశీయులైన కోలం గిరిజనులు తమ తొలి రాజు ఐన ఆర్యక్ ను ఇప్పటికీ పెద్ద (భీమ) అయ్యక్ గా ఆరాధిస్తారు. ఆర్యక్ / అయ్యక్ చారుదత్త అనే వ్యాపారికి బేల నది ఒడ్డున ఒక జాగీరు ఇచ్చాడు. ఈ బేల నది కూడా ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో గోదావరికి ఉపనదిగా పారుతున్నది. ఈ మండలంలో ఇప్పటికీ ఆర్యక్ తండ్రి గోపాల పేరుతో ఉన్న గోవారీలు గోండు గిరిజనుల గోపాలకులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో "మృచ్ఛకటిక" దక్షిణాది మ్లేచ్ఛుల భాషలలో ఖాతిని ప్రస్తావించింది. ఈ ఖాతి భాషను మాట్లాడే కమ్మర పని చేసే జాతి (ఖాతీలు) ఇప్పటికీ గోండు గిరిజనులకు అనుబంధంగా కుల వృత్తి పనులు చేస్తున్నారు.

ఇలా ఉత్తర తెలంగాణ / కోటిలింగాల ప్రాంతంలో పారే గోదావరి ఎడమ ఒడ్డున ఉన్న వింధ్య సాత్పుర అడవులలో జీవించి, ఇప్పటికీ జీవిస్తున్న ఆంధ్, గోండు, కోలం, పర్ధాన్, తోటి తదితర గిరిజనుల భాషనే శాతవాహనుల కాలం నాటి పైశాచి భాష అని, ఆ భాషలో వారు చెప్పిన బృహత్కథనే గుణాఢ్యుడు రాశాడని స్పష్టంగా చెప్పవచ్చు. కొసమెరుపు ఏమిటంటే, ఇప్పటికీ పర్ధాన్, తోటి గిరిజనులు గులక రాళ్ళ సహాయంతో ఆయా గాథా భాగాలను గుర్తు తెచ్చుకుంటూ బృహత్కథలను చెప్తారు. అలాంటి ఒక కథను వెడ్మ రాము అనే తోటి గిరిజనుడు చెప్పగా మైఖేల్ యోర్క్ అనే లండన్ పరిశోధకుడు చిత్రీకరించి నాలుగున్నర దశాబ్దాల కిందటే ప్రపంచ ప్రఖ్యాత టీవీ బీబీసీలో ప్రసారం చేశాడు.

**ఉత్తర తెలంగాణ / కోటిలింగాల ప్రాంతంలో పారే గోదావరి ఎడమ ఒడ్డున ఉన్న వింధ్య సాత్పుర అడవులలో జీవించి, ఇప్పటికీ జీవిస్తున్న ఆంధ్, గోండు, కోలం, పర్ధాన్, తోటి తదితర గిరిజనుల భాషనే శాతవాహనుల కాలం నాటి పైశాచి భాష అని, ఆ భాషలో వారు చెప్పిన బృహత్కథనే గుణాఢ్యుడు రాశాడని స్పష్టంగా చెప్పవచ్చు. కొసమెరుపు ఏమిటంటే, ఇప్పటికీ పర్ధాన్, తోటి గిరిజనులు గులక రాళ్ళ సహాయంతో ఆయా గాథా భాగాలను గుర్తు తెచ్చుకుంటూ బృహత్కథలను చెప్తారు.**

### పైశాచి భాష ప్రత్యేకతలు:

పైశాచిని ఒక రకమైన ప్రాకృత భాష అని, రాక్షసుల భాష అని, భూత భాష అని, కొన్ని అపభ్రంశాల వంటి అనాగరిక భాష అని అన్నారని, హేమచంద్రుడు వంటి వ్యాకరణకారులు చూలికా పైశాచి అని పైశాచి భాషలో ఒక ఉప భేదం కూడా ఉన్నదని ప్రస్తావించాడని తెలుస్తున్నది. ఈ పైశాచి భాషా భేదం ప్రాచీన లక్షణాలను కలిగి ఉంది. దీని ప్రధాన ప్రత్యేకత ఏమిటంటే, పరుషముల స్థానంలో సరళముల వినియోగం... ఉదాహరణకు: తామోతర = దామోదర. చూలికా పైశాచిలో: నకర = నగర, రాచ = రాజ, ఖమ్మ = ఘర్మ, కంతప్ప = కందర్ప, "ణ" ? "న", "ళ" ? "ల" అవుతాయి. "య" మాత్రం అలాగే ఉంటుంది. మధ్య అచ్చుల మధ్యలో ఉన్న వ్యంజనాలు తొలగించబడవు. మహాప్రాణాలుగా మారవు; మాగధీ, ఇతర భాషలలో ప్రారంభ దశలో కనిపించినట్లు "జ్ఞ", "న్య" ? "జ్ఞ్య" గా మారుతాయి.

శాహ్‌బాజ్‌ఘుఢీ శాసనం ఈ భాషతో అనేక లక్షణాల్లో సారూప్యత కలిగి ఉండడంతో కొంతమంది పండితులు చూలికా పైశాచి వాయువ్య భారతదేశంలోని ఒక భాషా భేదమని భావించారు. సర్ జార్జ్ గ్రియర్సన్ దీన్ని హిందూకుష్ ప్రాంతంలోని దార్ద్, కాఫిర్ భాషలతో (ఉదాహరణకు షీనా, కాశ్మీరీలోని ఉపస్తరంతో) సంబంధం కలిగి ఉందని సూచించాడు. మరో వైపు గుణాఢ్యుడు దక్షిణ భారతీయుడని అంగీకరించబడింది. ణ ? న మార్పులు ద్రావిడ ప్రభావాన్ని సూచిస్తున్నట్లు కనిపిస్తాయి. ఇతర లక్షణాలు... మధ్య "త్" మరియు "య్" నిలిచి ఉండటం... ప్రాచీన లక్షణాలుగా భావిస్తారు. పరుష ధ్వనుల స్థానంలో సరళ ధ్వనుల వినియోగం దక్షిణాదిలోనూ, ఉత్తరాదిలోనూ కనిపించవచ్చు. ఇది విదేశీ జాతి భాషను స్వీకరించినప్పుడు సాధారణంగా కలిగే మార్పు.

ఆర్య భాషా ప్రాంత సరిహద్దుల్లో ఉండే ఇటువంటి భాషా భేదాలు, ఆర్య భాష వ్యాప్తి కొనసాగుతున్న కొద్దీ తప్పనిసరిగా కనుమరుగైపోతాయి. అందువల్ల మూల పైశాచి చూలికా భాషను మాట్లాడిన రాక్షసులు (యక్షులు, నాగరికులు = ఈనాటి గిరిజనులు) వింధ్య పర్వత ప్రాంతానికి చెందినవారై ఉండటం కూడా సాధ్యమే, కాశ్మీర్ ప్రాంతంలోని నర మాంస భక్షకులు కావడం కూడా సాధ్యమే. కాబట్టి ఈ పైశాచి భాషను వాయువ్య భారత దేశంలోను, వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న తెలంగాణలోను గిరిజనులు రెండు వేల సంవత్సరాలకు పూర్వం మాట్లాడిన భాష అని నిర్ద్వందంగా చెప్పవచ్చు. అధికార భాష, మెజారిటీ భాష వ్యవహారం నిమిత్తం తక్కువ మంది మాట్లాడే (గిరిజన) భాషలను చంపేస్తాయి. అట్లా ఇప్పుడు కోయ, కోలం, బంజారా భాషలు కనుమరుగవుతుండడం చూస్తున్నాం.

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com

## డెక్కన్ కోటలలోని ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగులు

# చరిత్రకు సజీవ సాక్ష్యాలు

దక్షిణ భారతదేశంలో డెక్కన్ పీఠభూమి భౌగోళిక పరిధి వింధ్య పర్వతాల దక్షిణ భాగం నుండి నీలగిరి కొండల వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో నేటి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు మరియు తమిళనాడు రాష్ట్ర ఉత్తర ప్రాంతాలు భాగస్వామ్యంగా ఉన్నాయి.

ఈ పరిశోధనా వ్యాసం డెక్కన్ ప్రాంత కోటలలో లభ్యమయ్యే ఫిరంగుల సర్వే, అధ్యయనం మరియు వాటి కేటలాగింగ్ ఫలితంగా రూపుదిద్దుకుంది. ప్రస్తుత అధ్యయనం మధ్యయుగానంతర కాలం, ముఖ్యంగా క్రీస్తుశకం 14వ శతాబ్దం నుండి ప్రారంభమవుతుంది. ఈ కాలంలో భారతదేశం లోహశాస్త్రం మరియు ఆయుధ తయారీ రంగాలలో విశేష అభివృద్ధిని సాధించింది. సైన్యాలలో ఫిరంగి దళాల ప్రవేశంతో ఆయుధ పరిశ్రమకు కొత్త ఊపొచ్చింది. ఈ కాలంలో వందలాది కోటలు నిర్మించబడగా, ఇప్పటికే ఉన్న అనేక కోటలు పునరుద్ధరించబడి, వాటి బురుజులపై భారీ సంఖ్యలో ఫిరంగులు అమర్చబడ్డాయి. మధ్యయుగానంతర డెక్కన్ ప్రాంతంలో నిరంతర యుద్ధాలు కొనసాగాయి. ఆ యుద్ధాలలో ఫిరంగి దళాలు కీలక పాత్ర పోషించాయి. దీనివల్ల ఇనుము, రాగి మిశ్రమాలు, ముఖ్యంగా కంచు వంటి లోహ వస్తువుల తవ్వకం మరియు తయారీ నిరంతరంగా సాగింది. అదే సమయంలో శోరా (సాల్ట్‌పీటర్), గంధకం వంటి రసాయనాల తయారీ ప్రక్రియలు కూడా వేగవంతమయ్యాయి. ఈ కాలంలో ఆయుధ పరిశ్రమ దేశవ్యాప్తంగా విశిష్ట స్థానం సంపాదించింది.



ఈ యుద్ధాల సందర్భంలో వివిధ రకాల అగ్నియంత్రాలు ప్రవేశించాయి. ఈ వ్యాసంలో ముఖ్యంగా డెక్కన్ ప్రాంతానికి చెందిన ప్రారంభ దశ ఫోర్జ్ వెల్డెడ్ ఇనుప ఫిరంగులను పరిచయం చేయడం లక్ష్యంగా ఉంది. ఫోర్జ్ వెల్డింగ్ అనే ప్రాచీన సాంకేతికతను ఫిరంగుల నిర్మాణంలో వినియోగించారు. ఇది భారతీయ శిల్పకారులు అభివృద్ధి చేసిన స్వదేశీ సాంకేతిక విధానం. ఇందులో నైపుణ్యం కలిగిన కార్మికులు కీలక పాత్ర పోషించారు. ఈ విధానంతో అనేక భారీ ఫిరంగులు తయారు చేసి యుద్ధాలలో వినియోగించారు. కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ కోటలో సుమారు 50 నుండి 60 టన్నుల బరువున్న అతి పొడవైన ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగి ఉంది. ఇదే విధమైన మరికొన్ని ఫిరంగులు బీదర్ కోటలో కూడా కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో సమృద్ధిగా లభ్యమయ్యే ముడి లోహ వనరుల కారణంగా ఇలాంటి విశాలమైన ఫిరంగుల తయారీ సాధ్యమైంది.

ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగుల ప్రాథమిక నిర్మాణంలో మొదట పొడవైన ఇనుప పలకలతో గొట్టం (బ్యారెల్) నిర్మించబడేది. ఆ తరువాత దాని బలాన్ని పెంచేందుకు ఒకటి లేదా రెండు వరుసల ఇనుప వలయాలను వేడి చేసి అమర్చేవారు. కొన్ని సందర్భాలలో మూడు వరుసల వలయాలను కూడా అమర్చేవారు. ఫిరంగి వెనుక భాగాన్ని ఫోర్జ్ చేసిన బేస్ ప్లేట్‌తో మూసివేసి, దానిలో సరియైన రంధ్రాన్ని రూపొందించేవారు. శత్రువుపై ఖచ్చితమైన లక్ష్యసాధన కోసం సూటిగా సరైన అమరిక కల్పించబడేది. ఫిరంగి ముఖభాగాన్ని ఇనుప పలకల చివరలను చెక్కి అలంకారాత్మకంగా తీర్చిదిద్దేవారు.

**ముఖ్య పదాలు:** ఫోర్జ్ వెల్డింగ్ ఫిరంగులు, గన్‌పౌడర్, శోరా, స్టేవ్స్, హూప్స్, బేస్ ప్లేట్, ట్రన్నియన్, ఇనుము, కంచు.

మధ్యయుగ డెక్కన్ ప్రాంతంలో ఫిరంగి దళాల ప్రవేశంతో లోహశాస్త్రం మరియు ఆయుధ పరిశ్రమ గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఫిరంగి దళాల అవసరాల వల్ల ఇనుము, రాగి, కంచు తవ్వకం మరియు తయారీ విస్తరించడమే కాకుండా, శోరా మరియు గంధకం వంటి రసాయనాల శుద్ధి ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఈ కాలంలో డెక్కన్ ప్రాంతం ఆయుధ తయారీలో ప్రత్యేక ఖ్యాతిని సంపాదించింది. గన్‌పౌడర్ వినియోగం ఫిరంగుల ఆవిర్భావం మరియు అభివృద్ధికి దోహదపడింది. ఇది యుద్ధ విధానాన్ని మాత్రమే కాకుండా సామాజిక-ఆర్థిక వ్యవస్థను కూడా ప్రభావితం చేసింది.

ఈ పరిశోధన డెక్కన్ కోటలలోని ఫిరంగుల సర్వే, అధ్యయనం మరియు కేటలాగింగ్ ఆధారంగా రూపొందించబడింది. ఈ ప్రాజెక్టుకు 2006-2008 మధ్యకాలంలో న్యూఢిల్లీ భారత జాతీయ విజ్ఞాన అకాడమీకి చెందిన "కౌన్సిల్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ సైన్స్" మంజూరు చేసింది. ఈ పరిశోధన రచయిత, దివంగత ప్రొఫెసర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం (ఐఐటీ కాన్పూర్)తో కలిసి సహ పరిశోధకునిగా పనిచేశారు. 26 నెలలపాటు సాగిన ఈ ఫీల్డ్ సర్వేలో దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల 134 కోటలను పరిశీలించారు. మహారాష్ట్రలో 37, ఆంధ్రప్రదేశ్‌లో 53, కర్ణాటకలో 39 మరియు తమిళనాడు ఉత్తర ప్రాంతంలో 5 కోటలు సందర్శించబడ్డాయి. మొత్తం 688 ఫిరంగులు కేటలాగ్ చేయబడ్డాయి. వీటిలో 165 ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగులు, 145 కంచు ఫిరంగులు, 16 మిశ్రమ లోహ ఫిరంగులు మరియు 362 అచ్చు పోసిన ఫిరంగులు ఉన్నాయి.




వింధ్య పర్వతాల దక్షిణ భాగం నుండి నీలగిరుల వరకు ఉన్న ప్రాంతాన్ని "దెక్కన్"గా పిలుస్తారు. ఈ ప్రాంతంలో మహారాష్ట్ర తెలంగాణ, కర్ణాటక మరియు తమిళనాడు ఉత్తర భాగాలు ఉన్నాయి.

ఈ సాంకేతికతలు పశ్చిమం మరియు తూర్పు ప్రాంతాల నుండి భారతదేశానికి వచ్చిన విదేశీయుల ద్వారా పరిచయమయ్యాయి. భారతదేశంలో గన్‌పౌడర్ మరియు ఫిరంగుల వినియోగానికి తొలి కీర్తి దెక్కన్ ప్రాంతంలోని విజయనగర మరియు బహమనీ రాజ్యాలకు దక్కుతుంది. ఈ రాజ్యాలు భారీ ఫోర్జ్ వెల్డెడ్ ఇనుప ఫిరంగుల తయారీలో ప్రత్యేక ప్రతిభ కనబరిచాయి. దెక్కన్ రాజ్యాలు పరిమాణంలో చిన్నవైనా, బలమైన సైనిక వ్యవస్థ కారణంగా ఢిల్లీ సుల్తానులు మరియు మొఘలులకు గట్టి ప్రతిఘటన ఇచ్చాయి.

దెక్కన్ ప్రాంతంలో ఫోర్జ్ వెల్డెడ్ ఇనుప ఫిరంగుల తయారీ సాంకేతికతపై సమకాలీన సాహిత్యం చాలా తక్కువగా లభిస్తుంది. భారతదేశంలో ఉన్న ఈ ఫిరంగులపై సమగ్ర పరిశోధనలు కూడా పరిమితంగానే ఉన్నాయి. భారతీయులు అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతపై శాస్త్రీయ విశ్లేషణ మరింత అవసరం. అందుకే ఈ పరిశోధన దెక్కన్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిర్వహించబడింది. ఎందుకంటే ఈ ప్రాంతంలోని అనేక కోటలలో ప్రారంభ దశ ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగులు ఇప్పటికీ ఉన్నాయి. దెక్కన్ ప్రాంతం ప్రసిద్ధ ఉక్కు తయారీ కేంద్రంగా కూడా ప్రసిద్ధి చెందింది.

ఇక్కడ ఉత్పత్తి అయ్యే అధిక ఇనుము పురాతన కాలం నుంచే విదేశాలకు ఎగుమతి చేయబడేది. భారీ ఫిరంగుల తయారీ మరియు యుద్ధాలలో వాటి వినియోగం మధ్యయుగ దెక్కన్ యోధ రాజ్యాల ప్రధాన లక్షణాలలో ఒకటి. భారతీయ కమ్మరి కళలో తక్కువగా తెలిసిన అద్భుతాలలో ఫోర్జ్ వెల్డెడ్ ఇనుప ఫిరంగులు ఒకటిగా నిలిచాయి.

ఈ పరిశోధనలో దెక్కన్ కోటలలోని ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగుల సాంకేతిక విశ్లేషణ, తయారీ విధానం మరియు నిర్మాణ పద్ధతులపై సమగ్ర పరిశీలన చేయబడింది. ముఖ్యంగా వివిధ కోటలలోని అన్ని ఫోర్జ్ వెల్డెడ్ ఇనుప ఫిరంగులను కేటలాగ్ చేయడంపై దృష్టి పెట్టబడింది. ఇనుము ఉత్పత్తి, ఫోర్జ్ వెల్డింగ్ ప్రక్రియ మరియు ఫిరంగుల తయారీ సాంకేతికతపై కూడా విశ్లేషణ జరిగింది. ఈ అధ్యయనం భారతీయ ఫోర్జ్ వెల్డింగ్ సాంకేతిక ప్రతిభను అర్థం చేసుకోవడానికి విలువైన ఆధారంగా నిలుస్తుంది.

భారతదేశంలో ఫిరంగి వ్యవస్థ క్రమంగా అభివృద్ధి చెందింది మరియు సైన్యంలో కీలక విభాగంగా మారింది. ప్రారంభ దశ ఫిరంగులు ఫోర్జ్ వెల్డింగ్ పద్ధతిలో తయారయ్యాయి. అనంతరం వివిధ ఆకారాలు మరియు రకాల ఫిరంగులు రూపుదిద్దుకున్నాయి. బాబర్ 1526లో మొఘల్-టర్కిష్ స్క్రూ విధానాన్ని ప్రవేశపెట్టగా, అక్బర్ 1570లో అచ్చు పోసే విధానాన్ని ప్రవేశపెట్టాడు. తరువాత యూరోపియన్ మారిట్జ్ విధానం ద్వారా ఘన ఇనుప ముక్కలను అచ్చు పోసి, అనంతరం వాటిలో గొట్టాన్ని త్రవ్వే పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. దేశవ్యాప్తంగా అనేక ఫిరంగి తయారీ కేంద్రాలు కూడా ఏర్పడ్డాయి.

ఫిరంగి వ్యవస్థలో ప్రధానంగా గన్‌పౌడర్ సహాయంతో గొట్టం ద్వారా గుండును ప్రయోగించే ఆయుధాలు ఉంటాయి. ఇది యుద్ధాలలో ఫిరంగుల వినియోగాన్ని పెంచి, మధ్యయుగ కాలంలో గన్‌పౌడర్ మరియు ఫిరంగుల పరిశ్రమ అభివృద్ధికి దారితీసింది. గన్‌పౌడర్ మూడు ప్రధాన పదార్థాల మిశ్రమం – శోరా (పొటాషియం నైట్రేట్), బొగ్గు మరియు గంధకం. కౌటిల్యుని అర్థశాస్త్రంలో కూడా యుద్ధాలలో అగ్నివినియోగం మరియు శోరా ప్రస్తావించబడింది. వివిధ అవసరాలకు అనుగుణంగా గన్‌పౌడర్ నిష్పత్తులు మారేవి. శక్తివంతమైన గన్‌పౌడర్ కోసం 4 భాగాల శోరా, 1 భాగం గంధకం, 1 భాగం బొగ్గు మిశ్రమం వాడేవారు. "శుక్రనీతి"లో మాత్రం 5 భాగాల శోరా, 1 భాగం గంధకం, 1 భాగం బొగ్గు నిష్పత్తి సూచించబడింది.

ఫోర్జ్ వెల్డెడ్ ఫిరంగులు ప్రధానంగా దెక్కన్ ప్రాంతంలోనే అధికంగా కనిపిస్తాయి. గోల్కొండ, బీజాపూర్, బీదర్, గుల్బర్గా, బసవకళ్యాణ, పరిండా, ఔసా, రామ్‌గిరి, గవిల్గఢ్, నర్నాలా వంటి కోటలలో ఇవి ఇప్పటికీ ఉన్నాయి. కొన్నివరకు తమ అసలు స్థానాల్లోనే నిలిచివున్నాయి. చాలా కోటలలో ఇవి ఎత్తైన బురుజులపై ఉండటం వల్ల చేరుకోవడం కష్టసాధ్యం. కోటల ప్రాకారాలు సరైన సంరక్షణ లేకపోవడంతో పరిశోధన కూడా క్లిష్టమైంది. అయినప్పటికీ ఈ పరిశోధన ద్వారా ఈ ఫిరంగుల సాంకేతిక వివరాలు ప్రత్యక్ష ఆధారాలతో నమోదు చేయబడ్డాయి. పరిమాణం మరియు రూపకల్పన ఆధారంగా ఇవి ఫోర్జ్ వెల్డింగ్ సాంకేతికతలో అద్భుత కళాఖండాలుగా గుర్తించబడాలి.

–డా॥ ఎస్. జైకిషన్
Chairman, Bhavan's New Science College, Hyderabad
Adjunct faculty NIAS, Bangalore (BUMA-2013)
m: 970 7478 338
e: dr.sjai@gmail.com

# బెంగాలీ సంగీత తరంగాలతో మైమరపించిన లమకాన్ వేదిక

గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ నూట అరవై ఐదవ జయంతి సందర్భంగా "ఠాగూర్ స్మరణ" అనే సాంస్కృతిక సంగీత కార్యక్రమం మే ఎనిమిదవ తేదీన హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో ఉన్న లమకాన్ వేదికగా అత్యంత ఆత్మీయంగా, కళాత్మకంగా నిర్వహించబడింది. సాయంత్రం ఆరు గంటల ముప్పై నిమిషాలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాహిత్యం, సంగీతం, నృత్యం, భావవ్యక్తీకరణల సమ్మేళనంగా ప్రేక్షకులను అపూర్వమైన అనుభూతిలో ముంచెత్తింది.



కార్యక్రమం ప్రారంభానికి ముందు లమకాన్ వంటగదిలో తయారైన రుచికరమైన అల్పాహారాలు, వేడి తేయాకు, నిమ్మరసం అతిథులకు అందించగా, ఆత్మీయ వాతావరణం నెలకొంది. అనంతరం ఇటీవల పరమపదించిన ప్రముఖ రచయిత్రి జీలానీ బానో సాహెబాకు నివాళులు అర్పించారు. ఆమె లమకాన్ సహ వ్యవస్థాపకుడు అష్వర్ ఫర్హాన్ తల్లి కావడం విశేషం. ఆమె సాహిత్య సేవలను స్మరించుకుంటూ సభికులు మౌన నివాళి ఘటించారు.

తరువాత సమస్త సభికులు సంఘమిత్ర మాలిక్ నాయకత్వంలో జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆ క్షణం సభలో దేశభక్తి భావాలను మేల్కొలిపింది. ఆపై ప్రారంభమైన "ఠాగూర్ స్మరణ" కార్యక్రమం పూర్తిగా రవీంద్ర సంగీతానికి అంకితమైంది. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ సాంస్కృతిక వేదికలలో ఒకటైన లమకాన్ ఆ సాయంత్రం సంగీత సాహిత్య రసమయ క్షేత్రంగా మారిపోయింది.

ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన డాక్టర్ ఆర్. శంకర్ తన చమత్కార భాషా ప్రవాహం, వినూత్న వ్యాఖ్యాన శైలితో సభను ఆద్యంతం అలరించారు. ప్రతి గీతానికి, ప్రతి సందర్భానికి ఆయన ఇచ్చిన పరిచయాలు ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌లో ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న బెంగాలీ సాంస్కృతికాభిమాని సంఘమిత్ర మాలిక్ "ఠాగూర్ స్మరణ" కార్యక్రమాన్ని మూడవసారి నిర్వహించడం విశేషం. ఆమె స్వయంగా రూపొందించిన ఈ సంగీత యాత్రలో ఇరవై ఒకటి కంటే ఎక్కువ రవీంద్ర గీతాలు చోటు చేసుకున్నాయి.

ఈ సందర్భంగా సంఘమిత్ర రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాలను పూజా విభాగం, ప్రేమ విభాగం, ప్రకృతి విభాగం, వివిధ గీతాల విభాగం, నృత్యనాట్య విభాగం వంటి అనేక శ్రేణులలో ఎంపిక చేసి వినిపించారు. ఆమె ఆలపించిన తొలి గీతం "ఆమార్ ముక్తి ఆలోయ్ ఆలోయ్" సభలో ఆధ్యాత్మిక పరిమళాలను వ్యాపింపజేసింది. అనంతరం త్యాగరాజ స్వామి కృతిని ఆధారంగా చేసుకుని రూపొందించిన "బాబొన్నే పూర్ణ ప్రాణే" అనే మధుర గీతాన్ని ఆలపించి సంగీతాభిమానులను మైమరపించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ 1933 డిసెంబరు నెలలో హైదరాబాద్‌ను సందర్శించిన సందర్భానికి సంబంధించిన ఆసక్తికర సంఘటనలను కూడా సంఘమిత్ర ప్రేక్షకులతో పంచుకున్నారు. ప్రకృతి విభాగంలో భాగంగా ఋతువులపై ఆధారపడిన ఎనిమిది గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాలకు హైదరాబాద్‌కు చెందిన ప్రతిభాశాలి కమలిని శ్రీనివాస్ అందించిన నృత్యాభినయాలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి.

"ఏషో హే బైశాఖ్", "మోనో మోర్ మేఘేర్ సంగీ", "రిమ్ ఝిమ్ ఘనో ఘనో రే", "పౌష్ తోదేర్ డాక్ దియేఛే", "ఓరే భాయ్ ఫాగున్ లేగేఛే" వంటి గీతాలకు కమలిని అందించిన నృత్య రూపకల్పనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆమె అభినయానికి అనుగుణంగా సంఘమిత్ర గానమాధుర్యం కలిసిపోవడంతో ఆ వేదిక సజీవ చిత్రపటంలా అనిపించింది.

కార్యక్రమంలో "గీతాంజలి" నుంచి ఎంపిక చేసిన మూడు గీతాలు, కవితలు విశేష ఆదరణ పొందాయి. "భయరహిత మనసు కలిగిన లోకం" అనే ప్రసిద్ధ కవితతో పాటు ప్రేమ, జీవనోత్సవ





భావాలను ప్రతిబింబించే మరికొన్ని గీతాలను వినిపించారు. ప్రతి పదంలోనూ ఠాగూర్ ఆత్మీయ తాత్వికత ప్రతిధ్వనించింది.

కమలిని శ్రీనివాస్ వీణావాదనం కూడా సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఆమె వాయించిన "మేఘేర్ కోలే రోద్ హేశేఛే" గీతం, అలాగే "ఏక్లా చలో రే" అనే ప్రేరణాత్మక గీతం సభలో ఉత్సాహాన్ని నింపాయి. ఒంటరిగా అయినా ధైర్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని అందించే ఈ గీతం ప్రతి ఒక్కరిని ఉత్సాహపరిచింది. అనంతరం సంఘమిత్ర అదే గీతాన్ని బెంగాలీ, హిందీ, తెలుగు భాషల్లో ఆలపించగా సభికులు హర్షధ్వానాలతో అభినందించారు.

తదుపరి "పురానో శేయి దినేర్ కథా" అనే గీతం స్కాట్లాండ్‌కు చెందిన ప్రముఖ కవి రచన ఆధారంగా రూపొందించబడినదని సంఘమిత్ర వివరించారు. ఆ గీతాన్ని మొదట మూలరూపంలో, తరువాత బెంగాలీ, హిందీ రూపాల్లో వినిపించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన అనేక గీతాలు భారతీయ చలనచిత్ర సంగీతంపై చూపిన ప్రభావాన్ని కూడా సంఘమిత్ర వివరించారు. అనేక ప్రజాదరణ పొందిన చిత్రగీతాలకు ఠాగూర్ గీతాలే మూలమని పేర్కొన్నారు. అయితే ఆ గీతాలకు అసలు మూలాన్ని గుర్తించి గౌరవిస్తున్నారా అనే ప్రశ్నను ప్రేక్షకుల ముందుంచారు.

"భానుసింహ పదావళి" అనే ప్రేమ గీతాల సంకలనాన్ని కూడా ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఠాగూర్ తన పదహారో, పదిహేడో ఏట "భానుసింహ" అనే కలంపేరుతో ప్రేమ గీతాలను రచించడం విశేషమని వివరించారు.

కార్యక్రమం ముగింపుకు ముందు సంఘమిత్ర ఆలపించిన "ఆమి తోమారో శోంగే బెంధేఛి ఆమారో ప్రాణ్" అనే ప్రేమగీతం సభలో మధురానుభూతిని కలిగించింది. చివరగా "ఆనంద లోకే మంగళ లోకే" అనే ఆధ్యాత్మిక గీతంతో కార్యక్రమం ముగిసింది. ఈ గీతం బెంగాలీ ప్రార్థనా మందిరాల్లో కూడా ఆలపించ బడుతుందని ఆమె తెలిపారు.

తన బాల్యదశలో కలకత్తాలోని తన ముత్తాతకు చెందిన బెంగాలీ పుస్తకాల ద్వారా ఈ పరిశోధన ప్రారంభమైందని సంఘమిత్ర తెలిపారు. అనంతరం కలకత్తా పర్యటనల సమయంలో సేకరించిన సమాచారాన్ని దినచర్య పుస్తకాలలో భద్రపరచుకుని, బెంగాలేతర ప్రేక్షకులకు ఠాగూర్ సాహిత్య సంగీత వైభవాన్ని పరిచయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు.

తబలా వాద్య సహకారాన్ని అందించిన శ్రీ శశిభూషణ్ గారి అనుభవజ్ఞత గానానికి మరింత అందాన్ని తెచ్చింది. వ్యాఖ్యాత డాక్టర్ ఆర్. శంకర్ సమన్వయంతో కార్యక్రమం ఆద్యంతం సజావుగా సాగింది. సభికుల స్పందన సంఘమిత్రకు అపార ఆనందాన్ని కలిగించింది. సంగీతం, నృత్యం, సాహిత్యం సమ్మేళనంగా సాగిన ఈ "ఠాగూర్ స్మరణ" కార్యక్రమం హైదరాబాద్ సాంస్కృతిక వేదికల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయింది.

– సంఘమిత్ర మాలిక్
m : 9849 757 141

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

# వెనేడియం మూలకం యొక్క ఖనిజాలు




| period | group 1* | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 H | | | | | | | | | | | | | | | | | 2 He |
| 2 | 3 Li | 4 Be | | | | | | | | | | | 5 B | 6 C | 7 N | 8 O | 9 F | 10 Ne |
| 3 | 11 Na | 12 Mg | | | | | | | | | | | 13 Al | 14 Si | 15 P | 16 S | 17 Cl | 18 Ar |
| 4 | 19 K | 20 Ca | 21 Sc | 22 Ti | 23 V | 24 Cr | 25 Mn | 26 Fe | 27 Co | 28 Ni | 29 Cu | 30 Zn | 31 Ga | 32 Ge | 33 As | 34 Se | 35 Br | 36 Kr |
| 5 | 37 Rb | 38 Sr | 39 Y | 40 Zr | 41 Nb | 42 Mo | 43 Tc | 44 Ru | 45 Rh | 46 Pd | 47 Ag | 48 Cd | 49 In | 50 Sn | 51 Sb | 52 Te | 53 I | 54 Xe |
| 6 | 55 Cs | 56 Ba | 57 La | 72 Hf | 73 Ta | 74 W | 75 Re | 76 Os | 77 Ir | 78 Pt | 79 Au | 80 Hg | 81 Tl | 82 Pb | 83 Bi | 84 Po | 85 At | 86 Rn |
| 7 | 87 Fr | 88 Ra | 89 Ac | 104 Rf | 105 Db | 106 Sg | 107 Bh | 108 Hs | 109 Mt | 110 Ds | 111 Rg | 112 Cn | 113 Nh | 114 Fl | 115 Mc | 116 Lv | 117 Ts | 118 Og |

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| lanthanoid series 6 | 58 Ce | 59 Pr | 60 Nd | 61 Pm | 62 Sm | 63 Eu | 64 Gd | 65 Tb | 66 Dy | 67 Ho | 68 Er | 69 Tm | 70 Yb | 71 Lu |
| [illegible]d series 7 | 90 Th | 91 Pa | 92 U | 93 Np | 94 Pu | 95 Am | 96 Cm | 97 Bk | 98 Cf | 99 Es | 100 Fm | 101 Md | 102 No | 103 Lr |

*Numbering system adopted by the International Union of Pure and Applied Chemistry (IUPAC).

© Encyclopædia Britannica, Inc.

వెనేడియం కేంద్రప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు మనదేశంలో ప్రస్తుతం గుర్తించి నిర్ధారించబడ్డవి. మన అవసరాలకు సరిపడా లేనందున ఇతర దేశాల నుండి ఎక్కువశాతం దిగుమతి చేసుకుంటున్నారు. ఈ కారణంగా దీన్ని క్రిటికల్ మినరల్స్ జాబితాలో చేర్చారు. వెనేడియం అనేది ఒక గట్టి వెండి బూడిద రంగు, సాగే గుణంగల పరివర్తన లోహం మరియు దీని పరిమాణు సంఖ్య 23. ఇది ఒక సూక్ష్మ మూలకం. ఇది సాధారణ, తక్కువ స్థాయిలలో పర్యావరణంలో సర్వత్రా వుంటుంది. మరియు విషపూరిత మైనది. గాఢ వెనేడియం ఆక్సైడ్‌లకు పారిశ్రామికంగా గురికావడం వల్ల శ్వాసకోశ మరియు ఊపిరితిత్తుల చికాకుకు దారితీస్తుంది.


వెనేడియం ఖనిజం

దీన్ని మొట్టమొదట స్పానిష్ శాస్త్రవేత్త ఆండ్రిస్ మ్యాన్యల్ కనిపెట్టారు. 1801లో లెడ్‌మినరల్ అనలైస్ చేసేటప్పుడు, తరువాత 1867లో హెన్‌రీ ఎన్‌ఫీల్డ్ దీని యొక్క ప్యూర్ మూలకాన్ని వెనెడినైట్ అనే నామకరణం చేశారు. ఈ లెడ్‌మినరల్‌ను వెనేడియం న్యాచురల్‌గా దాదాపు 65 ఖనిజాలలో మరియు ఫాసిల్ ఫ్యూయల్ డిపాజిట్లల్లో దొరుకుతుంది. దీన్ని చైనా మరియు రష్యాలో స్టీల్- స్మెల్టర్ స్లాగ్ నుండి ఉత్పత్తి చేస్తారు.

వేరే దేశాలలో డైరెక్ట్‌గా మాగ్నటైట్ నుండి, ఫ్లూడస్ట్ హెవీ ఆయిల్ నుండి వచ్చే దాంట్లో మరియు యురేనియం మైనింగ్ నుండి బైప్రొడక్ట్ రూపంలో వస్తుంది. వీటి ఖనిజాలు ప్యాట్రోనైట్ కార్నోటైట్ వేనేడినైట్. ప్రస్తుతం వేనేడియం ప్రొడక్షన్ వెనేడియంతో కూడిన మాగ్నటైట్ నుండి ఉత్పత్తి చేస్తున్నారు. అది కూడా అల్ట్రా మాఫిక్ గ్యాబ్రోస్ నుండి. టైటనో మాగ్నటైట్‌ని ఐరన్ ఉత్పత్తి చేసేటప్పుడు చాలా వరకు వెనేడియం స్లాగ్‌లోకి వెళ్తుంది. దాని నుండి ఎక్స్‌ట్రాక్ట్ చేస్తారు.



బాక్సైట్



గాబ్రోయిక్ అనార్థోసైట్

చాలా వరకు వెనేడియం ఉత్పత్తి చైనా, రష్యా, సౌత్ఆఫ్రికాలో అవుతుంది. కొలీయాలోని ఫ్యూమరోల్స్‌లో వెనేడియం నిక్షేపాలు శర్బినేట్, కొలిమేట్ ఖనిజాల రూపంలో దొరుకతవి.

వెనేడియం ఐరన్, టైటానియం, గ్యాలియంతో పాటు కలసి వుంటుంది. అందుకని ఈ ఖనిజాన్వేషణకై, లాటరైట్, బాక్సైట్ మాగ్నటైట్, కోల్, ఆయిల్ షేల్స్‌లని టార్గెట్ చేస్తున్నారు.

మనదేశంలో లాటరైట్, బాక్సైట్, క్యాపింగ్స్ పుష్కలంగా ఉన్నవి. గ్రాన్యులైట్స్‌లో డెక్కన్ ట్రాప్ బసాల్ట్‌లలో మరియు ఐరన్ ఓర్స్ కూడా పుష్కలంగా ఉన్నది. కర్ణాటకలో షిమోగా జిల్లాలో టైటాని ఫెర్రస్-వెనేడిఫెర్రస్ మాగ్నటైట్ మినరల్ బెల్ట్ ఉన్నది. ఇక్కడ వెనేడియం 0.8 శాతం నుండి 3 శాతం $V_2O_5$ ఉంటుంది. ఇక్కడ హెూస్ట్‌శిల గ్యాబ్రో-అనార్థోసైట్ అల్ట్రోమేఫిక్ కాంప్లెక్స్‌లో ఉన్నది.

వెనేడియం యొక్క ప్రాథమిక ఉపయోగాలు. ముఖ్యంగా ఉక్కు మిశ్రమాలలో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే వెనేడియం మొత్తంలో దాదాపు 85 శాతం అధిక బలంగల తక్కువ మిశ్రమం గల ఉక్కును తయారి చేయడంలో ఉపయోగిస్తారు. కార్‌చెసిస్ బహుళ అంతస్తులు గల భవనాలు, వంతెనలు, రైల్వేట్రాకులు, భారీ పనిముట్లలో వాడతారు.

ఏరోస్పేస్, డిఫెన్స్‌లో జెట్ ఇంజెన్లు, విమాన బాడీలు మరియు అంతరక్షి నౌకల కోసం టైటానియం - అల్యూమినియం - వెనేడియం మిశ్రమ లోహాలలో ఉపయోగిస్తారు. దీర్ఘకాలిక శక్తి నిల్వకోసం వెనేడియం ఫ్లో బ్యాటరీలు (VFBలు) ఒక ప్రధాన సంకేతికతగా మారుతున్నాయి.

- కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



మెటా గాబ్రో



ఇనుప ఖనిజం (ఐరన్ ఓర్)



లేటరైట్



UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2022

Serial Nomination for SUN TEMPLE, MODHERA AND ITS ADJOINING MONUMENTS

Gujarat State, Mehsana District Province or Region India. Category: Cultural

# ఇరానీ అనుబంధాన్ని చాటే సూర్య దేవాలయం

## మొధేరాలో కాళ్లకు పొడుగాటి బూట్లతో దర్శనమిచ్చే ఆదిత్య

**దాఖలు తేదీ:** 13-12-2022

**ప్రాథమ్యాలు:** (i)(iv)

**రాష్ట్రం లేదా ప్రాంతం:** గుజరాత్, మెహ్సానా జిల్లా

భారతదేశంలో సూర్యారాధన సంప్రదాయం మూలాలు హిందూ మతానికి చెందిన వేద గ్రంథాలలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇది వేల సంవత్సరాల నాటి ప్రాచీన సంప్రదాయాన్ని తెలియజేస్తుంది. మొధేరాను కొన్నిసార్లు 'ముందేరా' అని కూడా పిలుస్తారు. ఇది మొధా బ్రాహ్మణుల అసలైన నివాస స్థలం. శ్రీరాముడు, సీతమ్మల వివాహ సందర్భంలో ఈ ప్రాంతాన్ని వారికి 'కృష్ణార్పణం' (దానం)గా ఇచ్చినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. వీరు మొధా వనియాలకు (వర్తక సమాజం) గురువులుగా వ్యవహరించేవారు. ప్రముఖ జైన ఆచార్యుడైన హేమచంద్రుడు కూడా ఈ మొధా వంశానికి చెందినవారే. గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా, బెచరాజీ తాలూకాలో ఉన్న రూపాన్ నది ఉపనది అయిన పుష్పవతి నది ఎడమ గట్టున ఈ అద్భుతమైన మొధేరా సూర్య దేవాలయం ఉంది.



### నిర్మాణ విశేషాలు

మారు-గుర్జర శైలిలో నిర్మించబడిన ఈ ఆలయంలో ప్రధాన గర్భాలయం (గర్భగృహ), ఒక అంతరాలయం లేదా ముఖమండపం (గూఢమండపం), ఒక వెలుపలి మండపం లేదా సభా మండపం (రంగమండపం), ప్రస్తుతం 'రామకుండ్' అని పిలవబడే ఒక పవిత్రమైన కోనేరు ఉన్నాయి. ప్రధాన గర్భా లయం, సభా మండపం రెండూ ఒక ఎత్తైన రాతి వేదికపై నిర్మించబడి ఉన్నాయి. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయాన్ని ప్రకాశవంతమైన పసుపు రంగు ఇసుక రాయి (బ్రైట్ ఎల్లో శాండ్ స్టోన్)తో నిర్మించారు.

### ప్రధాన ఆలయ సముదాయం

ఈ ఆలయ గర్భగృహ ప్లాన్ తూర్పు, పడమర వైపులకు ఒక్కొక్కటి, ఉత్తరం, దక్షిణం వైపులకు రెండేసి చొప్పున పొడుచుకు వచ్చిన భాగాలతో ఒక దీర్ఘచతురస్రాకారాన్ని కలిగి ఉంటుంది. ఇది 15.78 మీ. x 7.83 మీ. కొలతలతో ఉండి, 'గర్భగృహ', 'గూఢమండపం'లుగా దాదాపు సమానంగా విభజించబడి ఉంటుంది. ఆలయం నాలుగు వెలుపలి మూలలు ఎత్తుపల్లాలు కలిగి





ఉంటాయి. ఇక్కడ ప్రధాన మూల అయిన 'కర్ణ' భాగం, ఇరువైపులా ఉండే 'ప్రతిరథాల' కంటే చాలా స్పష్టంగా ప్రముఖంగా కనిపిస్తుంది. ఆలయానికి తూర్పు వైపున ఉన్న కొన్ని మెట్లు ఒక చిన్న వరండా వైపునకు దారితీస్తాయి. ఈ వరండా ద్వారానే ఆలయంలోకి ప్రవేశించే ఏకైక ద్వారం ఉంటుంది. రెండు స్తంభాలు ఒక ఇరుకైన ప్రవేశమార్గాన్ని లేదా 'ముఖమండపాన్ని', ప్రధాన హాల్ అయిన 'గూఢమండపం' నుండి వేరు చేస్తాయి. అష్టభుజి ఆకారంలో అమర్చబడిన ఎనిమిది స్తంభాలు గూఢమండపం పైన ఒక కేంద్ర గుమ్మటం వంటి నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. గర్భగృహం లోపలి భాగం 3.35 చదరపు మీటర్ల స్థలంతో చతురస్రాకారంలో ఉంటుంది. దీని సొంత గోడలకు, ఆలయ వెలుపలి గోడలకు మధ్య ఉన్న ఒక మార్గం ద్వారా 'ప్రదక్షిణాపథం' ఏర్పడింది. లోపలి వైపు నుండి చూస్తే గర్భగుడి గోడలు చాలా సాదాసీదాగా ఉంటాయి. అయితే, ప్రవేశద్వారం మాత్రం ప్యానెల్స్‌తో, వాటిలో కూర్చుని ఉన్న సూర్య భగవానుడి విగ్రహాలు, వాటి చుట్టూ ఉన్న నృత్యకారుల శిల్పాలతో అందంగా చెక్కబడి ఉంటుంది. ఆలయ నిలువు అమరిక మూడు ప్రాథమిక భాగాలుగా విభజించబడింది – పీఠం, మండోవరం, శిఖరం (ఇది ప్రస్తుతం ఉనికిలో లేదు). ఈ మొత్తం నిర్మాణం ఒక ఎత్తైన వేదిక (పీఠం)పై నిర్మించబడింది. దీని పైన 'వేది–బంధ', 'జంఘ' అనే రెండు భాగాలతో కూడిన ప్రధాన గోడ (మండోవరం) ఉంటుంది.

ఈ పునాది వేదిక పైనున్న గోడ భాగం చక్కటి చెక్కడాలు, ఆకృతులతో కూడిన ప్రొఫైల్‌ను కలిగి ఉంటుంది. 'మండోవరం' అని పిలిచే ఈ గోడ చెక్కడాల భాగం, కలశం ఆకారంలో ఉండే 'కుంభం'తో ప్రారంభమవుతుంది. దీని పైన 'కలశం' ఉంటుంది. దీనిపై 'కేవల' అని పిలిచే చైత్య–కిటికీల ఆకారాలతో అలంకరించబడిన ఒక వెడల్పాటి పట్టీ ఉంటుంది. దీని తర్వాత 'మంచె' అని పిలిచే అటువంటిదే మరొక పొడుచుకు వచ్చిన భాగం ఉంటుంది. ఒక సన్నని గీత ద్వారా వేరు చేయబడిన గోడ యొక్క శిల్ప ఫలకాల భాగాన్ని 'జంఘ' అని పిలుస్తారు. ప్రదక్షిణాపథం చుట్టూ ఉన్న గుళ్లలో, అలాగే గర్భగుడి గోడకున్న మూడు కిటికీలకు ఇరువైపులా ఉన్న మూడు గుళ్లలో సూర్యుని విగ్రహాలు చెక్కబడ్డాయి. ఈ శిల్పాలలో సూర్య భగవానుడు రెండు చేతుల్లో తామర పువ్వులను పట్టుకుని, ఏడు గుర్రాల రథంపై నిలబడి ఉన్నట్లు చూపబడింది. దీని పైన చైత్య–కిటికీ, కీర్తిముఖాల వరుసలతో కూడిన చెక్కడాల భాగాన్ని 'మాలక్వాల్' అంటారు. దీని పైన మండోవరం యొక్క అన్నింటికంటే పైభాగం, అంటే ప్రధాన కార్నిస్ అయిన 'ఛజ్జీ' ఉంటుంది.

**సభా మండపం:** స్తంభాలతో కూడిన ఈ బహిరంగ సభా మండపం ప్లాన్ ఒక చతురస్రంలా ఉంటుంది. ఈ మండపానికి నాలుగు వైపులా, అంటే పశ్చిమ, దక్షిణ, తూర్పు మరియు ఉత్తర దిశలలో ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. ప్రస్తుత ప్రవేశ ద్వారం నుండి, సమాంతరంగా సాగే నాలుగు జతల స్తంభాలు మండపం మధ్య భాగానికి దారితీస్తూ ఒక అష్టభుజి ఆకారాన్ని ఏర్పరుస్తాయి. ఇది ఇక్కడి కేంద్ర గుమ్మటానికి ఆధారంగా నిలుస్తుంది. బాహ్యంగా చూస్తే ఈ మండపం అత్యంత అందంగా అలంకరించబడింది. దీని నాలుగు వైపులా విభిన్న శిల్ప శ్రేణులు ఉన్నాయి. దీని 'పీఠం' లేదా 'అధిష్ఠానం' ప్రధాన గర్భాలయం కంటే చిన్నదిగా ఉంటుంది. ఇక్కడి 'పద్మ' భాగం గర్భాలయం కంటే మరింత సంక్లిష్టంగా, అందంగా అలంకరించబడింది.

దీని గోడల శిల్పకళా శైలి భిన్నమైనది. 'నరథర' (మనుషుల శిల్పాల వరుస) పైభాగంలో విడిగా ఒక పట్టీ ఉంటుంది, ఇది దేవతలు, నృత్యకారుల శిల్ప ఫలకాలతో నిండి ఉంటుంది. ఈ శిల్ప శ్రేణి మండోవరం 'జంఘ' భాగానికి సమానమైనదని చెబుతారు. దీని పైనున్న కార్నిస్ 'కక్షాసనం' అనే నిర్మాణానికి ఆధారంగా ఉంటుంది. దీని పైన మెట్ల పిరమిడ్ ఆకారంలో పైకప్పు ఉండేది. ఈ హాల్‌లోని స్తంభాలు రెండు రకాలు – మొదటివి చిన్నవి. ఇవి గోడపై ఆధారపడి ఉంటూ పైకప్పును మోస్తాయి. రెండవవి నేరుగా నేల నుండే పైకి ఉండే పొడవైన స్తంభాలు. మొదటి రకం స్తంభాల దిగువ సగం భాగం చతురస్రాకారంలో ఉండి, ఆపై కలశం ఆకారం వస్తుంది. రెండవ రకం స్తంభాలలో, స్తంభ భాగం చతురస్ర లేదా అష్టభుజి పునాదిపై ఆధారపడి ఉంటుంది. దీనిని 'కుంభి' అంటారు. సభా మండపం గోడలు, చిన్న ఫ్లాట్ సీలింగ్‌లు, ద్వారబంధాల పైపలకల మీద రామాయణ ఘట్టాల దృశ్యాలు చెక్కబడి ఉన్నాయి.

**తోరణం:** ఈ ఆలయ ప్రాంగణంలో రెండు ప్రవేశ ద్వారాలు వాటి అసలు స్థానాల్లోనే సురక్షితంగా ఉన్నాయి. మొదటి తోరణ ద్వారం కోనేరుకు, నృత్య మండపానికి మధ్యలో ఉండగా.. రెండవది నదీతీరానికి కిందకు దారితీసే వాలుకు సమీపంలో, ప్రాంగణం ఈశాన్య మూలలో ఉంది. సభా మండపానికి ఎదురుగా నిలిచి ఉన్న 'కీర్తితోరణం'కు సంబంధించిన స్తంభాలు మాత్రమే ప్రస్తుతం మిగిలి ఉన్నాయి; ఈ కీర్తితోరణం స్తంభాల గుండా వెళ్లే మెట్ల వరుస. ప్రస్తుతం 'రామకుండ్' అని పిలవబడే పవిత్రమైన కోనేరు వైపునకు దారితీస్తుంది.

**కోనేరు:** ఆలయానికి ఎదురుగా ఉత్తర–దక్షిణాలుగా 175 అడుగులు, తూర్పు–పడమరలుగా 120 అడుగుల కొలతలతో 'సూర్యకుండ్' అని పిలవబడే ఒక విశాలమైన కోనేరు ఉంది. భక్తులు స్నానాలు చేయడానికి అద్భుతమైన మెట్ల వరుసల ద్వారా దీనిలోకి ప్రవేశించవచ్చు. ఈ కోనేరు చుట్టూ దీర్ఘ చతురస్రాకారంలో అమర్చబడిన వేదికలు, అరుగులు ఉన్నాయి. వీటి మధ్యలో వివిధ పరిమాణాలు, ఆకారాలలో ఉన్న చిన్న చిన్న ఉప–ఆలయాలు నిర్మించబడ్డాయి. ఒక అరుగు నుండి మరొక అరుగుకు చేరు కోవడానికి జిగ్‌జాగ్‌గా అమర్చబడిన చిన్న చిన్న పిరమిడ్ ఆకారపు మెట్ల మార్గాలు ఉన్నాయి.



**శిల్పకళా విశేషాలు:** ఈ ఆలయంలో విశిష్టమైన ప్రతిమాశాస్త్ర ప్రాధాన్యత కలిగిన అద్భుతమైన శిల్పాలు ఉన్నాయి. ప్రధాన గూళ్లు లేదా ప్యానెళ్లలో ఉన్న దాదాపు మనుషుల పరిమాణంలో ఉండే పెద్ద శిల్పాలు మూడు రకాల దేవతా సమూహాలకు చెందినవి. అవి ఆదిత్యులు (ద్వాదశాదిత్యులు), లోకపాలకులు, దేవీమూర్తులు.

**1. ద్వాదశాదిత్యులు:** పన్నెండు మంది ఆదిత్యుల శిల్పాలు గర్భగుడి పశ్చిమ భాగం చుట్టూ అమర్చబడి ఉన్నాయి. వీటి శిల్ప కళా శైలి కచ్చితంగా సూర్య భగవానుని పోలి ఉంటుంది. ఈ దేవతా మూర్తులు పరుగెత్తుతున్న ఏడు గుర్రాల పీఠంపై 'సమభంగ' (సమంగా నిటారుగా నిలబడే) భంగిమలో ఉంటారు. ఈ స్వామి వారి బూట్ల చివరల మధ్య భాగంలో, రథసారథి అయిన 'అనూరుడు' ఒక చేత్తో గుర్రాల పగ్గాలను పట్టుకుని, మరొక చేతిని తలపైకి ఎత్తి పట్టుకున్నట్లు కనిపిస్తాడు. ఈ ఆదిత్యుల చేతుల్లో వికసించిన తామరపువ్వులు ఉంటాయి.

**2. దశ లోకపాలకులు:** పది మంది లోకపాలకుల శిల్పాలు ఆలయం ప్రధాన మూలల్లో, ఉత్తర, దక్షిణ గోడల లోతైన గూళ్లలో ఉంచబడ్డాయి. ఈ పది శిల్పాలలో తొమ్మిది లోకపాలకులవి. ఇందులో సంప్రదాయక అష్టదిక్పాలకులు (ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు), అదనంగా మరొక ఇంద్రుని శిల్పం ఉన్నాయి. ఇక పదవ శిల్పం ప్రతిమాశాస్త్రం పరంగా ఎంతో ఆసక్తికరమైన ఒక దేవతా మూర్తిని సూచిస్తుంది; ఈ విగ్రహానికి మూడు తలలు, మూడు చేతులు, మూడు కాళ్ళు ఉంటాయి. (ఈ విగ్రహం మూడు రకాల అగ్నులు – అగ్ని దేవుడి మూడు కాళ్లు– లేదా మూడు కాలాలకు ప్రతీక కావచ్చు లేదా త్రిమూర్తులకు ప్రతీక కావచ్చు)

**3. దేవీమూర్తులు:** పన్నెండు మంది దేవీమూర్తుల శిల్పాలు ఆలయం తూర్పు భాగంలో, అంటే సభా మండపం చుట్టూ సమూహంగా చెక్కబడ్డాయి. ఈ దేవీమూర్తులందరూ 'త్రిభంగ' (శరీరాన్ని మూడు వంపులుగా తిప్పి నిలబడే) భంగిమలో పద్మ పీఠంపై నిలిచి ఉంటారు. ఈ పీఠాలకు ఇరువైపులా తరచుగా మానవ ఆకృతులు కనిపిస్తుంటాయి. వీటితో పాటు, ఆలయంలోని ఇతర గూళ్లు, మూలల్లో శివుడు, విష్ణు వివిధ రూపాలు, నాగదేవతలు మొదలైన శిల్పాలు కూడా కనిపిస్తాయి.

**విశిష్ట సార్వత్రిక విలువ సమర్థన**

గుజరాత్‌లో ప్రాచీన కాలం నుండి వాస్తుశిల్పం, శిల్పకళ అద్భుతంగా అభివృద్ధి చెందాయి. శతాబ్దాలుగా చావ్దాలు, సోలంకీలు, వాఘేలాలు వంటి అనేక రాజవంశాలు, అలాగే సంపన్న జైన వ్యాపారులు ఎన్నో దేవాలయాలు, సరస్సులు, మెట్ల బావులను నిర్మించి, వాటిని అద్భుతమైన శిల్పాలతో అలంకరించారు.

గుజరాత్‌లోని వందలాది చిన్న, పెద్ద దేవాలయాలలో.. ఇతర రాజవంశాల కంటే సోలంకీలు నిర్మించిన ఆలయాలు అత్యంత ప్రముఖమైనవి. సోలంకీ రాజవంశం నిర్మాణ శైలికి పాటన్ లోని 'రాణి కీ వావ్', 'సహస్రలింగ జలాశయం', సిద్ధ్‌పూర్ లోని 'రుద్రమహాలయ' మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఉదాహరణలు.

ఈ ఆలయం అద్భుత నిర్మాణ శైలితో, సూర్యుని గమనానికి అనుగుణంగా నిర్మించబడిన ఖగోళ/సాంకేతిక నైపుణ్యాలతో మాత్రమే కాకుండా .. నిజమైన కళాత్మక నైపుణ్యానికి ప్రతీకలుగా నిలిచే విశిష్ట శిల్పకళా అలంకరణలతోనూ ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఇది సోలంకీ రాజవంశం పోషణలో, 11వ శతాబ్దపు పశ్చిమ భారతదేశంలో వృద్ధి చెందిన 'మరు–గుర్జర' నిర్మాణ శైలికి ఒక అత్యుత్తమ నమూనా. ఈ ఆలయ నిర్మాణ శైలిని బట్టి, ఇది మొదటి భీమదేవుని (సా.శ. 1022–1063) పరిపాలనా కాలానికి చెందినదిగా భావించవచ్చు.

తూర్పు ముఖంగా, ఎత్తైన దిబ్బపై నిర్మించబడిన ఈ ఆలయ అమరిక ఎంత ఖచ్చితంగా ఉందంటే.. విషువత్తుల (పగలు, రాత్రి సమానంగా ఉండే రోజులు) సమయంలో ఉదయించే సూర్యుని తొలి కిరణాలు సభా మండప ద్వారాల గుండా నేరుగా లోపలి గర్భగుడిపై పడతాయి. ఈ ఆలయం లోపలి, వెలుపలి గోడలపై దేవతామూర్తులు, పూలు, ఆకులు, పక్షులు, జంతువుల శిల్పాలు అత్యంత వైభవంగా, విరివిగా చెక్కబడ్డాయి. ఈ ఆలయ సముదాయంలో ప్రధాన గర్భాలయం నేరుగా కోనేరుతో అనుసంధానించబడి ఉంటుంది. పశ్చిమ భారతదేశ నిర్మాణ శైలిలో ఆలయం, సూర్యకుండ్‌ల కలయికతో కూడిన ఒక విశిష్టమైన రూపానికి ఇది బహుశా ఒక అసాధారణమైన ఉదాహరణ. ఇక్కడి ప్రధాన గర్భాలయం నేరుగా కోనేరుతో ముడిపడి ఉండటం అనేది బహుశా ఈ ప్రాంతంలోని ఇతర ఏ ఆలయంలోనూ లేని ఒక ప్రత్యేకమైన విశిష్టత.

మొధేరా సూర్య దేవాలయంలోని ప్రధాన మండపానికి, గర్భగుడికి మధ్య ఉన్న ఈ గోడలు ముప్పై నాలుగు పెద్ద శిల్ప ప్యానెళ్లతో అలంకరించబడి ఉన్నాయి. వీటిని వాటిలోని దేవతామూర్తుల ఆధారంగా మూడు ప్రధాన సమూహాలుగా విభజించవచ్చు:

- **మొదటి సమూహం:** పన్నెండు మంది ఆదిత్యులను (ద్వాదశాదిత్యులు) సూచిస్తుంది.
- **రెండవ సమూహం:** పన్నెండు మంది దేవీమూర్తులను (ద్వాదశ గౌరీలు) కలిగి ఉంటుంది.
- **మూడవ సమూహం:** పది శిల్పాలను కలిగి ఉంటుంది. వీరిలో ఎనిమిది మంది 'దిక్పాలకులు' (దిశల సంరక్షకులు) కాగా, మిగిలిన ఇద్దరు ఇతర దేవతామూర్తులు.

ఆదిత్యులు అనేవారు సూర్య భగవానుని యొక్క వివిధ రూపాలు.





సూర్య భగవానుడితో పాటు ఆయన పన్నెండు రూపాలను (సంవత్సరంలోని పన్నెండు నెలల చక్రానికి అనుగుణంగా) వేద కాలం నుండి ఆరాధిస్తున్నారు. మొధేరా ఆలయ గర్భగుడి వెలుపలి గోడలపై ఉన్న పన్నెండు పెద్ద శిల్ప ఫలకాల మీద ఈ ఆదిత్యుల విగ్రహాలను ఉంచారు.

**ప్రమాణం (i):** సూర్య భగవానునికి అంకితం చేయబడిన మొధేరా సూర్య దేవాలయం, మానవ సృజనాత్మక ప్రతిభకు ఒక అద్భుతమైన నిదర్శనం. ఇది భారతదేశంలోని ఆలయ నిర్మాణ శైలులలో ఒక విశిష్టమైన మణిహారం, గుజరాత్ కు గర్వకారణం. ఈ ఆలయం తన అద్భుతమైన నిర్మాణ వైభవంతోనే కాకుండా, ఖగోళ/సాంకేతిక నైపుణ్యాలతోనూ ఎంతగానో ఆకట్టుకుంటుంది. తూర్పు ముఖంగా ఎత్తైన దిబ్బపై నిర్మించబడిన ఈ ఆలయ అమరిక ఎంత ఖచ్చితంగా ఉందంటే.. విషువత్తుల (పగలు, రాత్రి సమానంగా ఉండే రోజులు) సమయంలో ఉదయించే సూర్యుని తొలి కిరణాలు సభా మండప ద్వారాల గుండా నేరుగా లోపలి గర్భగుడిపై పడతాయి. భారతదేశంలో అంతకుముందు నిర్మించిన సూర్య దేవాలయాలలో ఈ స్థాయి ఖగోళ కచ్చితత్వం అంతగా కనిపించదు. ఇది సోలంకీ రాజవంశం ఆదరణలో, 11వ శతాబ్దపు పశ్చిమ భారతదేశంలో వృద్ధి చెందిన 'మారు-గుర్జర' నిర్మాణ శైలికి ఒక అత్యుత్తమ నమూనా.

**ప్రమాణం (iv):** ఈ ఆలయం కేవలం తన చక్కటి కొలతలు, సౌందర్యాత్మక ఆకర్షణకు మాత్రమే కాకుండా, తన నిర్మాణ శైలితో ఇక్కడి శిల్పకళా అలంకరణలు అద్భుతంగా సమిళితమైన విధానానికి కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయ బేస్మెంట్ అనేక రకాల శిల్ప వరుసలతో అత్యంత సంక్లిష్టంగా, అందంగా అలంకరించబడింది. ఆలయ గోడలపై సూర్య భగవానుడు, అష్టదిక్పాలకులు, గౌరీ దేవి వివిధ రూపాలు, నృత్యం చేస్తున్న అప్సరసలు, సంగీతకారులు, శృంగార శిల్పాల ప్యానెళ్లు ఉన్నాయి.

ఇక్కడ సూర్య భగవానుడు రెండు చేతుల్లో వికసించిన తామరపువ్వులను పట్టుకుని, ఏడు గుర్రాల రథంపై 'సమభంగా' (నిటారుగా నిలబడే) భంగిమలో కనిపిస్తారు. గర్భగృహం, సభా మండపం ద్వార బంధాల పైపలకల మీద కూడా సూర్యుని శిల్పాలు చెక్కబడ్డాయి. మొధేరాలోని ప్రధాన గర్భగుడి పైకప్పు 'సమతల' (ఫ్లాట్ సీలింగ్) రకానికి చెందినది.

### ప్రామాణికత మరియు/లేదా సమగ్రత యొక్క ప్రకటనలు

### ప్రామాణికత

మొధేరా సూర్య దేవాలయం తన అసలైన రూపం, మరియు నమూనా పరంగా ప్రాథమిక రూపాన్ని అలాగే నిలబెట్టుకుంది. ఈ ఆలయానికి సంబంధించిన నిర్మాణ సామగ్రి, కట్టడాలు, శిల్పాలు, అలంకరణలు మరియు ఇక్కడి శిల్పాలు చెప్పే కథనాలు వంటి వివిధ విశిష్ట లక్షణాలన్నీ వాటి అసలైన రూపంలోనూ, మూల పదార్థంతోనూ సంరక్షించబడుతున్నాయి. పుష్పవతి నది ఎడమ గట్టున, నృత్యమండపం (సభా మండపం) తూర్పు ప్రవేశ ద్వారం వద్ద ఒక తోరణంతో పాటు, దానికి ఎదురుగా ఒక దీర్ఘచతురస్రాకార కోనేరు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

సోలంకీ రాజు మొదటి భీమదేవుని (సా.శ. 1022-1063) పరిపాలనా కాలంలో ఈ ప్రాంతం అత్యున్నత వైభవాన్ని, విస్తృతిని, గరిష్ఠ సంపదను సాధించింది. కోట గోడలు, ప్రవేశ ద్వారాలు, బావులు, చెరువులు, దేవాలయాలు, సమాధులు, మసీదులు వంటి అనేక పురావస్తు అవశేషాలు ఇప్పటికీ ఈ ప్రాంతం చుట్టూ విస్తరించి ఉన్నాయి.

**ఈ ఆలయ సముదాయం మూడు విభిన్న భాగాలను కలిగి ఉంటుంది:**

1. ప్రదక్షిణాపథం, పక్కనే ఉండే ఉప-మండపాలు, ప్రవేశ వరండాతో కూడిన ప్రధాన ఆలయ సముదాయం (గర్భగుడి).
2. ముందు భాగంలో తోరణ ద్వారంతో, విడిగా నిర్మించబడిన సభా మండపం.
3. లెక్కలేనన్ని చిన్న చిన్న ఉప-ఆలయాలతో అలంకరించబడిన ఒక పెద్ద దీర్ఘచతురస్రాకార కోనేరు.

ఈ భాగాలన్నీ ప్రస్తుతం చాలా మంచి స్థితిలో సంరక్షించ బడుతున్నాయి. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా 'నేషనల్ పాలసీ ఫర్ కన్జర్వేషన్, 2014' ఈ చారిత్రక వారసత్వ ప్రదేశం సంపూర్ణ సంరక్షణ నియమావళికి మార్గదర్శకంగా పనిచేస్తోంది.

### సమగ్రత

మొధేరా సూర్య దేవాలయం విశిష్ట సార్వత్రిక విలువను ప్రతిబింబించే అత్యంత ముఖ్యమైన లక్షణాలు, విశేషాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ప్రభుత్వ రక్షణలో ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలోనే అన్ని కట్టడాలు, శిల్పాలు ఉన్నాయి; చివరకు కాలక్రమేణా కట్టడం నుండి విడిపోయిన శిల్పాలను కూడా వాటి అసలు స్థానంలోనే భద్రపరిచారు. ప్రస్తుతం ఈ మొత్తం ఆలయ సముదాయం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా.. 'ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు మరియు అవశేషాల చట్టం - (1958)', దాని నిబంధనలు, ఏఎస్ఐ 'నేషనల్ పాలసీ ఫర్ కన్జర్వేషన్, 2014' ప్రకారం సంపూర్ణంగా భద్రపరచబడుతూ, రక్షించబడుతూ, పరిరక్షించ బడుతూ, నిర్వహించబడుతోంది.



### ఇరాన్ తరహా బూట్లు, నడుము పట్టీ

మొధేరా సూర్య దేవాలయంలోని సూర్య విగ్రహాలకు ఇరాన్ తరహా బూట్లు, నడుము పట్టీ ఉన్నాయనే అంశానికి చరిత్ర, శిల్పకళా శాస్త్రం పరంగా చాలా స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. ఈ విషయాన్ని నిర్ధారించే మూడు ప్రధాన అంశాలు:

#### 1. శిల్పకళా శాస్త్ర ఆధారాలు

భారతీయ శిల్పకళా శాస్త్ర గ్రంథాలైన బృహత్సంహిత (వరాహమిహిరుడు రచించినది), విష్ణుధర్మోత్తర పురాణం ప్రకారం, ఉత్తర భారతదేశంలో సూర్యుని విగ్రహాన్ని చెక్కేటప్పుడు తప్పనిసరిగా "ఉదీచ్య వేషం" (ఉత్తరాది లేదా విదేశీ వస్త్రధారణ)లో చూపించాలని స్పష్టంగా ఉంది. మొధేరాలోని సూర్య విగ్రహాలు ఈ నియమాన్ని పాటించాయి.

- **బూట్లు:** సూర్యుడి పాదాలు ఎప్పుడూ కనిపించకూడదు, అవి మోకాళ్ల వరకు ఉండే బూట్ల చేత కప్పబడి ఉండాలి. మొధేరా ఆలయ గర్భగుడి గోడలపై ఉన్న 12 ఆదిత్యుల విగ్రహాలకు ఈ బూట్లు స్పష్టంగా కనిపిస్తాయి.
- **నడుము పట్టీ:** విగ్రహాల నడుముకు ఉండే పట్టీని సంస్కృతంలో 'అవ్యాంగ' అంటారు. ఇది ప్రాచీన పర్షియన్ (ఇరాన్) భాషలోని 'ఐవియాంఘన' అనే పదం నుండి వచ్చింది. ఇది జోరాస్ట్రియన్ పూజారులు ధరించే పవిత్ర దారం లాంటిది. మొధేరా విగ్రహాలకు ఈ అవ్యాంగ పట్టీ స్పష్టంగా చెక్కబడి ఉంది.

#### 2. పురావస్తు ఆధారాలు

ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, చరిత్రకారుల పరిశోధనల ప్రకారం:

- మొధేరా ఆలయంలోని సూర్య విగ్రహాలు ధరించిన కోటు, బూట్లు, ఆ కాలంలోని ఇరాన్, మధ్య ఆసియా ప్రాంతాలైన సిథియన్, కుషాన్ రాజుల వస్త్రధారణను పోలి ఉన్నాయి.
- గుజరాత్‌లోని ఇతర సూర్య ఆలయాలలో దొరికిన విగ్రహాలలో కూడా ఈ లక్షణాలు బయటపడ్డాయి. ఇది కేవలం ఒక కళాకారుడి ఊహ కాదు, ఆనాటి స్థిరపడిన శిల్పకళా సంప్రదాయం.

#### 3. మగ బ్రాహ్మణుల గ్రంథాలు

భవిష్య పురాణంలో సూర్యారాధనను వివరించే అధ్యాయాలలో... సూర్యుడిని పూజించే 'మగ బ్రాహ్మణులు' తమ ఆచారాలను ఇరాన్ నుండి తెచ్చారని, వారు ధరించే దుస్తులనే సూర్య దేవుడికి కూడా అలంకరించాలని రాయబడి ఉంది. మొధేరాలో వీరి ప్రభావం వల్లనే విగ్రహాలకు ఆ రూపం వచ్చింది.

మొధేరా సూర్య విగ్రహానికి ఉన్న బూట్లుచ 'అవ్యాంగ' అనే నడుము పట్టీ... ప్రాచీన గుజరాత్, ఇరాన్ మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధానికి శిలా రూపంలో ఉన్న తిరుగులేని సాక్ష్యాలు.

### భారతీయ వారసత్వ కట్టడాలు

ప్రస్తుతం కోణార్క్ మరియు మొధేరాలోని సూర్య దేవాలయాలు చాలా మంచి స్థితిలో ఉన్నాయి. భారత దేశంలో సూర్య ఆరాధనకు వేల సంవత్సరాల పురాతన చరిత్ర ఉంది. కాశ్మీర్‌లోని 8వ శతాబ్దపు మార్తాండ్ సూర్య దేవాలయం, ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయంలతో పాటు.. మొధేరా ఆలయం కూడా భారతదేశంలో సూర్య ఆరాధనా విధానం విస్తరించిన చారిత్రక క్రమంలో ఒక అమూల్యమైన లింక్ (సంధి)గా నిలుస్తుంది. ఈ ఆరాధనా పరంపర 8వ శతాబ్దంలో కాశ్మీర్‌లో ప్రారంభమై, కాలక్రమేణా దేశంలోని తూర్పు, పడమర దిశల చివరి ప్రాంతాల వరకు చేరుకుంది. అయినప్పటికీ, మొధేరాలోని సూర్య దేవాలయం.. కశ్మీర్ ఆలయం కంటే, బంగాళాఖాతం తీరానికి సమీపంలో ఉన్న ప్రసిద్ధ కోణార్క్ ఆలయం కంటే కూడా తన నిర్మాణ శైలి, ఉపయోగించిన వస్తువులు, సైట్ ప్లాన్ పరంగా పూర్తిగా భిన్నమైనది.

- **కోణార్క్ సూర్య దేవాలయం:** వాస్తుశిల్పం పరంగా ఇది 'కళింగ' నిర్మాణ శైలి పరాకాష్ఠకు ప్రతీకగా నిలుస్తుంది.
- **మార్తాండ్ సూర్య దేవాలయం:** ఇది కాశ్మీరీ నిర్మాణ శైలిపై ఆధారపడి ఉండి, గుప్త, గాంధార శిల్పకళల సమ్మిశ్రిత రూపంగా కనిపిస్తుంది. దీని నిర్మాణానికి ప్రధానంగా రాయిని ఉపయోగించారు.
- **మొధేరా సూర్య దేవాలయం:** వీటికి భిన్నంగా మొధేరా ఆలయం 'మారు-గుర్జర' నిర్మాణ శైలిపై ఆధారపడి రూపొందింది. దీని నిర్మాణానికి ప్రధానంగా ఇసుక రాయిని ఉపయోగించారు.

– అనువాదం: ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com





సదస్సు

## NITHM వేదికగా తెలంగాణ పర్యాటక భవిష్యత్‌పై మేధోమథనం

# "డెస్టినేషన్ తెలంగాణ–ది రోడ్ అహెడ్"

**భా**రత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ మరియు తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో, యువజన అభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ (YAT&C) పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (NITHM), గచ్చిబౌలి, హైదరాబాద్ ఆధ్వర్యంలో "డెస్టినేషన్ తెలంగాణ – ది రోడ్ అహెడ్" పేరుతో పర్యాటక సదస్సు 2026 మే 23న ఘనంగా నిర్వహించబడింది.



తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వ్యూహాలు, అవకాశాలు, సవాళ్లు, భాగస్వామ్య విధానాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలిచింది. విధాన నిర్ణేతలు, పర్యాటక రంగ నిపుణులు, హాస్పిటాలిటీ ప్రతినిధులు, వారసత్వ పరిరక్షణ నిపుణులు, పరిశ్రమ భాగస్వాములు సమావేశంలో పాల్గొన్నారు.

కార్యక్రమం పాల్గొనేవారి నమోదు ప్రక్రియతో ప్రారంభమైంది. అనంతరం అట్రియంలో ఏర్పాటు చేసిన "తెలంగాణ జిల్లా పర్యాటక పోస్టర్ ప్రదర్శన"ను అతిథులు సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల పర్యాటక విశిష్టతలను ప్రతిబింబించిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం అతిథులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి తమ కట్టుబాటును తెలియజేశారు.

ప్రారంభ సమావేశంలో NITHM డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ స్వాగత ప్రసంగం చేసి సదస్సు లక్ష్యాలను వివరించారు. తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉన్నతాధికారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (YAT&C) శ్రీమతి వాణి ప్రసాద్, NITHM చైర్‌పర్సన్ శ్రీ జయేష్ రంజన్ IAS, డిపార్టుమెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ ప్రతినిధులు, పర్యాటక శాఖ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (TGTDC) చైర్మన్ తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు (MoU) కుదిరాయి. అదేవిధంగా తెలంగాణ పర్యాటక బ్రాండ్ గుర్తింపును బలోపేతం చేసే "టూరిజం బ్రాండ్ కిట్"ను ఆవిష్కరించారు.

తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై కీలక ప్రసంగం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం అతిథుల సత్కారం, కృతజ్ఞతా ప్రసంగంతో ప్రారంభ సమావేశం ముగిసింది.

రెండో సమావేశంలో "డెస్టినేషన్ తెలంగాణ – ది రోడ్ అహెడ్" అంశంపై సీఈఓల ప్యానెల్ చర్చ జరిగింది. శ్రీ తరుణ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హాస్పిటాలిటీ, ట్రావెల్, వెడ్డింగ్ మరియు పర్యాటక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక రంగ పోటీతత్వాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక వసతులు, గమ్యస్థాన బ్రాండింగ్, పెట్టుబడులు, భాగస్వామ్య వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

మూడో సమావేశం "వారసత్వ పరిరక్షణ మరియు పర్యాటక అనుకూల నగరాల నిర్మాణం – భాగస్వాముల పాత్ర" అనే అంశంపై నిర్వహించబడింది. అర్జున్ రావు కుతాడి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్ (వర్చువల్ ద్వారా), అలాగే INTACH ప్రతినిధి ఇంజినీర్ వేద కుమార్ మణికొండ పాల్గొన్నారు. వారసత్వ కట్టడాల సంరక్షణ, పట్టణ ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, సుస్థిర నగరాభివృద్ధి వంటి అంశాలపై వారు విలువైన సూచనలు చేశారు.

చివరి సమావేశం "తెలంగాణను హరిత మరియు సుస్థిర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం" అనే అంశంపై జరిగింది. పర్యాటక శాఖ డైరెక్టర్ ఎల్. రంజీత్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ చర్చలో హాస్పిటాలిటీ, ఈకో టూరిజం, అనుభవాత్మక పర్యాటక రంగ నిపుణులు పాల్గొన్నారు. పర్యావరణ హిత పర్యాటక విధానాలు, గ్రీన్ టూరిజం కార్యక్రమాలు, బాధ్యతాయుత పర్యాటక అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు.

సదస్సు అనంతరం NITHM రెస్టారెంట్‌లో వర్కింగ్ లంచ్ ఏర్పాటు చేశారు. తెలంగాణను సుస్థిర, సజీవ, ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పాల్గొన్న ప్రతినిధులు సంకల్పం వ్యక్తం చేశారు.

– డా॥ నీరజ్ గోహిల్, m : 96660 65623
Dean(T) I / V, NITHM, Gachibowli

# దర్శనీయ స్థలాలు – దాగిన సత్యాలు

# గజేంద్రమోక్ష శిల్పం పామిడి గ్రామం

బమ్మెర పోతన రచించిన మహాభారతంలోని ఎనిమిదవ అధ్యాయం గజేంద్రమోక్షమునకు సంబంధించిన కథ. కృతయుగం నందలి చాక్షుష మన్వంతరమునకు సంబంధించినదిగా ఈ కథను చెబుతారు. కథా విషయానికొస్తే ఇంద్ర ద్రుమ్యుడు అనే గజరాజు తన పరివారంతో త్రికూట సరస్సు నందు దిగి స్నానం చేస్తుంటాడు. ఆ సరస్సు అడుగు భాగంలో నివాసముంటున్న హు హు అనే గంధర్వుడు శాపవశాన మొసలిగా ఉంటాడు. ఆ మొసలి సరస్సులో దిగిన గజరాజు కాలును పట్టుకొని నీటిలోనికి లాగింది. ఎంతో శక్తిమంతుడైన గజరాజు శాయశక్తులా పోరాడి చేతగాక చివరకు భగవంతుని రక్షణ కోరడం జరిగింది. గజరాజు మొరను అలకించి, గరుడ వాహనుడైన శ్రీమన్నారాయణుడు సుదర్శన చక్రంతో మొసలిని (గ్రాహాన్ని) సంహరించి గజేంద్రుని విముక్తుని చేస్తాడు. నిజమైన భక్తితో భగవంతుని ఆశ్రయించిన వారిని తప్పక రక్షిస్తాడు అని ఈ కథ తెలుపుతుంది.


గోడల మీద గజేంద్ర మోక్షము – డెమోగడ్

ఈ గజేంద్రమోక్షం కథను ఎక్కువ భాగము దేవాలయ ప్రాంగణంలోని గోడల మీద, శిఖరల మీద, మరియు స్తంభముల మీదను మరికొన్ని చోట్ల చిత్ర రూపముల నందు గమనించవచ్చును. ఉత్తరప్రదేశ్ నందలి డెమోగడ్ దశావతార దేవాలయము నందు గోడల మీద గజేంద్రమోక్షము శిల్పమును చూడగలం.

108 దివ్య స్థలములలో ఒకటైన కపిస్థలము (తమిళనాడు) లేదా కపి స్థలము దేవాలయము గర్భగుడి నందు సైతం గజేంద్రమోక్షము శిల్పమును గమనించవచ్చు. అయితే ఈ దేవాలయమునందలి గర్భగుడిలో గరుడుని మీద శ్రీమన్నారాయణ విగ్రహం ఉండగా సమీపంలో మొసలి ఏనుగు కాలును పట్టుకొని మరొక విగ్రహము ఉండడం విశేషం. చోళ రాజుల కాలంలో నిర్మించబడ్డ ఈ దేవాలయమును పాండ్యులు నాయక రాజులు అభివృద్ధికి దోహద కారకులయ్యారు.

కేరళ రాష్ట్రం నందలి కృష్ణాపురం కోటలో (ప్రస్తుతం మ్యూజియం) 154 చదరపు అంచుల (14×11) గజేంద్ర మోక్షము చిత్రపటము గోడలపై చేయబడిన ప్రాముఖ్యమైన మురల్ కళాకృతులలో ఒకటిగా చెబుతారు.

ఈ చిత్రాన్ని శ్రీ నారాయణ పట్టా వారు (1761–1784 చిత్రించారు.

భారతదేశంలో ఏ దేవాలయం గర్భగుడిలో కనపడని సంపూర్ణ గజేంద్రమోక్ష శిల్పాన్ని ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లా పామిడి గ్రామంలో శ్రీ అనంత గజ గరుడ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం నందు తొమ్మిది అడుగుల విగ్రహమును గమనించగలము. ఈ దేవాలయమును విజయనగర రాజుల కాలంలో నిర్మించబడినది అని తెలుస్తుంది. గర్భగుడిలోని ఈ రాతి విగ్రహాన్ని గమనిస్తే, మకర తోరణ ప్రభావళి శైలి లక్ష్మీనారాయణ విగ్రహం వరకు మాత్రమే కనబడుతుంది. రక్షణ, కరుణ మరియు తక్షణ అవతరణగా ఈ ప్రభావళికి అర్థము అని శిల్పాచార్యులు చెబుతారు. ఈ ప్రభావళి లక్ష్మీనారాయణుల కింద ఉన్న గరుడునికి ఉండదు. ప్రభావళి తరువాత ఏడు పడగలతో విచ్చుకొని ఉన్న అనంతుడనే సర్పమును గమనించ వచ్చు. ఒక విధంగా చెప్పాలంటే తోక మీద నిలబడిన ఏడు పడగల సర్పమును గమనించగలము, పడగ అనేది ఆకాశ తత్వాన్ని, తోక భూమి తత్వాన్ని చూపే ఈ అనంతుని భంగిమను సప్తఫణ నాగచత్ర భంగి లేదా అనంత ఆదిశేష చత్ర భంగి అని పిలుస్తారు. లక్ష్మీనారాయణులను అనంత ఆదిశేష చత్ర భంగి కింద గమనించగలము.

ఆపదలో విష్ణువు వస్తాడని ఆపద తీరిన తర్వాత లక్ష్మీనారాయణులు శాంతి, స్థిరత్వం మరియు ఐశ్వర్యం కల్పిస్తారనేది భక్తుల భావనకు చిహ్నంగా యిక్కడ దర్శనమిస్తాడు. నారాయణుడు నాలుగు చేతులు కలిగి ఉండి, వెనుక కుడి చేతినందు సుదర్శన చక్రమును ఎడుమ చేతి నందు శంఖువును గమనించగలం. అలాగే ముందు చేతులను గమనిస్తే, అభయ హస్తముగల కుడి చేతిని మరియు లక్ష్మీదేవి నడుము చుట్టూ వేసిన ఎడమ చేతిని గమనించవచ్చు. (ఈ భంగిమను కటి బంధ హస్తం అని పిలుస్తారు).



కపిస్థలము దేవాలయము నందలి గజేంద్ర మోక్షము



18వ శతాబ్దపు గజేంద్ర మోక్షము పెయింటింగ్

లక్ష్మీతో కూడిన ఈ భంగిమ భార్యాభర్తల ఐక్యత మరియు శాశ్వత క్షేమమును తెలుపుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఏనుగును రక్షించిన తర్వాత జీవన స్థిరత్వానికి ఆశీర్వాదము ఇచ్చే శిల్పంగా చెప్పవచ్చు.

రాజాధిరాజ భావాన్ని సూచించే కిరీట మకుటమును నారాయణుని తలమీద మరియు సౌమ్య రూపము కలిగిన కిరీటమకుటం (కరకండ) లక్ష్మీదేవి తల మీద గమనించగలం. లక్ష్మీనారాయణల చెవుల యందు మకర కుండలాలను గమనించవచ్చు. (మకరాకారపు చెవి ఆభరణాలు) ఇవి లేకపోతే లక్ష్మీనారాయణుల స్వరూపము సంపూర్ణము కాదని చెబుతారు.

సమదృష్టితో, నిశ్చయమైన కరుణ కలిగిన కళ్ళను ఇక్కడ గమనించవచ్చు. లక్ష్మీదేవి తన కుడి చేతిని శ్రీవారి నడుము చుట్టూ వేసి ఎడమ చేతి నందు కమలాన్ని కలిగి ఉండి, విష్ణువు తొడ మీద నిటారుగా కూర్చున్న ఈ విధానాన్ని ఉత్సంగస్థితి లేదా ఆలింగన భంగి అంటారు.



గర్భగుడిలో పూజలు అందుకుంటున్న గజేంద్రమోక్షం శిల్పం – సామిడి

గజేంద్రుని రక్షించిన తర్వాత లక్ష్మీ సమేతుడైన నారాయణుడు సుఖాశీనుడై, సమభంగ స్థితిలో రెండు కాళ్లు మడిచి స్థిరంగా గరుడుని మీద కూర్చుని ఉండడం గమనించగలం. ఈ భంగిమను ఉద్ధరణ భంగిమ అని పిలుస్తారు.

మోకాళ్లపై కూర్చుని రెక్కలు మడిచి త్రినాగులను ఆభరణాలుగా ధరించి రెండు హస్తముల మీద శ్రీ విష్ణువు ఆసీనుడుకాగా, విష్ణువు ఆజ్ఞకు బద్ధుడిగా ఉండే నిత్య సేవకుడు అయిన గరుడుడు ఉపవిష్ట సేవా భంగిమలో కూర్చొని ఉన్న విధానాన్ని ఈ శిల్పం నందు గమనించవచ్చు. బలమైన దేహముగల ఏనుగు నడుము కృంగి మొసలి నోటిలో ఒక కాలు చిక్కుకొని నిలబడలేక, పడిపోయినట్టుగాక ఇబ్బందికర స్థితిలో ఉండి దీనాలాపన చేస్తూ తొండమును పైకెత్తి శరణాగతి కొరకు విష్ణువును ప్రార్థిస్తున్నట్టుగా కనబడుతుంది. ఈ భంగిమను శరణాగతి భంగిమ అని అంటారు. అలాగే మొసలి గజేంద్రుని కాలును గట్టిగా పట్టు పట్టి నీటిలోనికి లాగుతున్నట్టుగా ఉంటుంది. దీనిని పీడన భంగిమ అని అంటారు. రమారమి ఏడు ముద్రలు కలిగిన ఇంత గొప్ప తొమ్మిది అడుగుల శిల్పం ఈ దేవాలయ గర్భగుడిలో ఉండడం విశేషంగా భావిస్తారు.

భారతదేశంలో ఎక్కడా లేని గజేంద్ర మోక్ష శిల్పం పామిడి మండలంలో ఉండడం ఇక్కడి ప్రజలు అదృష్టంగా భావిస్తారు. అయితే విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ఈ దేవాలయ అభివృద్ధికి (పామిడి దేవాలయం) ఆర్కియలాజికల్ డిపార్ట్‌మెంట్ వారు మరియు దేవాదాయ శాఖ వారు శ్రద్ధ వహించాలని, అలాగే పర్యాటక శాఖ వారు సైతం అందరి దృష్టికి తీసుకురావాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

– డా॥ జి.యస్.రామయ్య
INTACH సభ్యులు –
కర్నూలు జిల్లా చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

## పోరాటపటిమకు, త్యాగమయమైన జీవితానికి నిలువెత్తు నిదర్శనం

# శ్రీనివాస రామానుజన్ సతీమణి జానకి అమ్మాళ్

ఇది 1914 మార్చి రెండు వారంలో జరిగిన సంఘటన. అపర గణిత శాస్త్రపు అద్భుతం శ్రీనివాస రామానుజన్ లండనుకి నౌకలో వెళ్లడానికి ఒక వారం ముందు తన భార్య జానకి అమ్మాళ్‌ను తను ప్రయాణం చేసే ఓడ ఐ.ఎన్.ఎస్. నెవద వద్దకు తీసుకువెళ్లి, తను పడుకునే పరుపు, ఇతర సదుపాయాలను చూపించారు. మూడు రోజుల తర్వాత, "నేను నిన్ను ఒకటి అడగనా?" అన్నారు. "నేను వెళ్ళిపోక మునుపే నువ్వు ఇంటికి (కుంభకోణానికి) వెళ్ళిపోతే బాగుంటుందనుకుంటున్నాను'' అన్నారు. "ఎందుకు అలా? నేను మీకు వీడ్కోలు చెప్పి వెళ్తాను" అన్నారు జానకి. "అలా కాదు నువ్వు నా కళ్ళ ఎదుట ఉంటే నిన్ను విడిచి పోలేను" అన్నారు భర్త. దానికి ఆమె ఏం మారు పలకగలరు? ఆమె మౌనమే అంగీకారంగా భావించారు భర్త. అలా సర్దిన వస్తువులతో రామానుజన్ ఎగ్మోర్ స్టేషన్లో భార్య జానకికి వీడ్కోలు చెప్పారు. కమనీయమైన కావ్యం ఈ జానకి రామానుజన్ జీవిత కథ.



1887 డిసెంబర్ 22న ఈరోడ్డు పట్టణంలో అమ్మమ్మ ఇంట శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జన్మించారు. తండ్రి శ్రీనివాస అయ్యంగార్ కుంభకోణంలో ఒక బట్టల అంగట్లో గుమాస్తాగా పనిచేసేవాడు. తల్లి కోమలత్తమ్మాళ్ పట్టుదల గలమనిషి. రామానుజన్ భార్య జానకీ అమ్మాళ్ 1899 మార్చి 21న తిరుచిరాపల్లి దగ్గర ఉండే గ్రామంలో రంగస్వామి అయ్యంగార్, రంగనాయకి అమ్మాళ్ దంపతులకు జన్మించారు. కోమలత్తమ్మాళ్, రంగనాయకి అమ్మాళ్ ఇరువురు మంచి మిత్రులు కనుక, జానకి పదేళ్ల వయసులో వివాహం కుదిరింది. శ్రీనివాస రామానుజన్, జానకి పెళ్లి 1909 జూలై 14 ఐదు రోజుల వేడుక. అదే సమయంలో ఆమె చెల్లెలి వివాహం కూడా జరిగింది. వరుడు రామానుజన్ బృందం ప్రయాణం చేస్తున్న రైలు పట్టాలు తప్పడంతో బాగా ఆలస్యమైంది. మరో వరుడితో పెళ్లి చేసేయ్యాలనే దాకా చర్చలు కూడా జరిగాయట. జానకి పెళ్లి అయ్యింది గానీ, ఆమె పుట్టింటిలోనే ఉండిపోయింది. రామానుజన్ కు 1912 లో మద్రాసు పోర్టు ట్రస్టులో క్లర్క్ ఉద్యోగం రావడంతో జార్జ్ టౌన్‌లో తన తల్లి, భార్యతో పాటు తాము ఉండసాగారు. మదరాసు విశ్వవిద్యాలయంలో తొలి పరిశోధకుడుగా 1913లో చేరడంతో, ఆ కుటుంబం ట్రిప్లికేన్ ప్రాంతానికి వచ్చేసింది. మద్రాసు యూనివర్సిటీ పరిశోధకుడిగా రామానుజన్ బ్రిటిష్ గణిత శాస్త్రవేత్త జి. హెచ్. హార్డీ మహాశయుడిని ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సంప్రదించినప్పుడు ఆయనకు రామానుజన్ గణితప్రతిభ తెలిసి క్రేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. 1914 మార్చి 17న శ్రీనివాస రామానుజన్ లండన్ వెళ్లిన నేపథ్యం ఇది.



రామానుజన్ కేంబ్రిడ్జిలో అపరిమితమైన కృషి చేసిన ఫలితంగా పరిశోధన పత్రాలను అన్ని రీసెర్చ్ జర్నల్స్ ప్రచురించాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అతనికి బి.ఏ. పట్టాను ప్రధానం చేసింది. తర్వాత రాయల్ సొసైటీ అతనిని సభ్యునిగా ఎన్నుకుంది. ఇది చాలా అరుదైన గౌరవం. రామానుజన్‌కు ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు లభ్యమయ్యాయి. మరీ ముఖ్యంగా శతాబ్దిలోనే ఘనతకెక్కిన గొప్ప భారతీయ గణిత శాస్త్రవేత్తగా ఎనలేని గౌరవం పొందాడు. అతనికి లభించిన ఈ గౌరవాలకు సంబంధించిన సమాచారాన్ని భార్య జానకి పుట్టింటి నుంచి పత్రికల ద్వారా తెలుసుకుంటూనే ఉంది. శక్తికి మించి కృషి చేసే లక్షణమున్న రామానుజన్ అవసరమైన ఆహారాన్ని పొందలేకపోయాడు. అంతకుమించి అక్కడున్న శీతల వాతావరణం అతని ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీసింది. ఒంటరితనం కృంగదీస్తే, క్షయ మింగడానికి సిద్ధమైంది. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసుకున్నారని అంటారు. పూర్తిగా ఆరోగ్యం దెబ్బతిన్న రామానుజన్ చివరకు 1999 ఏప్రిల్ 2న మద్రాసు తిరిగివచ్చాడు. ఇంటికి రాగానే తల్లిని మాత్రమే చూడగానే, "ఆమె ఎక్కడ అని అడిగాడు." రామానుజన్ రాని సమాధానంతో, "నేను వస్తున్న సంగతి నువ్వు ఆమెకు తెలియజేయలేదన్నమాట", అని క్రోధంగా అన్నాడు. వార్తాపత్రికల్లో రామానుజన్ భారతదేశం వచ్చిన సమాచారం చదివిన జానకి అమ్మాళ్ బయలుదేరి ఏప్రిల్ 5కి మద్రాసు చేరుకుంది. తల్లిని ఘర్షించి రామానుజన్ మరుక్షణం నుంచే భార్య ద్వారా ఐదేళ్లుగా తను కోల్పోయిన అనురాగాన్ని, ఆప్యాయతని, ఇష్టమైన భోజనాన్ని పొందగలిగారు. జానకి సైతం భార్యగా, తల్లిగా, పరిచారికగా, స్నేహితురాలిగా, మార్గదర్శకరాలిగా సర్వం తానై వ్యవహరించింది. ఈ సమయంలోనే రామానుజన్, " కేంబ్రిడ్జికి నిన్ను తీసుకొని పోయి ఉంటే నేను జబ్బు పడేవాడిని కాను", అని

పదేపదే అనేవాడు. కానీ ఏమి ప్రయోజనం? 1920 ఏప్రిల్ 26న శ్రీనివాస రామానుజన్ 32 సం. వయసులో అమరుడయ్యాడు.

1962లో శ్రీనివాస రామానుజన్ 75వ జన్మదినోత్సవం పెద్ద ఎత్తున జరిగింది. కేవలం అప్పటి నుంచే శ్రీనివాస రామానుజన్ భార్యగా జానకీ అమ్మాళ్‌కు గుర్తింపు, సహాయం లభించడం మొదలైంది. మరి 1920 నుంచి 1962 దాకా జానకి అమ్మాళ్ పరిస్థితి ఏమిటి? సుమారు నాలుగు దశాబ్దాల వ్యవధిగా సాగిన ఈ గాథ ఒక కరుణార్ద్ర కావ్యం, మరో వ్యక్తిత్వ నిర్మాణ ప్రణాళిక. నిజానికి రామానుజన్ కనుమూయగానే జానకికి శాపనార్థాలు పెద్ద స్థాయిలో మొదలయ్యాయి, అదంతా ఆమె జాతక ప్రభావమేనని బంధువులు నిందించారు. అప్పటికి ఆమె వయసు 22 సంవత్సరాలు, చేసిన కాపురం కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే. అది కూడా అత్త గయ్యాళితనపు గస్తీ క్రిందనే. భర్త పోయిన విషాదంలో మునిగిన జానకి అమ్మాళ్‌ను రెండు రకాలుగా వేధించారు. ఆమె మరో పెళ్లి చేసుకోవాలని, అలాగే శ్రీనివాస రామానుజన్ రచనలకు సంబంధించిన కాగితాలను, పుస్తకాలను తమకు అప్పజెప్పాలని. పెళ్లి ఒకసారే జరుగుతుందని తనకు 1909లోనే పెళ్లి అయిపోయిందని మరోసారి సిద్ధమయ్యే అవకాశం లేదని జానకి తేల్చి చెప్పారు. అంతేకాకుండా తన భర్త అమోఘమైన ప్రతిభాశాలి కనుక ఆ కాగితాలను భవిష్యత్తు శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఉపయోగించుకుంటారు. కనుక ఇచ్చే ప్రసక్తే లేదని జానకీ అమ్మాళ్ మొండిగా, ధైర్యంగా చెప్పారు. అత్త బెదిరింపులకు ఏమాత్రం లొంగలేదు. మొక్కవోని జానకి అక్కడి నుంచి, అసిస్టెంట్ ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్‌గా పనిచేసే తన తమ్ముడు ఆర్. ఎస్. అయ్యంగార్ ఇంటికి బొంబాయి తరలి వెళ్లారు. అక్కడ ఉన్న ఎనిమిదేళ్లు ఆమెకు పునర్జన్మను ప్రసాదించాయి. పట్టుదలగా ఇంగ్లీష్ నేర్చుకున్నారు, అలాగే ఇంట్లోనే టైలరింగ్‌లో కూడా నైపుణ్యం సాధించారు. 1931లో మద్రాసు తిరిగివచ్చిన జానకి కొన్ని రోజులు బంధువుల ఇంట ఉన్నారు. తర్వాత హనుమంతరాయ కోవెల వీధిలో టైలరింగ్ షాపును ప్రారంభించి ఐదు దశాబ్దాల పాటు చీరలు, బ్లౌజులు కుట్టడంతో పాటు చిట్లు కూడా వేసేవారు. అప్పటికి ఆమెకు మద్రాసు యూనివర్సిటీ నుంచి నెలకు రూ.20 మాత్రమే భర్త పింఛన్ లభించేది. సాయం కోరి వచ్చిన వారికి ఎంతో కొంత ఉదారంగా ఇవ్వడమే కాకుండా అనాథ పిల్లలకు ఫీజులు కట్టడం కూడా చేసేవారు.



శ్రీనివాస రామానుజన్ గతించిన 16 ఏళ్లకు జీ.హెచ్. హార్డి 1936లో రామానుజన్ ఫోటో కావాలని ప్రఖ్యాత శాస్త్రవేత్త సుబ్రమణ్య చంద్రశేఖర్‌ను కోరారు. ఫలితంగా చంద్రశేఖర్ మహాశయుడు జానకి అమ్మాళ్‌ను సంప్రదించి ఫోటోను సేకరించి మూడు కాపీలు తయారు చేయించారు. ఒకటి జానకి అమ్మాళ్‌కు ఇచ్చి, మరొకటి హార్డీకి పంపి, మూడవది తన కార్యాలయంలో పెట్టుకున్నారు. అలా శ్రీనివాస్ రామానుజన్ ఫోటో ప్రపంచానికి లభ్యమయింది. 1950లో ఏడేళ్ల బాలుడు తల్లి గతించి అనాథగా జానకి ఇంటిముందు ప్రత్యక్షమైనప్పుడు అతనిని కుమారునిగా స్వీకరించి, పెంచి పెద్ద చేసి, పెళ్లి కూడా చేసింది. ఈ కుమారుడే తర్వాత కాలంలో జానకి అమ్మాళ్‌ను చూసుకున్నారు. 1994 ఏప్రిల్ 13న జానకి అమ్మాళ్ 95 ఏళ్ల వయసులో కనుమూసే దాకా ఆమె ట్రిప్లికేన్ లోని తన ఇంట్లోనే ఉన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం శ్రీనివాస రామానుజన్ గురించిన జీవిత చరిత్రను స్వాతంత్ర్య సమరయోధులు, పరిశోధకులు సురేశ్ రామ్ 1971లో రచించారు. ఈ సమయంలోనే సురేశ్ రామ్ మద్రాసు వెళ్లి జానకి అమ్మాళ్‌ను కలిసి సమాచారాన్ని సేకరించారు. ఆయన ఢిల్లీ తిరిగి వచ్చిన తర్వాత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని కలిసి జానకి అమ్మాళ్ పరిస్థితిని తెలియజేయడంతో, ఆమె వెంటనే 2000 రూపాయల డ్రాఫ్టును జానకికి పంపుతూ, నెల నెలా కొంత మొత్తం చేరేట్టు మంజూరు చేశారు. తర్వాత జానకి అమ్మాళ్ ఆర్థిక ఇబ్బందులు పెద్దగా పడలేదు.

1987 డిసెంబర్ 22న మద్రాస్‌లోని అన్నా యూనివర్సిటీలో శ్రీనివాస రామానుజన్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన జార్జ్ ఈ. ఆండ్రూస్ ఎంతో శ్రమ చేసి 'శ్రీనివాస రామానుజన్ తప్పిపోయిన నోట్‌బుక్‌గా ప్రఖ్యాతమైనదాన్ని సవరించి, సరికొత్త ప్రతిని వెలువరించారు. ఈ సభలో ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ ఆ పుస్తకం మేలు ప్రతిని జానకి అమ్మాళ్‌కు సగౌరవంగా అందించారు. ఆ పరిశోధన చేసిన ఆండ్రూస్, "రామానుజన్ చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో... అతని కాగితాలన్నిటిని ఒక చోటకు చేర్చి, జాగ్రత్తగా దాచి ఉంచడం వల్లనే తన గణిత అధ్యయనానికి పరిశోధనకు ఎంతో తోడ్పడింది"దని ఆండ్రూస్ గొప్పగా ఆసభలోని జానకి అమ్మాళ్‌ను ప్రస్తుతించారు. తర్వాత చాలామంది ఆర్థికసాయం చేస్తామని ముందుకు వచ్చినప్పుడు, "ఈ వయసులో నేనేం చేసుకుంటాను? మీరు గణిత శాస్త్రంలో విశేషంగా కృషి చేసి ప్రకాశించండి. అంతకుమించి నేనేమీ కోరడం లేదు." అని ఆమె వారిని గౌరవ పూర్వకంగా తిరస్కరించారు.

కర్పూర కళికలాగా చివరిదాకా పోరాడి కరుణను పంచిన జానకి అమ్మాళ్ జీవితం తెగువకు, పట్టుదలకు, ఆశావహమైన భవిష్యత్తు ప్రణాళికకు ఒక నిలువెత్తు నిదర్శనం.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com



ఖిల్లా గుట్ట – రాణివాసము

# రాతి కొండలపై రాచనగరం...

నిర్మల్ అనగానే ఒక భౌగోళిక స్థలం కాదు, కాలగర్భంలో చెక్కబడ్డ ఒక జ్ఞాపకగాథ మెలుకువ తీసుకుంటుంది. సాహ్యాద్రి శ్రేణుల నిశ్శబ్ద వీణలో, గోదావరి పరవళ్ల పలుకుల్లో, దక్కను పీఠభూమి రాతిగుట్టల ఎత్తుపల్లాల ఊపిరిలో ఈ నేల శతాబ్దాల సంచారాన్ని మోస్తుంది. ఇక్కడి ప్రతి రాయి కాలానికి కళ్ళు, ప్రతి గుట్ట చరిత్రకు గుండె, ప్రతి దారి పూర్వీకుల అడుగుజాడల ప్రతిధ్వని.

రాతి కోటలు ఇక్కడ కేవలం గోడలు కావు వీరత్వం చెక్కిన శిలా గాథలు. బురుజులు పహారాదారుల్లా నిలిచి యుగాల్ని కాపాడుతున్న నిశ్శబ్ద సాకులు. గుమ్మటాలు గాలిలో తేలే కాలగీతాల మ్రోగింపు. నిర్మల్ కేవలం నిలిచిన పట్టణం కాదు, జీవించిన నాగరికత, పలికిన సంస్కృతి, స్పందించిన చరిత్ర.

ఏ ప్రాంత చరిత్రనా రాళ్లలో మాత్రమే ఉండదు; అది మనుషుల ఊపిరిలో, వారి కలల్లో, వారి పోరాటాల్లో, వారి నిశ్శబ్దాల్లో జీవిస్తుంది. నిర్మల్ చరిత్ర కూడా అలాంటిదే! పూర్వీకులు గానం చేసిన జీవనగీతం, ఒక పులకరింత, ఒక భావావేశం, ఒక తాత్విక గుభాలింపు... పురాముచ్చట్ల పరిమళం ఇప్పటికీ గాలిలో తేలే సజీవ అనుభవం!

**భౌగోళికంగా నిర్మల్:** దక్కన్ పీఠభూమిలో సముద్రమట్టానికి సుమారు 350 మీటర్ల ఎత్తులో ఉండే నిర్మల్ రాతిగుట్టలు, ఎత్తు పల్లాలతో కూడుకుని ఉంటుంది. భూమధ్యరేఖకు ఉత్తరంగా, గ్రీనిచ్ రేఖకు తూర్పున ఉంటుంది. $19^{0}00'$ నుండి $19^{0}30'$ ఉత్తర అక్షాంశాలు, $78^{0}00'$ నుండి $78^{0}40'$ వరకు తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. $19^{0}06$ః అక్షాంశాల కేంద్ర స్థానం అయితే $78^{0}21'$ రేఖాంశాల కేంద్రస్థానంగా ఉంటుంది. నల్లరేగడి, ఎర్రనేలలు మిశ్రమంగా ఉంటాయి.

**ఆదిమానవుల స్థావరాలు:** నిర్మల్ పట్టణకేంద్రానికి గోదావరి నది కేవలం 16కి మీ దూరంలో ఉండటం వల్ల నది ప్రవహించినంత మేర గొప్ప నాగరికత, సంస్కృతి విలసిల్లింది. ఆదిమానవులు నివసించిన గుహలు నిర్మల్ గుట్టలోని గండిరామన్న, గోదావరికి దక్షిణాన బాల్కొండ, ఆర్మూర్ లలో గుహలు వెలుగులోకి వచ్చాయి. గోదావరి ప్రాంతంలో మెగాలిథిక్ కాలం సుమారు 6000 నుండి 8000 సం రాల కాలం నాటి సూక్ష్మ రాతి ఆయుధాలు ఎతీ తుమ్మల దేవరావ్ ఈ మధ్యనే వెలుగులోకి తెచ్చారు. గోదావరి నదిపై శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1967 ముంపుకు గురైన గ్రామాల్లో తవ్వకాలు జరిగినప్పుడు దాల్మిన్ సిస్ట్ సమాధులు వెలుగులోకి వచ్చాయి. క్రీస్తు పూర్వం 1000 నుండి క్రీస్తు శకం 200వరకు బ్రాహత్ శిలాయుగపు గండ శిలలు (గుండు రాళ్లు) అనేక గ్రామాల్లో వెలుగు చూసాయి. ఇనుప ఈటలు, బాణం, మొనలు, కత్తులు, గుఱ్ఱపు కళ్లెం, అస్థిపంజరం వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతంలో ఆదిమానవులు సంచరించడమే గాక ఇనుప యుగపు అవశేషాలు దొరకడంతో వేల సంవత్సరాలనుండి నాగరికత వికాసం చెందినట్లు తెలుస్తుంది.

**రాజవంశాల ఏలుబడిలో:** షోడశ జనపదాల్లో అస్మక జనపదానికి చెందిన నిర్మల్ శతవాహనుల ఏలుబడిలో ఉన్నట్లు లభించిన మట్టిపాత్రలు, కుండపెంకులు, మట్టికోటలు, ఇటుకలు, బౌద్ధ స్థూపాలు మరియు పలురకాల గ్రైండింగ్ స్టోన్స్ వల్ల తెలుస్తుంది. నిర్మల్ జిల్లాలోనే బావరీ నివసించిన బాధన్ కుర్తి గ్రామం ఉంది. బౌద్ధం దక్షణపథాన ఇక్కడినుండే మొదలైంది. మహేషకులు, రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, పద్మనాయక వంశస్థులు, కుతుబ్షాహీలు, నిజాం వంశస్తులు అదేవిధంగా స్థానిక ఖిల్లాదారుల ఏలుబడిలో నిర్మల్ వైభవంగా వెలిగింది.

**ప్రాచీన మతాలకు నెలవు:** నిర్మల్ పట్టణ కేంద్రంలో అనేక మతాలకు చెందిన విగ్రహాలు చిహ్నాలు సాక్షంగా నేటికీ లభిస్తాయి. బౌద్ధ జైన మతాలకు సంబంధించిన విగ్రహాలు, ఇటుకలు నిర్మల్ పట్టణంలోనే గాక పరిసర అనేక గ్రామాల్లో ఇప్పటికి వెలుగు


వెంకటేశ్వర ఘడ్


శ్యామ్ ఘడ్

చూస్తున్నాయి. కళ్యాణి చాళుక్యుల కాలంలో నకరములు అనే వాణిజ్య కేంద్రాలు ఇక్కడ ఉండేది దానికి సాక్ష్యంగా నకరేశ్వర వాడ కాలక్రమంలో నగరేశ్వర వాడగా మారింది. కళ్యాణి చాళుక్యుల కాలంలో నిర్మించిన శివాలయం ఇప్పటికీ ఈ వాడలో ఉంది. అంతేకాక కళ్యాణి చాళుక్యుల కాలంలోనే విద్యా కేంద్రాన్ని "బ్రహ్మపురి" అని పేర్కొనేవారు. ఇప్పటికీ ప్రముఖ విద్యా కేంద్రంగా బ్రహ్మపురి వెలుగొందడం విశేషం. కాకతీయుల కాలంలో నిర్మించిన ఓంకారేశ్వరాలయం ఖజానా చెరువు వద్ద ఉంది. పద్మనాయక వంశానికి చెందిన శ్రీనివాసరావు నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం, పద్మాక్షి ఆలయం దేవరకోట ప్రాంతంలో ఉన్నాయి. అదేవిధంగా నిర్మల్ గుట్టల పైన అనేకచోట్ల ఉమామహేశ్వర విగ్రహాలు, వీరగల్లుల విగ్రహాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. అనేక హనుమాన్ విగ్రహాలు స్థానికంగా ఉన్నాయి. గోదావరి పరిక్రమణలో భాగంగా రాముడు గండి రామన్న క్షేత్రంలో కొంతకాలం నివసించినట్లు పురాణ కథనం. రామునికి ఇక్కడి సహ్యాద్రి పర్వతాలే ఆశ్రయమిచ్చాయని స్థానికుల కథనం. నిర్మల్ పట్టణ మధ్యలో రామాలయంతో పాటు వైష్ణవ సాంప్రదాయాన్ని తెలిపే అనేక విగ్రహాలు ఉన్నాయి. అంతేకాక కుతుబ్షాహీల కాలంలో నిర్మించిన మసీదులు, దర్గాలు.. సూఫీ సాంప్రదాయానికి చెందిన పీర్లు నిలబెట్టి పంజేషాలు అనేకం ఉన్నాయి.

**బలిష్టమైన కోటలు:** నిర్మల్ అనేక రాతిగుట్టలతో కూడుకున్న నగరం. ఆయా రాజ వంశాలకు చెందిన రాజులు గుట్టలనే తమ పరిపాలన కేంద్రాలుగా నివాసాలుగా మలుచుకున్నారు. పట్టణంలోకి ఇతర గ్రామాలనుంచి రావటానికి ఏడు ప్రధానమైనటువంటి ద్వారాలను అన్ని దిక్కుల్లో బలమైనటువంటి రాళ్లతో నిర్మించారు. రాత్రివేళలో పెద్ద తలుపులతో ఇనుప గొలుసులతో వాటిని మూసేవారు, ఉదయాన్నే తెరిచేవారు. ఉత్తరం- దక్షిణ వైపుకు వెళ్ళడానికి గొలుసుల ధర్వాజా అతి పెద్దది. పట్టణం మధ్యలో పాలపిట్ట ధర్వాజా అంతర్గతంగా రాకపోకలు చేయడానికి వాడేవారు. సుమారు పది కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ రాచనగరాన్ని అద్భుతమైన నిర్మాణ కౌశలంతో నిర్మించారు. పట్టణ నడిబొడ్డున ఖిల్లా గుట్ట ఉంటుంది. ఇకనుండి పరిపాలన వ్యవహారాలు నిర్వహించేవారు. ఈ ఖిల్లాగుట్ట సుమారుగా 20 ఎకరాల వైశాల్యంలో విస్తరించి ఉంది. సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఖిల్లాగుట్ట పైన రాణివాసం ఉండే గదులు, రాజు పరిపాలననిర్వహించే సభా మంటపము, లలిత కళలు ప్రదర్శించే నాట్య మందిరము, అక్కాచెల్లెళ్ల బావులు, ఒక ఆలయము అదేవిధంగా ఆయుధాలు దాచుకునే గదులు, రాజు రాణి సాయంత్రం వేళ కూర్చునే సింహాసనాలు, సైనికుల కోసం అతిపెద్ద రాతి నీటి తొట్టి, రహస్య భూగర్భగదులు, కిల్లా గుట్ట చుట్టూరుగా బలమైన రాతితో నిర్మించిన గోడలు, కోటలోపల రహస్య మార్గాలు. ఫిరంగులను పేర్చి శత్రువులను ఎదుర్కోవడానికి నిర్మించిన ప్రత్యేకంగా గోడలకు రంధ్రాలు, నీటితొట్టిలు కన్పిస్తాయి.

నిర్మల్ నగరానికి దక్షిణాన ఉన్న శ్యామ్ ఘడ్ ఇది అత్యంత బలిష్టమైన రాతితో నిర్మించిన కోట. ఇందులో పశ్చిమానికి పెద్ద ద్వారం ఉంటుంది అదేవిధంగా ఉత్తరాన ఒక రహస్య ద్వారం ఉంటుంది. దక్షిణం వైపు నుంచి శత్రువులు నగరంపై దండయాత్రకు వచ్చినప్పుడు ముందుగా సోన్ ఘడ్ మీద ఉన్నటువంటి సైనికులకు సమాచారం అందుతుంది. తర్వాత శ్యాంఘడ్‌లో ఉన్నటువంటి సైనికులకు చేరుతుంది. ఇప్పటికీ కోట లోపల పిరంగులు ఉన్నాయి.

బత్తీస్ ఘడ్ నిర్మల్ పట్టణానికి తూర్పు వైపున ఉన్న అత్యంత బలమైనటువంటి కోట. సుమారు సముద్రమట్టానికి 700 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఈ కోటలో 32 గదులు ఉండటంవల్ల దీనిని బత్తిస్ ఘడ్‌గా పేర్కొంటారు. ఇది కూడా పూర్తిగా సైనిక స్థావరము. సుమారు రెండువేల మంది సైనికులు ఈ ఘడ్‌లో ఉండేవారని అంటారు. పిరంగులను అమరచడానికి ప్రత్యేకమైనటువంటి నిర్మాణాలు చేసి ఉన్నారు. ఈ కోటలో ఒక రహస్య బావిని తప్పించారు. ఈ మెట్ల బావిని చేరుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. మెట్లబావి లోపలికి సుమారు 200 మెట్లతో అడుగుభాగం చేరుకుంటారు. అడుగు భాగంలో ఒక రహస్య ద్వారం ఉంటుంది అక్కడి నుంచి మిగతా కోటలకు చేరవచ్చునని అంటారు. బత్తిస్ ఘడ్ కోట పక్కనే వెంకటేశ్వర ఘడ్ అనే మరొక కోట ఉంటుంది. ప్రముఖ రాజోద్యోగులు ఇక్కడ ఉండేవారని అంటారు. డంగు సున్నంతో అందమైన ఆర్చిలతో నిర్మాణం చేసినటువంటి గదులు ఈ కోటలో ఉన్నాయి. ఈ బత్తీస్ ఘడ్ సమీపం లోనే మూడవ ఆంగ్లో మరాఠా యుద్ధం నాగపూర్‌ను పరిపాలిస్తున్న బోన్స రాజులకు అదేవిధంగా నిజాం- బ్రిటిష్ సైన్యానికి మధ్య యుద్ధం జరిగింది. చుట్టుపక్కల అనేక గ్రామాలలో ఈ తరహాలో కోటలను నిర్మాణం చేశారు. నిర్మల్ చుట్టూరా 80 పీట్ల విస్తీర్ణంతో కందకాలు తవ్వించారు. అందులో మొసళ్ళు వదిలేవారని, కోటలోకి సైనికులు రాకుండా ఇదొక రక్షణ నీటి దుర్గం వంటిది. కోటలను డంగు సున్నంతో ఆధునీకీకరణ చేయడంలో ఫ్రెంచి ఇంజనీర్లు సహకరించారు.

**గొలుసుకట్టు చెరువులు:** నిర్మల్ నగరానికి చుట్టూరా గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. కాకతీయుల కాలంలో ప్రజల సహకారంతో దశబంధ విధానంలో నిర్మాణం చేసిన ఈ చెరువులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా పట్టణ ప్రజలకు నీటి సమస్య రాకుండా ఉన్నాయి. కొండలను కలుపుతూ చెరువులను నిర్మించారు. శ్రీనివాసరావు కాలంలో,

కుంటి వెంకట్రాయుడు కాలంలో, అదేవిధంగా ధంస ఏలుబడిలో ఉన్నప్పుడు ఈ చెరువులను పునరుద్ధరించారు. పట్టణంలో ఎప్పటికీ ఎండని ఒక చెరువు ఉంది. దానిని ఖజానా చెరువు అంటారు. చెరువులో అపారమైనటువంటి ధనరాశులు ఉన్నాయని ప్రజల కథనం. కానీ ఎంతటి కరువు వచ్చినా చెరువు ఎండిపోదు. కాబట్టి నీటిని మించిన ఖజానా ఉండదని ఖజానా చెరువుగా పేర్కొని ఉంటారు. చెరువులన్నిటికి నిజాంల కాలంలో తూములు నిర్మించి ఆధునికరించారు.

**సరదీ మహాల్:** ఇది ఒక అందమైన ఉద్యానవనం. ఇప్పటికీ ఇక్కడ నిర్మాణాలు చెక్కుచెదరలేదు. అందమైన గదులు నీరు అన్ని వైపులా వెళ్లడానికి కాలువలు. సహజసిద్ధంగా నిర్మించిన ఫౌంటెన్లు, జలకాలాడటానికి స్విమ్మింగ్ పూల్, ఉద్యానవనానికి నీరును మళ్ళించడానికి ఏనుగులతో నడిపే మోట బావి. ఆ బావిలో రహస్య గదులు... నీరు తగ్గిపోయినప్పుడు కృత్రిమంగా నిర్మించిన ఒక పెద్ద జలాశయం పాతిమా హౌస్ నుంచి ఈ బావిలోకి నీరు వచ్చేట్లు భూగర్భ కాల్వలు ఏర్పాటు చేశారు. అన్ని కాలాల్లో చల్లగా ఉండటమే గాక రాచకుటుంబీకులకు వేసవి విడిది కేంద్రంగా, సాయంకాలపు ఉద్యాన వనంగా దీన్ని తీర్చిదిద్దారు. నిర్మల్ ఆఖరి పాలకుడు ఇబ్రహీం బేగ్ ధంస కు చెందిన సమాధి, మరణశాసనం పాలరాతిపై ఇక్కడే చెక్కబడింది. ఇప్పటికీ అలనాటి వైభవానికి చిహ్నాలుగా ఇక్కడ నిర్మాణాలు సజీవంగా ఉన్నాయి.

**పిరంగి తయారీ కేంద్రాలు:** నిర్మల్ రాజులు ఆయుధాలను ఎవరు నుంచో కొనుగోలు చేయకుండా స్వయంసిద్ధంగా తయారు చేసుకున్నారు. హైదరాబాదులో గన్ ఫౌండ్రిలో ఏ విధంగా అయితే ఆయుధ కర్మాగారం ఉండేదో! నిర్మల్‌లో కూడా ఫిరంగులు తయారు చేసే ఆయుధగారాలు ఉన్నాయి. స్థానికులు వీటిని గుమ్మటాలు అంటారు. భాగ్యనగర్ చౌరస్తా వద్ద, బంగల్పేట్ మహాలక్ష్మి ఆలయానికి 500 మీటర్ల దూరంలో రెండు అతిపెద్ద గుమ్మటాలున్నాయి. అదేవిధంగా వెంకటాద్రి పేటలో ఉన్నటువంటి కొండపైన రెండు చిన్న గుమ్మటాలు ఉన్నాయి. ఇక్కడే ఆయుధాలు తయారు చేసేటప్పుడు విసిరినటువంటి పెద్ద విసుర్రాళ్ళు పడివున్నాయి. క్రీస్తు పూర్వం నుండి నిర్మల్ కత్తులకు, ముడి ఇనుము, ఉక్కుకు ఏ విధంగా ప్రసిద్ధి చెందిందో ఫిరంగులకు కూడా ప్రసిద్ధి చెందింది. ఫిరంగులకు వాడిన రాతి గుండ్లు ఇనుప గుండ్లు వేలాదిగా గతంలో ఇళ్ల నిర్మాణాల సందర్భంగా తవ్వకాల్లో లభించాయి. ఇప్పటికీ చాలామంది ఇళ్లల్లో అలనాటి చరిత్రకు సాక్ష్యంగా కత్తులున్నాయి. దసరా సందర్భంగా వాటికి పూజ చేస్తే కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయి.

**నిర్మల్ కొయ్య బొమ్మలు-చిత్రాలు:** నిర్మల్‌ను పాలించిన పద్మనాయక రాజు నిమ్మనాయుడు మాహారాష్ట్రకు చెందిన జింగారి (నకాశి) కళాకారులను నిర్మల్‌కు రప్పించి కసుట ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసి కళలను పోషించినట్లు తెలుస్తుంది. స్థానిక అడవిలో లభించే పొనికి కర్ర అత్యంత తేలికగా ఉంటుంది. ఈ కర్రతో అనేకమైనటువంటి బొమ్మలు సహజ సిద్ధంగా తయారు చేస్తారు. అజంతా గుహల్లో ఉన్నటువంటి పద్మపాని ఇతర చిత్రాలను మాతృక చేసుకొని నిర్మల్ కళాకారులు సహజ సిద్ధమైన రంగులతో అద్భుతమైన పెయింటింగ్స్ వేసేవారు. ఈ బొమ్మలు ఈ పెయింటింగ్స్ వల్ల నిర్మల్ చిత్రకళకి ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. నిజాం రాజు ఉస్మాన్ అలీఖాన్ స్వయంగా వీరి కళను మెచ్చుకున్నట్లు స్వర్గీయ బ్రహ్మారౌతు నర్సింగు చెప్పేవారు.

**టూరిస్ట్ కేంద్రంగా రూపుదిద్దుకోవాలి:**

ప్రాచీన చరిత్రకు అనేక ఆనవాళ్లు కలిగిన నిర్మల్ సందర్శకులను ఎంతగానో ఆదరిస్తుంది. సహజసిద్ధమైన కొండలు జలపాతాలు, చెరువులు, ప్రాకృతిక సౌందర్యం, సహ్యాద్రి పర్వత శ్రేణులు.. వంపులు తిరిగిన రహదారులు.

ఇవే కాకుండా బలిష్టమైన కోటలు, రాగాలు పలికే రాళ్లు, మెట్ల బావులు, ఏనుగుల మోటలు, గుట్టపు మడుగులు, గ్రామ దేవతలు,


నిర్మల్ తయారీ అయిన ఫిరంగి


రాగాలు పలికే రాయి


బత్తిస్ ఘడ్ కోటలో రహస్య మెట్ల భావి


బత్తిస్ ఘడ్ ప్రధాన ముఖ ద్వారం

ఫిరంగి తయారీ కేంద్రాలు, ఆధ్యాత్మిక శోభను కలిగించే ఆలయాలు. ఎన్నో ఉన్నాయి. కానీ కాలక్రమమైన కోటలన్నీ కూడా అన్యాక్రాంతమయితున్నాయి, కందకాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫిరంగులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. వేల సంవత్సరాల రాజుల చరిత్రకు అసలైన సాక్ష్యంగా నిలిచిన ఈ కొండలు కొండలపై నిర్మాణాలు రక్షించుకోవాలి. టూరిజం శాఖ వారు పురావస్తు శాఖ వారు, రాష్ట్ర ప్రభుత్వం ఈ రాజనగరాన్ని గొప్ప టూరిస్టు కేంద్రంగా తీర్చిదిద్దాలి. అలనాటి ఆనవాళ్లను ఒక్కొక్కటి సేకరించి స్థానికంగా ఒక ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలి. రాతి కొండలపై నిలిచిన రాచనగరం వేల సంవత్సరాల చరిత్రకు సజీవంగా నేటికీ నిలుస్తుంది

డా॥ తుమ్మల దేవరావ్
m : 8985742274
e:thummaladrdevarao@gmail.com

# సంగీతం ఒక మెడిసిన్

సంగీతం వినోద సాధనం మాత్రమే కాదు. సంగీతం చాలా లోతైన సామాజిక ప్రభావాన్ని చూపుతుంది. సంగీతం ప్రజలను ఒకరితో ఒకరిని కనెక్ట్ చేయడానికి పని చేస్తుంది. అదే సమయంలో ఇది వ్యక్తి మనస్సు, మెదడును శాంతపరచడానికి కూడా పనిచేస్తుంది. ఇది ఆలోచనలను వ్యక్తీకరించడంలో కూడా సహాయపడుతుంది. సంగీతం వినడం మానసిక, శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది.

ప్రతి ఒక్కరూ సంగీతాన్ని వినడానికి ఇష్టపడతారు. శాస్త్రీయ, పాప్, రాక్, జానపద సంగీతంతో సహా అనేక రకాలు ఉన్నాయి. ఇవి సొంత ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్నాయి. విభిన్న భావోద్వేగాలను వ్యక్తపరుస్తాయి. శాస్త్రీయ సంగీతంలో గంభీరత, లోతు ఉంటాయి. జానపద సంగీతం సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది. పాప్, రాక్ సంగీతంలో ఉద్విగ్నత, ఉత్తేజం వుంటాయి. అందుకనే వయసుతో సంబంధం లేకుండా రకరకాల సంగీతాలను వినడానికి ఇష్టపడతారు.



సంగీతం వినోద సాధనం మాత్రమే కాదు. సంగీతం చాలా లోతైన సామాజిక ప్రభావాన్ని చూపుతుంది. సంగీతం ప్రజలను ఒకరితో ఒకరిని కనెక్ట్ చేయడానికి పని చేస్తుంది. అదే సమయంలో ఇది వ్యక్తి మనస్సు, మెదడును శాంతపరచడానికి కూడా పనిచేస్తుంది. ఇది ఒకరి ఆలోచనలను వేరే పద్ధతిలో వ్యక్తీకరించడంలో కూడా సహాయపడుతుంది. సంగీతం వినడం మానసిక, శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. అందువల్ల సంగీతాన్ని చికిత్సగా ఉపయోగిస్తారు. ఇది ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, డిప్రెషన్ నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. సంగీతం మెదడుపై చాలా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మనసుకు ఆనందం, శాంతిని ఇస్తుంది.

### ఒత్తిడిని నియంత్రించడం

సంగీతం వినడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ నుంచి ఉపశమనాన్ని అందించడంలో ఇది సహాయకరంగా ఉంటుంది. సానుకూల శక్తిని పొందుతున్న అనుభూతిని యిస్తుంది.

### ధ్యానం కోసం సంగీతం

ఒత్తిడిని తగ్గించడంలో ధ్యానం సహాయపడుతుందని చెబుతారు. అయితే ప్రతి ఒక్కరూ నిశ్శబ్ద ప్రదేశంలో కూర్చుని ధ్యానం చేయలేరు. అటువంటి పరిస్థితిలో తేలికపాటి సంగీతాన్ని వింటారు. మనస్సుకి విశ్రాంతి ఇవ్వడానికి, ధ్యానం చేసే సమయంలో చాలా మంది సంగీతం వినడానికి ఇష్టపడతారు.

### మానసిక స్థితిని మెరుగుపరిచే సంగీతం

బిజీ లైఫ్ స్టైల్, అనేక సమస్యల కారణంగా చాలా సార్లు వ్యక్తి మానసిక స్థితి సరిగా ఉండదు. అప్పుడు చిరాకుగా అనిపిస్తుంది. అటువంటి పరిస్థితిలో సంగీతం వినడం చాలా ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే సంగీతం వినడం వల్ల మనసు రిలాక్స్ అవడంతో పాటు సంతోషానిచ్చే హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇది మన మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంతేకాదు అలసటను తగ్గించడంలో కూడా సంగీతం సహాయపడుతుంది. **జూన్ 21న వరల్డ్ మ్యూజిక్ డే.**

### థీమ్:

జూన్ 21, 2026న జరిగే ప్రపంచ సంగీత దినోత్సవం (ఫెట్ డి లా మ్యూజిక్) తరచుగా **ఐక్యత, సాంస్కృతిక మార్పిడి మరియు సంగీతాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం** వంటి అంశాలపై దృష్టి పెడుతుంది. ప్రపంచవ్యాప్త అంశాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ది హేగ్ వంటి ప్రదేశాలలో జరిగిన వేడుకలు **"సంగీతం సంస్కృతులను కలిసినప్పుడు"** అనే అంశాన్ని ముఖ్యంగా చెబుతుండగా, మరికొన్ని **"సరిహద్దులు లేని సంగీతం"**ను ప్రముఖంగా చూపుతున్నాయి.

– జుగాష్విలి
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com




# కాకతీయులనాటి శివాలయం చరిత్ర తుడిపివేత

ఇటీవల వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్ సమీపంలోని పాతకోట మట్టికోట ఆవరణలో వుండే పాత గుడి నేలమట్టమైంది. ఆ గుడికో చరిత్ర వుంది. దానికి చరిత్రలో స్థానముంది. ఆ గుడిలో దొరికిన రెండుశాసనాలు కాకతీయులనాటి తెలుగులిపిలో, తెలుగుభాషలో రాయబడినవి. చెక్కిన శాసనాలకన్న ముందే నిర్మించబడిన ఈ ఆలయానికి అవి దానశాసనాలు.

ఇటువంటి చారిత్రక దేవాలయం కూల్చివేతకు గురికావడం శోచనీయం. చారిత్రక తప్పిదం. బడి కట్టడం కోసం ఉన్న గుడిని కూల్చడమెందుకో అర్థం కాదు. నిర్ణయం ఎవరిదో, అమలు చేసిందెవరో? కాని, కూలిపోయింది చరిత్ర, ఒక ధార్మిక దేవాలయం..


అశోక్ నగర్ లో పార్శ్వనాథుని ధ్యానాసన శిల్పం

అశోక్ నగర్ పాతకోటలోని గుడి తొలి కాకతీయ (కళ్యాణీచాళుక్య) శైలిలో నిర్మించబడిన ఏకకూట దేవాలయం. గర్భగుడి, అంతరాళం, అర్థమంటపం ప్రణాళికతో నిర్మించబడ్డది. పదహారు స్తంభాల అర్ధమంటపం కక్ష్యాసనాలతో కూడివున్నది. అంతరాళం ద్వారబంధం త్రిశాఖ పద్ధతిన తయారు చేయబడ్డది. ద్వార పతంగం మీద లలాటబింబం లేదు. ద్వారశాఖమీద స్తంభికలున్నాయి. ద్వారశాఖలకు రెండువైపుల ద్వారపాలకులున్నారు. లెంటల్ మీద, కప్పుకింద చతుర్దళ రత్నపుష్పాలతో అలంకరించబడ్డ రాతి దూలాలున్నాయి. గర్భగుడి ద్వారబంధం కూడా అంతరాళ ద్వారం వలెనే నిరాలంకారంగా వున్నది.

గర్భగుడిలో శివలింగం, వెలుపల నంది లేవు. అవి గ్రామంలో కనిపిస్తాయి. బ్రహ్మ, విష్ణు, రుద్రభాగాలతో సమలింగం సమతల శిరోవర్తనంతో, జీర్ణోద్ధారరేఖ (మణిరేఖ)తో ఉన్నది. దానిని అమర్చిన వేదిభద్రపీఠం శిథిలభాగం ఉన్నది. అందమైన నంది ఉన్నది. చాళుక్యశైలి గణపతి అంకుశం, పరశువు, దంతం, కుడుములు ధరించిన హస్తాలతో, పొట్టమీద నాగబంధంతో, లలితాసనంలో కనిపిస్తున్నాడు. అవి ఆ గుడిలోనివే.

ఒక మూల రాతికుడ్యాలు కూలివుండె. స్తంభాలమీద నిలబడిన దేవాలయముండేది. ఆ స్తంభాలలో ఒక స్తంభం మీద చెక్కిన శాసనమున్నది. అది గణపతిదేవుని పాలనాకాలంనాటిది. అది మహారాజాధిరాజులైన కాకతీయ గణపతిదేవుని పేరున అశోక్ నగర్ శివాలయ శాసనం:

వరంగల్ జిల్లా విజ్ఞానసర్వస్వంలోని శాసనాల విభాగంలో పేజి సం.173లో శాసనం సం.116లో అప్పటి నర్సంపేట తాలూకా అశోకనగర్ గ్రామ శివాలయంలో ఒక రాతిస్తంభంమీద కాకతీయ శాసనం వున్నదని రాయబడింది. అదే శాసనం వరంగల్ జిల్లా శాసనసంపుటిలో పేజి.సం.299లో 116వ శాసనంగా ప్రచురించబడ్డది. Annual report on Epigraphy for 1965, APలో అశోకనగర్ మట్టికోటలోని శివాలయంలో ఒక స్తంభంమీద రెండుపంక్తుల శాసనముందని రాయబడివుంది.

రెండే పంక్తుల్లో వున్న ఆ శాసనంలో

"తాటివద్దనువున్న పులు....

*16* మడిన్నర.." అని వుంది.

చరిత్రపరిశోధకుడు అరవింద్ ఆర్య పర్యటనలో భాగంగా అశోకనగర్ శివాలయాన్ని చూసి అక్కడే మరొక స్తంభంమీది శాసనం




# ఎట్ల మట్టిపాలైంది?

ఫోటోలు తీసాడు. ఆ సమయంలోనే గుడితండా శాసనాన్ని కూడా వెలుగులోకి తేవడం జరిగింది. ఈ రెండు శాసనాలకు పోలికలున్నాయి.

**అశోక్ నగర్ శివాలయం శాసనపాఠం:**

"స్వస్తిశ్రీమన్మహారాజాధిరాజులైన గణపతి
దేవ మహారాజులు ప్రిథివిరాజ్యముచే
యుచుండగా వికృతి సంవత్సర
మాఘ శుద్ధ చతుర్ధశినాండు శ్రీ సో
మనాథదేవర దీపానకు పళియంద
యు మైలిసెట్టి కొడుకు అప్పిసెట్టి త
నకాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి
గా రెండు మాడలిచ్చి నా మాడలు
నలుగురు నఖరాలు వడ్డీకిచ్చి దేవ
రదీపము నడపి పుణ్యముపా
ర్జించునది మంగళం మహాశ్రీ"

అశోక్ నగర్ శాసనంలో పేర్కొనబడిన వికృతినామ సంవత్సరం ఆధారంగా గణపతిదేవుని కాలంలో ఆ సంవత్సరాన్ని లెక్కగడితే అది శక సం.1151, క్రీ.శ. 1232సం. ఫిబ్రవరి 7వ తేదీ అవుతుంది. అశోక్ నగర్ శివాలయంలోని దేవుడు సోమనాథుడు. గుడితండా శివాలయంలోని దేవుడు రామనాథదేవుడు. అశోకనగర్ శాసనంలో భక్తుడు మైలిసెట్టి కొడుకు అప్పిసెట్టి తన ఆరోగ్య, ఐశ్వర్యాభివృద్ధులను కోరుతూ సోమనాథ దేవర నిత్యదీపారాధన నిమిత్తం, పళ్ళెము(పళియం) కొరకు 2మాడలు ఇచ్చినాడు. వాటిని 4గురు నకరాలు(వర్తకులు) వడ్డీకి ఇచ్చి, వచ్చిన ఆదాయంతో దేవునికి దీపారాధన నడిపి పుణ్యం సంపాదించుకోవాలని శాసనం.


అశోక్ నగర్ గుడి స్తంభ శాసనం

ఈ శాసనం గణపతిదేవుణ్ణి 'శ్రీమన్మహారాజాధిరాజులైన' అని సంబోధిస్తున్నది. గుడితండా శాసనం 'రాజగజకేసరి' అని ప్రస్తుతించింది. గుడితండా శాసనంలో సంవత్సరం పేర్కొనబడలేదు. ఈ రెండు శాసనాలు గణపతిదేవుని కాలం నాటివి. దాదాపు పొరుగు గ్రామాల శాసనాలు.

కాకతీయ శాసనాలలో వాడపల్లి, సోమవరము, దిచ్చకుంట, గొనసపూడిలకు చెందిన శాసనాలు గణపతిదేవుణ్ణి 'మహారాజు'గానే సంబోధించాయి. దిచ్చకుంట శాసనమైతే అశోకనగర్ శాసనం లెక్కనె 'మహారాజాధిరాజులైన' అని పేర్కొంటున్నది.

గుడితండా శాసనంలో రామనాథదేవర దీపానికి నేయిపోవడానికి ఇద్దరు కావులు కాచబోయండు, మల్లెబోయడు పాలగిన్నెను దానం చేసినట్లు తెలియజేయబడింది. అశోక్ నగర్ శాసనంలో కూడా సోమనాథదేవర దీపానికి భక్తుడు రెండుమాడలివ్వడం సమాన దానమే. కాని, ఈ శాసనంలో ఇచ్చిన డబ్బుని దేవునినిధిగా వడ్డీకిచ్చి, వచ్చిన ఆదాయం దీపారాధనకు వినియోగించే ఏర్పాటు ఈ శాసనం ప్రత్యేకత.

కాకతీయ శాసనాలను పరిశీలించేటపుడు కాకతీయరాజుల బిరుదాలలో కొన్ని 'గజకేసరి'తో ముగిసేవి వున్నాయి. బయ్యారం శాసనం కాకతీయరాజుల్లో కేసరితటాకాన్ని తవ్వించిన మొదటి ప్రోలరాజుకు 'అరిగజకేసరి' బిరుదు వుందని తెలుపుతున్నది. రుద్రదేవుని సామంతుడు మల్లిరెడ్డి వేయించిన బెక్కల్లు శాసనం రుద్రదేవున్ని 'దాయగజకేసరి' అనే బిరుదుతో కీర్తిస్తున్నది. పాకాలశాసనం



గ్రామంలో పెట్టిన కాకతీయశైలి శివలింగం, గణపతి



గణపతిదేవున్ని 'రాజగజకేసరి' బిరుదుతో వర్ణించింది. "ఏ తన్మాద్యన్మహారాజ గజకేసరి విభ్రమమ్ గణపత్యవనీంద్రస్య".. రాజగజకేసరి అన్న బిరుదు గణపతిదేవుని సార్వభౌమత్వాన్ని వ్యక్తం చేస్తుందని పివి పరబ్రహ్మశాస్త్రి 'కాకతీయులు'లో వివరించాడు. రుద్రమదేవి సామంతుడు భైరవుడు వేయించిన బీదరు శాసనంలో 3సార్లు 'రాయగజకేసరి' బిరుదు పేర్కొనబడ్డది. రెండుసార్లు గణపతిదేవునివరంగా, ఒకసారి రుద్రమదేవివరంగా 'రాయగజకేసరి' అని చెప్పబడ్డది. తేరాల సిద్ధేశ్వరాలయ శాసనంలో ప్రతాపరుద్రున్ని కీర్తించే సందర్భంగా 'దాయగజకేసరి' అన్న బిరుదు ప్రత్యేకంగా రాయబడ్డది.

ఈ దేవాలయాన్నితిరిగి కడతారట. నిపుణులు, చరిత్రకారులైన స్థపతులు, ప్రతిమాలక్షణవేత్తలను సంప్రదించి పునరుద్ధరణ చేస్తే బాగుంటుంది. మంచిదే, చరిత్రను మళ్ళీ నిలబెడితే.

**ధన్యవాదాలు:**

ఈ కథనానికి కావాల్సిన ఫోటోలు, క్షేత్రపరిశోదనలతో సహకరించిన అరవింద్ ఆర్య, డి. మల్లునాయక్ గార్లకు, ఈ వ్యాసం రాయించిన మణికొండ వేదకుమార్ గారికి, తెలంగాణ దినపత్రికలకు.

**ఆధారాలు:**

1. Annual report on Epigraphy for 1965, AP
2. వరంగల్ జిల్లా విజ్ఞానసర్వస్వం
3. వరంగల్ జిల్లా శాసనసంపుటి
4. వాడపల్లి శాసనంలో (Inscriptuions of the Kakatiyas of warangal, Ins. no.44, 9&10 lines, pg.109,110) గణపతిదేవుడు మహారాజుగా పేర్కొనబడ్డాడు.
5. సోమవరము శాసనంలో (Inscriptuions of the Kakatiyas of warangal, Ins. no.52, 4&5 lines, pg.136) గణపతిదేవుడు మహారాజుగానే పేర్కొనబడ్డాడు.
6. దిచ్చకుంట శాసనంలో (Inscriptuions of the Kakatiyas of warangal, Ins. no.54, 2,3&4 lines, pg.141) గణపతిదేవుడు 'శ్రీమాన్ మహారాజాధిరాజులైన' అని సంబోధించబడ్డాడు.
7. గొనసపూడి శాసనంలో (Inscriptuions of the Kakatiyas of warangal, Ins. no.55, 10&11 lines, pg.142,143) గణపతిదేవుడు మహారాజుగా పేర్కొనబడ్డాడు.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com



ప్రకృతి గమనం! **8** ప్రకృతి ధర్మం!!

# యుద్ధోన్మాదం! జీవరాశికి ప్రాణసంకటం!!

*ప్రపంచమో పద్మవ్యూహం*
*యుద్ధం ఓ తీరని దాహం!*
*ట్రంప్, పుతిన్, నేతాన్యాహూలైనా*
*వివాదస్పద నాయకులే!!*
*. . . . . . . . . . . . . . .*
*రణరంగం కానిచోటు భూ*
*స్థలమంతా వెదికిన దొరకదు...*

(శ్రీశ్రీకి క్షమాపణలతో)

వైరుధ్యాలు ఘర్షణలే అభివృద్ధికి దారితీస్తాయని, పరిమాణాత్మక మార్పు గుణాత్మకంగా మారుతుందని మార్క్స్ ఉవాచ! రెండు పదార్థాల ఆకర్షణ, వికర్షణలే సృష్టి నిర్మాణమని ఐన్‌స్టీన్ సాపేక్షిక సిద్ధాంతం! ఈ సూత్రీకల్ని ఒంటపట్టించుకున్న ఆధిపత్య వర్గాలు, దేశాలు, నిరంతరం ప్రపంచవ్యాపితంగా, ఏదో ఒకరూపంలో మారణకాండను సాగిస్తునే వున్నాయి. ఈ మారణ కాండకు మతాలు ఓ బూచిగా వారి మరింత ఆజ్యం పోస్తున్నాయి. పక్క దేశాల్ని, స్వేచ్ఛాయుత దేశాల్ని, స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాల్ని దోచుకోవాలని, లేదా తమ ఆయుధ వ్యాపారాల్ని పెంచి పోషించుకోవాలని దురహంకారంతో వివాదస్పద దేశాలుగా, దేశాధినేతలుగా అమెరికా, ఇజ్రాయిల్, రష్యా లాంటి దేశాలు శాసిస్తున్నాయి. యుద్ధనీతిని మరిచి పౌరుల ఆవాసాలపై, పాఠశాలలపైన, ఆసుపత్రులపైన నిసిగ్గుగా దాడి చేస్తున్నాయి. పిల్లల్ని కూడా వదలకుండా మారణకాండను సాగిస్తున్నాయి. ఆయుధ కారాగారాలు ఖాళీకాగానే శాంతి చర్చల నాటకం మొదలైతుంది. నెపోలియన్ రష్యాపై చేసిన దాడి సందర్భంగా, సామ్రాజ్యవాదానికి సైనిక బలగాల్ని ఎలా తయారు చేసుకుంటాయో లియో టాల్‌స్టాయ్ తన యుద్ధం - శాంతి (War and Peace)లో వివరిస్తూ, ప్రతి యుద్ధం చివరికి శాంతి జపం జపిస్తాయని, రాజకీయ స్వార్థంకోసమే ఈ యుద్ధాలు జరుగుతాయని, ముఖ్యంగా అంధ దేశభక్తి (Blind Patriotism) యుద్ధాలకు హేతువని 19వ శతాబ్దంలోనే హెచ్చరించాడు. కాని, నేటికి ఈ వాస్తవం ఏ దేశ నాయకునికి, ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాధినేతలకు తలకెక్కడం లేదు.

అయితే యుద్ధాలకు కొన్ని నియమాలు వుంటాయనేది తెలిసిందే! ధర్మయుద్ధం అని చెప్పే కురుక్షేత్రంలో కూడా యుద్ధనీతి గతితప్పడం చూసాం. ఈ క్షోభతోనే యుధిష్ఠరుడు వైరాగ్యంతో ఓ కుక్కతో కలిసి నేరుగా స్వర్గానికి వెళ్ళాడని కథనం. (హిమాలయాల్లోకి వెళ్ళి బతికాడా, చనిపోయాడా, ఆత్మహత్య చేసుకున్నాడా.. అనేది అప్రస్తుతం.) ఇక ఆధునిక యుద్ధాల్లో, మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలతో సహా, ఏ యుద్ధం ఐక్యరాజ్యసమితి నియమాలకు లొంగి జరగలేదు. ఈ సమితి అన్ని యుద్ధాల సందర్భంగా మూడు కోతుల సిద్ధాంతాన్నే ఆచరించడం జరుగుతున్నది.

పోతే, యుద్ధనష్టాల్ని మానవప్రాణ నష్టాలతో, ఆస్తుల నష్టాలతో మాత్రమే చూడడం జరుగుతున్నది. మానవుడి పుట్టకకు ముందు నుంచే ఈ భూమిపై జీవిస్తున్న కోటానుకోట్ల భూ, జలచరాల, పక్షుల, సూక్ష్మ జీవుల లాంటి జీవరాశిపై జరుగుతున్న మారణ కాండ లెక్కించడం కాదుగదా, అసలు చర్చకు కూడా రావడం లేదు. అలాగే ఆధునిక యుద్ధాలు కలిగిస్తున్న వాయు, జల, వాతావరణ కాలుష్యాలకు లెక్కలు తేలకపోగా, అంతర్జాతీయ ఒప్పందాల్లో వీటికి మినహా యింపులు వుంటున్నాయి. 1997 నాటి క్యోటో నిబంధనలు (Protocal), 2015 నాటి ప్యారిస్ ఒడంబడికలు ఆయా దేశాల మిలటరీ కార్యకలాపాల నుంచి వెలువడే హరితవాయువుల్ని గమనంలోకి తీసుకోకపోవడం గమనార్హం. దీన్ని మిలటరీ ఎమిషన్ గ్యాప్ (Military Emission Gap)గా చెప్పుకుంటారు.



Courtesy : Chappatte - The Boston Globe

నిజానికి ప్రపంచస్థాయిలో విడుదల అవుతున్న హరితవాయువుల్లో మిలటరీ కార్యకలాపాల ద్వారా విడుదల అవుతున్న హరితవాయువులు 5.5 శాతంగా వుంటున్నట్లు అంచనా? ఇలా అన్ని దేశాల మిలటరీ కార్యకలాపాల ద్వారా వెలువడే హరితవాయువుల్ని ఒక్కదగ్గర లెక్కిస్తే ప్రపంచస్థాయిలో నాల్గవ స్థానంలో వుంటాయి.

- మొదటి ప్రపంచ యుద్ధంలో 8 మిలియన్ల గుర్రాలు మరణించాయి.
- ఇంతకు రెట్టింపుగా ఒంటెలు, ఏనుగులు, గాడిదలు, పక్షులు (వార్తలకు వినియోగించినవి) చంపబడ్డాయి.
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దివాలా తీసిన బ్రిటన్ 7,50,000పైగా పెంపుడు కుక్కల్ని, పిల్లుల్ని, ఇతర జంతువుల్ని పోషించలేక ఒకే వారంలో హింసించకుండా (Euthanised) చంపివేయించింది.
- ఏ దేశం యుద్ధంకోసం బడ్జెట్‌ను కేటాయించదు.
- కాని, యుద్ధ రహస్య పద్దు (Hidden Cost of War) పేరున, అభివృద్ధిని, ప్రజల్ని, వాతావరణాన్ని ఫణంగా పెట్టి అగ్రరాజ్యాలు, అగ్రరాజ్యాలకు దాసోహం అనే ఉపరాజ్యాలు విచ్చలవిడిగా కోట్లాదిగా ఖర్చు చేస్తున్నాయి.
- సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, జీవావరణ, పర్యావరణ లాంటి వాడుక పదాలు ఏ యుద్ధానికి పట్టవు.
- అయినా, వీటిని నియంత్రించడానికి చెవిటి, మూగ, గుడ్డి ఐక్యరాజ్యసమితి ఒకటి న్యూయార్క్‌లో గంభీరంగా వుంటుంది. ఇంతవరకు ఈ సమితి ఏ ఒక్క యుద్ధాన్ని ఆపలేదు.
- ప్రపంచ బడుగు, బలహీన, అభివృద్ధి చెందుతున్న (భారత్ 1947 నుంచి అభివృద్ధి చెందుతూనే వుంది. డాలర్ ముందు మోకరిల్లుతూనే వుంది) దేశాలను రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా ఎలా ఆడించాలో, లొంగదీసుకోవాలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (WEF) ప్రతి జనవరిలో స్విజ్జర్లాండ్‌లోని దావోస్‌లో ఓ జాతరను (Mela) నిర్వహిస్తూనే వుంటుంది.

ఇదంతా కేవలం యుద్ధం సందర్భంగానే కాదు, మందుగుండు, ఆయుధాల తయారీ, రవాణా, ప్రయోగాలు మొదలైనవి అన్ని కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా హరితవాయువుల విడుదలకు కారణం అవుతాయి.

**గాజా – ఇజ్రాయిల్ మిలటరీ కాలుష్యం:**

పాలస్తీనా జాతి సమస్యపై అర్థరహిత యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్, 15 మాసాల్లో విడుదల చేసిన కార్బన్ డయాక్సైడ్ 32 టన్నులకు పైగా అని అంచనా. ఇందులో సగం కాలుష్యం కేవలం ట్యాంకుల నుంచి, యుద్ధ విమానాల నుంచి వెలువడిందే! ఇక బాంబుల దాడుల్లో కార్బన్‌డయాక్సైడ్‌తో పాటు, దుమ్ము, దూళి, భయంకరమైన శబ్దాలు రావడం గుర్తించిందే. ఈ దాడుల్లో వందలాది పెంపుడు జంతువులు (కుక్కలు, పిల్లులు, కోళ్లు, బాతులు, పశువులు మొ॥) మరణించడం సహజం. ఇక ఇతర పశుపక్షాదులది ఊహించని మారణకాండనే. మనుషులతోపాటు,



యుద్ధరంగంలో వీర జంతువులు

జంతువులకు దీర్ఘకాలిక అనారోగ్యం, చెవుడు, దృష్టి లోపాలు, బుద్ధిమాంద్యం కలగడం జరుగుతాయి. అంగవైకల్యం సంభవిస్తాయి. సహాయమంతా మానవుల చుట్టే తిరుగుతాయిగాని, జంతువులను, ఇతర జీవరాశిని పట్టించుకునే పరిస్థితి లేదు.

యుద్ధం తర్వాత జరిగే పునఃనిర్మాణ కార్యక్రమాలకు (పౌరుల ఆవాసాలు, రోడ్లు, బ్రిడ్జిలు, కార్యాలయాలు, కర్మాగారాలు మొదలగు వాటి నిర్మాణాలకు) తిరిగి సిమెంటు, స్టీలును అధిక మొత్తంలో ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. ఈ ఉత్పత్తులు తిరిగి పారిశ్రామిక కాలుష్యాల్ని కలిగిస్తాయి. అనగా వీటి విధ్వంసానికి ఎంత మేర హరిత వాయువులు విడుదల అవుతాయో, పునఃనిర్మాణానికి అంతే మేం తిరిగి ఈ వాయువులు వాతావరణంలోకి చేరుతాయి.

ఇక రష్యా, ఉక్రేయిన్ యుద్ధంకాని యుద్ధం ద్వారా (2025 చివరి నాటికి) సుమారు 230 మిలియన్ టన్నుల హరిత వాయువులు వెలువడినాయని అంచనా! ఇది ఒక సంవత్సర కాలంలో యూరప్ దేశాలు వెలువరించే హరిత వాయువులకు సమానమన్నమాట!

అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్, లెబనాన్‌పై చేస్తున్న అర్థరహిత యుద్ధంలో ఎంతగా కాలుష్యం విడుదల అయిందో, అవుతున్నదో ఇంకా లెక్కలు తేలలేదు. అలాగే అమెరికా గత 50 సంవత్సరాలుగా అనేక దేశాలపై చేసిన యుద్ధాలతో మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల సందర్భంగా, పుడమి, సముద్రాలు, ఆకాశం ఎంతగా తల్లడిల్లాయో లెక్కలు లేవు.

అయితే ఇప్పుడిప్పుడే ఈ లెక్కలు తేలుతున్నాయి. ఉదాహరణకి, ఆధునిక F-35 లైటింగ్-II (ఫ్రాన్స్ నిర్మిత) యుద్ధవిమానం గంటకు 5,600 లీటర్ల ఇంధనాన్ని మింగేస్తుంది. ఈ జెట్ ప్రతి లీటరు ఇంధనానికి 2.5 కి.గ్రా. కార్బన్‌డయాక్సైడ్ చొప్పున గంటకు 14 టన్నుల కాలుష్యాన్ని భూ ఉపరితల వాతావరణంలోకి వదులుతుంది. ఇలాంటి వందల యుద్ధ విమానాలు ఒకరోజంతా విడుదల చేసే కాలుష్యం లెక్కించడం కష్టం. ఎందుకంటే, యుద్ధ విమానం శతృదేశంపై ఎన్ని చక్కర్లు కొట్టిందో, ఎన్ని విమానాలు ఉపయోగించబడ్డాయో, సంబంధిత దేశానికి, దాడికి గురైన దేశాలకు తెలుస్తాయి. కాని, ఇవి



యుద్ధరంగం

గణించబడవు. సగటు భారతీయుడు సంవత్సరానికి విడుదల చేసే కార్బన్‌డయాక్సైడ్, విసర్జకావయవాల ద్వారా విడుదలయ్యే కార్బన్ రెండు టన్నులు మాత్రమే! అనగా, ఒక భారతీయుడు ఏడు సంవత్సరాలపాటు విడుదల చేసే కాలుష్యాన్ని ఈ జెట్ విమానం కేవలం ఒక గంటలోనే విడుదల చేస్తుంది.

ఇక మిలటరీ దాడుల్లో ఆవాసాలు బుగ్గిపాలుకాగా విడుదల అయ్యే నల్లని బొగ్గు (black corbon) వాతావరణంలో చేరి, సూర్యకాంతిని ఆకర్షించడంతో వాతావరణం, మొత్తంగా భూగోళం త్వరితగతిన వేడెక్కుతుంది. దీంతో సముద్రాలు, హిమఖండాలు (glaciers) వేడెక్కడం జరుగుతుంది.

**మిలటరీ పారిశ్రామిక కేంద్రాలు**

**(Military Industrial Complexes - MIC):**

శత్రుదేశాల్ని, దాయాది దేశాల్ని, తలవంచని దేశాల్ని యుద్ధం పేరున లొంగదీసుకోవడం అనాది కాలంగా జరుగుతున్నదే! ఇతిహాసాలల్లో, చరిత్ర పూర్వయుగంలో, పారిశ్రామిక విప్లవానికి ముందు, యుద్ధాల ద్వారా వాతావరణ కాలుష్యం వుండేది కాదు. కాని, ఆధునిక యుద్ధతంత్రాలన్నీ మనుషుల్ని చంపడమే కాదు, యావత్ జీవరాశిని కనుమరుగు చేస్తుంది. ఈ మిలటరీ కార్యకలాపాలకై దాదాపు అన్ని దేశాలకు పరిశ్రమలు వున్నాయి. వీటన్నింటికి పెద్దన్న అమెరికానే. దీని తర్వాత ఫ్రాన్స్, ఇజ్రాయల్ దేశాలు కాగా, రష్యా, చైనా, జపాన్, కొరియా, ఇస్లామిక్ దేశాలతోపాటు భారత్ కూడా పోటీపడడం గమనార్హం.

కరువుకాటకాలకు, ప్రకృతి విపత్తులకు జరిగే జీవరాశి నష్టాన్ని కొంతమేర అంచనా వేయగలం. కాని, యుద్ధం ద్వారా జరిగే నష్టాన్ని లెక్కించే విధానం ఇప్పటికీ లేదు. భవిష్యత్తులో ఇది జరగవచ్చు. అంటే యుద్ధాలు కొనసాగాలని మాత్రం కాదు. యుద్ధాలు లేని, సరిహద్దులు లేని, మిలటరీ లేని, తుపాకులు లేని, బాంబులు లేని, అసలు పోలీసు లేని వ్యవస్థ వుంటే ఎంత బాగుంటుందో! చివరికి ఇలాంటి వ్యవస్థను ఓ కల్పితంగా (fiction) కలగంటే ఎంత బాగుంటుందో! కలగందామనుకున్నా అమెరికా దేశపు సిఐఎ (CIA), మన 'రా' (RAW), ఇతర దేశాల రహస్య నేత్రాలు, ఏజెన్సీలు మనను నిద్రకూడా పోనివ్వని గుర్తిస్తే మనమెంత భద్రతతో బతుకీడుస్తున్నామో తెలుస్తుంది.

**యుద్ధం వస్తువుగా రాసిన నవలలు:**

1) War and Peace 1869 - టాల్‌స్టాయి. (నెపోలియన్ (ఫ్రెంచ్) రష్యాపై దాడి)
2) The Red Badge of Courage (1891) - స్టీఫెన్ క్రేన్ (అమెరికా అంతర్యుద్ధంపై)
3) Under Fire (1916) - హెన్రీ బార్బూజ్ (యుద్ధాల్ని వ్యతిరేకించిన నవల)
4) The Forever War (1917) - జో హాల్డర్ మాన్. (వియత్నాం యుద్ధంపై)
5) A Farewell to Arms (1929) - హెమ్మింగ్వే (అమెరికన్ యుద్ధం సందర్భంగా)
6) All quiet on the Western Front (1929) - ఎరిచ్ రిమార్క్యు (జర్మన్ నాజీలపై)
7) Gone with the Wind (1936) - మార్గరెట్ మిచెల్ (అమెరికా అంతర్యుద్ధం సందర్భంగా)
8) The Things They Carried (1990) - టింఒబ్రియన్ (వియత్నాం యుద్ధం సందర్భంగా)
9) విరామం - వెంకట కృష్ణారావు - (రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా).

- జమీల్యా, కొంగలు ముందే ఎగిరాయి, రెండు చింగీజ్ ఐత్మతోవ్ రచించినవి. తెలుగు అనువాదాలున్నాయి.

యుద్ధ నేపథ్యంలో అత్యధికంగా రష్యాలో, అమెరికాలో రావడం గమనార్హం. ఈ రెండు దేశాలు నిరంతరం యుద్ధాలు చేస్తూనే వున్నాయి.

మరి పరిష్కారం - మానవ రహిత భౌగోళిక మార్పులే! ఇది జరుగుతుందా అంటే, జరుగుతున్న పరిణామాలు దీన్నే సూచిస్తున్నాయి. పోతే, నేటి, రేపటి తరం దీన్ని చూడవు. వేలాది సంవత్సరాలు పట్టవచ్చు! లేదా, కొన్ని శతాబ్దాలే పట్టవచ్చు! అప్పుడు చూడడానికి నేటి మానవుడు వుంటేగదా! కాని, ఏదో రూపంలో కోట్లాది జీవరాశులు మాత్రం జీవిస్తూ వుంటాయి. పరిణామం చెందుతాయి. దీన్ని గుర్తించడానికి డార్విన్ లాంటి జీవి (మానవుడు కాదు) ఆవిర్భవించవచ్చు! కాబట్టి ఈ విషయంగా కలగందాం! ఊహాత్మక (fantasy) ప్రపంచంలో విహరిద్దాం!

**ఏ యుద్ధం ఎందుకు జరిగెనో**
**ఏనాటికి తేలని రహస్యం!**
**గెలిచామని చెప్పుకోవడమే**
**ఆధునిక యుద్ధతంత్రం!?**

**- డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com




# గన్‌ఫౌండ్రీలో స్వచ్ఛత కార్యక్రమం

## వారసత్వ కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించిన హెరిటేజ్ తెలంగాణ శాఖ

మే 21న హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన గన్‌ఫౌండ్రీ రక్షిత స్మారక కట్టడంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు సంయుక్తంగా పాల్గొన్నారు.

ఈ స్వచ్ఛత కార్యక్రమంలో అధికారులు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు, వాలంటీర్లు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గన్‌ఫౌండ్రీ ప్రాంగణం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, ఎండిన కొమ్మలు మరియు ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు చారిత్రక కట్టడాల పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ.. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. వారసత్వ సంపదను సంరక్షించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా ముందుకు వచ్చి వారసత్వ కట్టడాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ డైరెక్టర్ (మ్యూజియం) డా. పి. నాగరాజు మాట్లాడుతూ.. చారిత్రక స్మారక చిహ్నాలు మన చరిత్రను ప్రతిబింబించే అమూల్య సంపదలని అన్నారు. భావితరాలకు సంస్కృతి, చరిత్రను అందించాలంటే ఇటువంటి వారసత్వ కట్టడాలను పరిశుభ్రంగా, భద్రంగా ఉంచడం అవసరమని తెలిపారు. వారసత్వ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటించడం ద్వారా పర్యాటకాభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.

డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీ రాములు నాయక్ – డిప్యూటీ డైరెక్టర్, శ్రీ నర్సింగ్ నాయక్ – డిప్యూటీ డైరెక్టర్ ఇంజనీర్, శ్రీ ఎ. రాజు – ఓఎస్‌డీ, శ్రీమతి అమరజ్యోతి – అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీ మల్లు నాయక్, శ్రీమతి సునీత – సీనియర్ అసిస్టెంట్, శ్రీ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలోని అత్యంత ప్రాముఖ్యమైన పారిశ్రామిక మరియు సైనిక వారసత్వ కట్టడాలలో ఒకటిగా గన్‌ఫౌండ్రీ నిలిచిందన్నారు. ఈ గన్‌ఫౌండ్రీ 1795 సంవత్సరంలో ఆసఫ్ జాహీ నిజాంల పాలనలో ఫ్రెంచ్ సైనికాధికారి మోన్సియర్ మిచెల్ జోయాకిం మేరీ రేమండ్ పర్యవేక్షణలో నిర్మించబడిందని తెలిపారు. నిజాం అలీ ఖాన్ సేవలో ఉన్న రేమండ్ హైదరాబాద్ సైన్యాన్ని ఆధునీకరించడంలో కీలక పాత్ర పోషించారని, మరాఠాలు మరియు మైసూరు వంటి శక్తివంతమైన



రాజ్యాలతో పోటీ పడేందుకు యూరోపియన్ సైనిక సాంకేతికతలను హైదరాబాద్ రాష్ట్రంలో ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.

"రేమండ్ కార్ప్స్" అనే శిక్షణ పొందిన సైనిక దళానికి అవసరమైన ఆయుధాల తయారీలో గన్‌ఫౌండ్రీ ముఖ్య కేంద్రంగా పనిచేసిందని తెలిపారు. 1798లో మోన్సియర్ రేమండ్ మరణించిన తరువాత గన్‌ఫౌండ్రీ ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోయిందని, బ్రిటిష్ ప్రభావం పెరగడం మరియు రాజకీయ మార్పుల కారణంగా దీని సైనిక అవసరం తగ్గిందని వివరించారు. కాలక్రమేణా అనలు నిర్మాణంలోని అనేక భాగాలు కనుమరుగైనప్పటికీ, ప్రస్తుతం మిగిలి ఉన్న భట్టీ నిర్మాణం హైదరాబాద్ సైనిక, పారిశ్రామిక మరియు సాంకేతిక చరిత్రకు అమూల్యమైన వారసత్వ చిహ్నంగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం ఇది రక్షిత వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. డాక్టర్ జైకిషన్ గారు దక్కన్ ప్రాంతంలోని అనేక రకాల ఫిరంగులపై విశేష అధ్యయనాలు నిర్వహించారని వేదకుమార్ తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హెరిటేజ్ కార్యకర్త వి.కె. బావా గారు, "ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్" సంస్థ ద్వారా గన్‌ఫౌండ్రీ పరిరక్షణ కోసం విశేష కృషి చేశారని కొనియాడారు.

గత 50 సంవత్సరాలుగా హెరిటేజ్ కార్యకర్తలు, చరిత్రాభిమానులు మరియు పరిరక్షణ సంస్థలు నిరంతరం శ్రమించకపోయి ఉంటే ఈ చారిత్రక కట్టడం మరింత కుంచించుకు పోయేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం గన్‌ఫౌండ్రీ పరిమిత స్థలంలో మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, దానిని వారసత్వ చిహ్నంగా నిలుపుకోవడంలో జరిగిన పరిరక్షణ ప్రయత్నాలు హర్షించదగిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే వారసత్వ కట్టడాల పరిరక్షణలో భాగంగా 2004––2006 మధ్యకాలంలో Forume for A Better Hyderabad వేదకుమార్ ఆధ్వర్యంలో "ఇంపాక్ట్ ప్రోగ్రామ్" డెలాయిట్ సహకారంతో హైదరాబాద్‌లోని అనేక చారిత్రక, వారసత్వ ప్రాంతాలలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టిన క్రమంలో గన్ ఫౌండ్రీ కూడా ఒక ప్రొటెక్టెడ్ మాన్యుమెంట్ అనే విషయాన్ని వేదకుమార్ మణికొండ గుర్తు చేశారు.

ఈ స్వచ్ఛత కార్యక్రమంలో హెరిటేజ్ శాఖ హెడ్ ఆఫీస్ సిబ్బంది చిన్న స్థాయి ఉద్యోగుల నుండి డైరెక్టర్ స్థాయి అధికారుల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని వేదకుమార్ మణికొండ తెలిపారు. వారసత్వ కట్టడాల పరిరక్షణ పట్ల శాఖ సిబ్బంది చూపుతున్న అంకితభావం, బాధ్యతా భావం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చారిత్రక సంపద సంరక్షణకు మాత్రమే కాకుండా, ప్రజల్లో వారసత్వ చైతన్యాన్ని పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.

ఈ సైట్‌ను పరిరక్షిస్తూ ఒక సాంస్కృతిక కార్యక్రమానికి నిలయంగా తీర్చిదిద్దినచో పట్టణ వాసులు పరిరక్షణకు మరీ దగ్గరవుతారని, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని వెలిబుచ్చారు.

– సయ్యద్ ఖైజర్, m : 9793 05 9793



# అమోఘమైన రాతి సౌందర్యం

## కేరళ వయనాడు ట్రెక్కింగ్: భూమన్

**ప్రముఖ రచయిత, మేధావి, పుస్తకపఠన ప్రియుడు, పర్యావరణ ప్రేమికుడు అయిన భూమన్ తన ట్రావెలింగ్‌లో భాగంగా కేరళలోని వయనాడ్ ట్రెక్కింగ్ జర్నీ అనుభవాలు ఇలా తెలుపుతున్నాడు...**

అక్కడ ఏదో దెయ్యం దాగి ప్రమాదాలకు కారణమవుతున్నదని స్థానికులు ఒక చెట్టును గొలుసుతో కట్టివేసినారు. ఎన్ని వింతలూ, విడ్డురాలో మన దేశంలో... శేషాచలపు ట్రెక్కింగులకు అనుమతి లేకపోవటంతో ఈ దఫా కేరళ వయనాడులో ట్రెక్కింగులు చేయాలని నిశ్చయించుకున్నాను. పైగా వయనాడులో కొన్నేళ్ల క్రితం landslide జరిగి ఊళ్ళకి ఊళ్లు కొట్టుకుపోయి విపరీతంగా జనం చనిపోవటం, మానవ చరిత్రలో ఒక భయంకరమైన human tragedy జరిగిన చోటును కూడా చూడాలని వుండె. అంతకుమునుపు లదఖ్‌లో mud flood జరిగిన చోటు చూసి ఉన్నాను.






తిరుపతి నుండి కోజికోడ్‌కు చేరటం చాలా ఆలస్యమైంది. విమాన ప్రయాణం. రాత్రి heritage beach hotel check in కాగానే గబా గబా డిన్నర్ కానిచ్చేసి వాస్కోడగామా మే 20, 1498 అడుగుపెట్టిన స్థలానికి బయలుదేరినాము.

వాస్కో మొట్టమొదటి ఐరోపా వాసి. cape of goodhope నుండి సముద్ర ప్రయాణంలో కాలికట్ చేరుకున్నవాడు. అద్దాలు, స్కార్ఫ్‌లు లాంటివి తీసుకొచ్చి మన లవంగాలు, మిరియాలు, ఏలకులు, చిరింజాకు లాంటివి కొని పోవటం అతని ఉద్దేశ్యం. జామరోన్‌ను కలిసి వొప్పందం చేసుకున్న సంవత్సరమది. ఆ రోజు నుండి 500 ఏళ్లుగా కొనసాగిన వ్యాపారానికి అప్పుడే బీజం పడింది. చాలా ఉద్వేగంతో పోయిన నాకు ఒక చిన్న స్మారకపు రాయి మాత్రం అక్కడ గుర్తుగా ఉంది. బాగా చీకటి కనుక సరిగ్గా చూడలేక పోయినాను. కప్పడ్ బీచు మాత్రం చాలా బావుంది. ముగించుకుని మా వసతికి వస్తే ఎదురుగా విపరీతమైన జన తొక్కిడి. బీచు నిండా జనమే జనం. 1893లో కట్టిన మా వసతిని అడుగడునా అనుభవించి పొద్దు పొద్దున్నే వయనాడుకు బయలుదేరినాము.

ఘాట్ ఎక్కగానే chain tree దగ్గర ఆగితే అక్కడ ఒక గిరిజనుడి విగ్రహం వుంది. చెట్టుకు చైను వుంది. ఏందిరా అని ఆరా తీస్తే ఆ గిరిజనుడి పేరు కొలినేతానందన్. ఇతని సహాయం వల్లనే బ్రిటిషు వాడు ఒక ఘాట్ రోడ్డు పూర్తి చేసి, పూర్తి అయ్యి అవ్వగానే ఆ గిరిజనుడిని చంపేసినారు. పూర్తి credit తామే కొట్టెయ్యడానికి. అక్కడ ఏదో దెయ్యం దాగి accidents కు కారణమవుతున్నదని స్థానికులు చెట్టును గొలుసుతో కట్టివేసినారు. ఎన్ని వింతలూ, విడ్డురాలో మన దేశంలో.

నేరుగా మా వసతి చేరుకొని అక్కడే ఆ కొండ చుట్టూ తిరిగొచ్చినాను. resort వారే ప్రతిదినమూ guided trek ఏర్పాటు చేస్తున్నారు. చిన్నదే అయినా కొండ చుట్టూ, కొండ నది మధ్యన నడవటం చుట్టూ లోయలను చూడటం బాగుండె.

మరుసటి రోజున ఎడుక్కల్ గుహకు బయలుదేరినాము. ఎక్కడం పూర్తిగా ఎక్కుడే. మరీ స్టీప్ గా ఉండే చోట స్టీలు నిచ్చెనలు ఏర్పాటు చేసినారు. ప్రవేశ రుసుము 50 రూపాయలు. జనం బాగానే ఉన్నారు. సర్ అని ఎక్కితే 50 నిమిషాలు పట్టింది. సహజసిద్ధమైన పెద్ద గుండు రెండు కొండల మధ్యన నిలబడి మహా అద్భుతంగా ఉంది. ఆ మధ్యలో 6000 ఏళ్ల కిందటి ఆర్ట్





ఉంది. మా శేషాచలం యుద్ధగళంలో ఉన్నట్టుగా, మానవ ఆకారాలు, జంతువుల గుర్తులతో సింధునాగరికత నాటి గుర్తులు కానొచ్చినాయి. వయనాడు అత్యంత ప్రాచీన నాగరికతకు సంబంధించిన ప్రదేశంగా అనిపించింది. హరప్పా, సింధు, మెసపటోమియాల మాదిరిగా అనంతమైన ఈ గుర్తులు మానవ చరిత్ర మహోన్నత్వాన్ని అందిస్తున్నట్లుగా అనిపించింది. ఆ రాళ్ల అందం మన రాళ్ల అందం మాదిరిగానే ఉంది. అసలా రాతి సౌందర్యం ఎంత అమోఘమో కదా! రెండు కొండల నడుమా ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది. కోతులు, పక్షుల కోతల మధ్యన అరగంటకంతా దిగి వచ్చేసినాను.

మరుసటిరోజు సూచిపర జలపాతానికి ఛలో ఛలే. మా డ్రైవర్ భయపెట్టినట్టే ఉంది. చాలా లోతుకి దిగాలి. ఎక్కడం కష్టం అని, పావయ్యా, పా అని బయలుదేరినా అతడిని తోడు తీసుకుని. అక్కడ అటవీశాఖ వారే అన్ని ట్రెక్‌లు నిర్వహిస్తారు. మనిషికి 150 రూపాయల ఫీజు. నీళ్ల అటవీ శాఖ వారే దారెంటా ఏర్పాటు చేసి ఉన్నారు. life guards కూడా ఉన్నారు. system బాగుంది. ఎక్కడా కానీ plastic లేదు. ఇట్లా మన అటవీ శాఖ వారు చెయ్యగలిగితే ఎంత బావున్నో కదాని అడుగడుగునా అనుకున్నాను. అడుగే పెట్టనియ్యని అటవీ శాఖ చేస్తుందని ఎందుకనుకోవటం. అస్సలు ఎంతమందికి ఉపాధి లభిస్తుందో అటవీ శాఖ వారిని ఎవరైనా




ఆలోచింపచేస్తే బావుండు. సర్రున 40 నిముషాల్లో దిగేసినాను. వారు చెప్పే సమయం గంట. మా శేషాచలపు అనుభవం ముందు ఇదేమంతా పెద్దది కాదు. ఇలాంటివి కొన్ని పదులు చూసి ఉన్నాను. కాకపోతే మా శేషాచలపు జలపాతాల మాదిరిగానే ఉంది. పెద్ద పెద్ద గుండ్లు, రాళ్లతో నీళ్లు హొయలు పోతున్నాయి. సూచి అంటే సూది పార అంటే రాయి. సూదంటూ రాయి జలపాతమిది.

అక్కడ నుండి మొప్పాడు దగ్గర జరిగిన మానవ విషాదము, landslide జరిగిన చోటు చూసి, off Roadలో 8 కి.మీ జీపు ప్రయాణం చేసి 360 డిగ్రీ view point చూసి చాలా ఆహ్లాదానికి గురైనాను. చుట్టూ పచ్చ పచ్చాట అడవి. చూసినంత దూరం అత్యంత మనోహరంగా ఉంది.

చివరి రోజున మీన్ ముట్టి జలపాతానికి పోతే కొంచెం కష్టమయినా ఫర్వాలేదు. కాకపోతే సన్నటి ధార మాత్రమే నడకకు పనికొచ్చింది.

మొత్తానికి పేరున్న ఈ మధ్యతరహా ట్రెక్కింగులతో పాటు సన్నాబన్నాని ఐదు చేసి తిరిగి ఇంకో మారు వైత్రి, తెన్నిలలో చెయ్యాలనే సంకల్పంతో తిరిగొచ్చినాము. తిరిగొస్తూ వస్తూ కోజికోడ్ లో ప్రసిద్ధి చెందిన హల్వా రుచి చూడ్డం ఒక మంచి అనుభవం.

– భూమన్
m : 9010 744 999
e: sbhuman@hotmail.com



## పప్పుధాన్యాల దిగుమతితో

# రైతులపై ధరల ఒత్తిడి

పెరుగుతున్న పప్పుధాన్యాల ధరలను అరికట్టడానికి, పసుపు బఠానీలు, మినుముల దిగుమతులపై సుంకరహితాన్ని మార్చి 2027 వరకు కేంద్రం పొడిగించింది.

కనీస దిగుమతి ధర, ఓడరేవు ఆంక్షలను ఎత్తివేయడంతో పసుపు బఠానీల దిగుమతిపై ఆంక్షలు సడలించినప్పటికీ, చౌకగా వచ్చే దిగుమతులు దేశీయ రైతులను, స్వావలంబనను దెబ్బతీస్తాయని వ్యాపారులు హెచ్చరిస్తున్నారు.

పప్పుధాన్యాల ధరలను నియంత్రించి, గృహ ఆహార బడ్జెట్లపై ఒత్తిడిని తగ్గించే ప్రయత్నంలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం పసుపు బఠానీలు మరియు మినుముల (నల్ల శనగలు)పై సుంకరహిత దిగుమతి గడువును 2027 మార్చి 31 వరకు మరోసారి పొడిగించింది. పసుపు బఠానీలపై ఉన్న కనీస దిగుమతి ధర మరియు ఓడరేవు ఆంక్షలను కూడా తొలగించారు, దీనివల్ల వ్యాపారులు ప్రపంచ మార్కెట్ నుండి ఈ సరుకును మరింత స్వేచ్ఛగా సేకరించడానికి వీలవుతుంది.

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ ఆహార ధరలపై విస్తృత ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. భారతదేశంలో, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు, పప్పుధాన్యాల ధర వారి గృహ ఖర్చులతో దగ్గరగా ముడిపడి ఉంటుంది. పప్పుధాన్యాల ధరలలో ఏ మాత్రం ఆకస్మిక పెరుగుదల అయినా వంటగది బడ్జెట్‌లను త్వరగా దెబ్బతీస్తుంది.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ జారీ చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం, వ్యాపారులు 2027 మార్చి 31 వరకు పసుపు బఠానీలు, మినుములను ఎటువంటి పెద్ద ఆంక్షలు లేకుండా దిగుమతి చేసుకోగలరు. దేశీయ సరఫరాను పెంచడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడమే ఈ చర్య యొక్క ముఖ్య ఉద్దేశం.

ప్రభుత్వం పసుపు బఠానీల విషయంలో గణనీయమైన సడలింపులను అందించింది. కనీస దిగుమతి ధరను తొలగించడంతో, వ్యాపారులు ప్రపంచ మార్కెట్ నుండి మరింత పోటీ ధరలకు లేదా చౌకైన ధరలకు కొనుగోలు చేయవచ్చు. ఓడరేవు ఆంక్షలను కూడా ఎత్తివేశారు, దీనితో పసుపు బఠానీల రవాణా ఏ ఓడరేవు నుండైనా భారతదేశంలోకి ప్రవేశించడానికి అనుమతి

లభించింది.

మార్చి 31, 2027న లేదా అంతకు ముందు జారీ చేయబడిన బిల్ ఆఫ్ ల్యాండింగ్ ఉన్న అన్ని సరుకుల రవాణాలకు ఈ మినహాయింపు వర్తిస్తుంది. వ్యాపారులు దిగుమతి పర్యవేక్షణ వ్యవస్థ కింద నమోదు చేసుకోవాలి. నిబంధనల సడలింపు దేశీయ మార్కెట్లో పసుపు బఠానీల సరఫరాను పెంచుతుందని, తద్వారా ధరలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.

ప్రభుత్వం మినుముల (ఉరద్ పప్పు) ఉచిత దిగుమతి విధానాన్ని మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ సౌకర్యం గతంలో మార్చి 2026 వరకు అమలులో ఉండగా, ఇప్పుడు 31 మార్చి 2027 వరకు కొనసాగుతుంది.

భారతీయ గృహాలలో అత్యధికంగా వినియోగించే పప్పుధాన్యాలలో మినప పప్పు ఒకటి. దీనిని రోజువారీ పప్పు వంటకాలలోనే కాకుండా ఇడ్లీ, దోసె వంటి వంటకాలలో కూడా ఉపయోగిస్తారు. మార్కెట్లో కొరతను మరియు ఆకస్మిక ధరల పెరుగుదలను నివారించడమే ఈ విస్తరణ యొక్క ఉద్దేశ్యం.

సరఫరా గొలుసు అంతరాయాలు, ప్రపంచవ్యాప్త డిమాండ్-సరఫరా అంతరం పప్పుధాన్యాల ధరలపై ఒత్తిడి తెస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది.

### రైతులు ధరల ఒత్తిడిని ఎదుర్కోవచ్చు

ఈ చర్య స్వల్పకాలంలో వినియోగదారులకు సహాయపడవచ్చు, అయినప్పటికీ, పదేపదే సుంకరహిత దిగుమతులు పప్పుధాన్యాల విషయంలో భారతదేశ స్వయం సమృద్ధి లక్ష్యాన్ని దెబ్బతీస్తాయని కొంతమంది వ్యాపారులు హెచ్చరించారు.

ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం సుంకరహిత దిగుమతులపై నిరంతరం ఆధారపడటం ఆత్మనిర్భర్ భారత్, లేదా స్వయం సమృద్ధి భారత్ లక్ష్యానికి హాని కలిగించవచ్చని ఆల్ ఇండియా ఎడిబుల్ ఆయిల్ ట్రేడర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ జాతీయ మంత్రి శంకర్ ఠక్కర్ అన్నారు.

చౌక దిగుమతులు దేశీయ మార్కెట్లో పోటీని పెంచి, చిల్లర ధరలను తగ్గించగలవని ఠక్కర్ అన్నారు. ఒక సంవత్సరం పాలసీ విండో కారణంగా వ్యాపారులు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోగలుగుతారని, ఇది సరఫరా గొలుసును మరింత సులభతరం చేయడానికి సహాయపడుతుందని ఆయన తెలిపారు.

ఈ నిర్ణయం ప్రభావం కాలక్రమేణా రిటైల్ మార్కెట్‌లో కనిపిస్తుందని ఆయన అన్నారు. దేశంలోని అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో పప్పుధాన్యాల తగినంత లభ్యతను నిర్ధారించడం కూడా ముఖ్యమని ఆయన తెలిపారు.

అయితే, పసుపు బఠానీలపై కనీస దిగుమతి ధరను తొలగించడం వల్ల, దిగుమతి చేసుకున్న పప్పుధాన్యాలు దేశీయ ఉత్పత్తుల కంటే చౌకగా మారే అవకాశం ఉంది. చౌకైన వస్తువులు మార్కెట్లోకి ప్రవేశించినప్పుడు, దేశీయ ఉత్పత్తిదారులు ధరలను తగ్గించాలనే ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ధరల ఒత్తిడి నేపథ్యంలో ఈ నిర్ణయం సముచితమైనదే అయినప్పటికీ, ఇది భారతదేశపు దీర్ఘకాలిక స్వావలంబన లక్ష్యానికి ఆటంకం కలిగించవచ్చని ఠక్కర్ అన్నారు.

పప్పుధాన్యాలకు భారత రైతులకు సరైన ధరలు లభించకపోతే, వారు ఇతర పంటల వైపు మళ్లవచ్చని ఆయన అన్నారు. దాని పర్యవసానంగా, పప్పుధాన్యాల విషయంలో భారతదేశం స్వయం సమృద్ధికి మరింత దూరమయ్యే అవకాశం ఉంది.

*డౌన్ టు ఎర్త్ సౌజన్యంతో.*

-వివేక్ మిశ్రా




# పలమనేరులో జూన్ 7న కవి యాకూబ్‌కు 2025 - సృజన సాహితీ పురస్కార సభ

పలమనేరు సృజన సాహితీ పురస్కారం - 2025ను ప్రముఖ కవి, కవిసంగమం నిర్వాహకులు యాకూబ్‌కు పలమనేరు కళా మందిరంలో జూన్ 7వ తేదీ ఆదివారం జరిగే సాహితీ కార్యక్రమంలో అవార్డు ప్రదానం ఉంటుంది.

ఈ సభలో యాకూబ్ సాహిత్య ప్రస్థానం గురించి కవి సీతారాం, సాహిత్య వ్యక్తిత్వం గురించి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు ప్రసంగిస్తారు.

– పలమనేరు రచయితల సంఘం,
చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
9440995010

# ఆంగ్లేయులు: 1611-1947

క్రీ.శ. 15,16 శతాబ్దాలలో ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలను పోలిస్తే రాజకీయంగా, సైన్యపరంగా మరియు ఆర్థికంగా ఇంగ్లండ్ దేశం బలహీనంగా ఉండేది. తమ ఆహారంలో భాగమయిన సుగంధ ద్రవ్యాల నిమిత్తం ఇంగ్లీష్‌వారు తప్పనిసరిగా ఇటలీదేశం మీద ఆధారపడేవారు.

భారతదేశం తదితర తూర్పుదేశాలకు నూతనమార్గం కనిపెట్టిన పరిస్థితులలో తమతోటి యూరపుదేశాల ఆర్థికపోటీ పందెంలో ఇంగ్లండ్ కూడా తూర్పుదేశాలతో వర్తక - వాణిజ్యం జరపటానికి నిశ్చయించి, ముందుగా తన నౌకాదళాన్ని అంతకుముందు లేనంత బలంగా అభివృద్ధి చేయసాగింది. ఈ రంగంలో ఉన్న స్పెయిన్ దేశపు ప్రాబల్యాన్ని నిరోధించే భాగంగా ఇంగ్లండ్ తనస్వంత స్వతంత్ర వలస విధానాన్ని - స్వంత వాణిజ్య వ్యూహాన్ని రూపొందించుకున్నది. ఇంగ్లండ్ దేశపు నావికుడు **'ఫ్రానిస్ డ్రేక్'** క్రీ.శ. 1580లో నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. ఇందులో భాగంగా ఫ్రాన్సిస్ 1579లో మొలాకస్ సందర్శించి మిగతా యూరప్‌దేశాల నౌకలతో పాటు ఇంగ్లీషు నౌకలు కూడా ఎంతదూరమైనా ప్రయాణించగలవని నిరూపించాడు. 1583లో మరొక ఇంగ్లీషు నావికుడు **'రాల్ఫ్ పిచ్'** పర్షియా జలసంధి మీదుగా ఇంగ్లాండ్ చేరి **'భారతదేశ సహజవనరుల గురించి సంపద గురించి, భారతదేశం నుండి దేశవిదేశాలకు జరుగుతున్న వ్యాపార - వాణిజ్యాల వివరాలు, ఆ దేశప్రజలకు కథలు కథలుగా విప్పిచెప్పాడు'.** ఆనాటి నుండి భారతదేశంతో వ్యాపారంచేసి రూపాయికి వందరూపాయల లాభాలార్జించాలని ఇంగ్లీషు వ్యాపారులు ఉవిళ్ళూరుతున్నారు.



1585లో ఇంగ్లీషు నౌకాదళం, స్పెయిన్ దేశపు అతిగొప్ప నౌకాదళాన్ని ధ్వంసంచేసి తమ దేశానికి గొప్పపేరు తెచ్చిపెట్టింది. దీంతో భారత తదితర తూర్పుతీర దేశాలతో వర్తక వాణిజ్యాలు చేయమని ఇంగ్లండ్ ప్రజలు, వర్తకులు ఇంగ్లండ్ నావికులను కోరటం మొదలెట్టారు. తూర్పుతీర దేశాల సముద్ర జలమార్గం వారూహించినంత ప్రమాదభరితం కాదని తెల్సుకొన్న ఇంగ్లండ్ వర్తకులు బ్రిటిష్ రాణి అనుమతి పొందగా **'ద గవర్నర్ అండ్ కంపెనీ ఆఫ్ మర్చంట్స్ లండన్ ట్రేడింగ్ టు ది ఈస్ట్'** అనే ఇంగ్లీషు కంపెనీ క్రీ.శ. 1600లో పురుడుపోసుకుంది. ఈ కంపెనీ వ్యవహారాలు చూచే గవర్నరు, కార్యనిర్వహక వర్గం **'కోర్ట్ ఆఫ్ డైరెక్టర్సు'**గా పిలువబడ్డారు. 1612లో **'థామస్ బెస్ట్'** అనే ఆంగ్లేయుని ఆధ్వర్యంలో వచ్చిన ఇంగ్లీషు ఓడలు భారతదేశంలో వ్యాపారం చేసుకోవటానికి అనుమతించ బడినాయి. 1613లో సూరత్ పట్టణంలో వ్యాపారం చేసుకోవటానికి ముందుగా అనుమతిచ్చిన జహంగీర్ చక్రవర్తి పోర్చుగీసుల పోరువల్ల రద్దు చేసుకున్నాడు. 1615 నుండి 1618 వరకు ఢిల్లీ మొగలాయి దర్బారులో తిష్ఠవేసిన ఇంగ్లీషు రాయబారి 'సర్‌థామస్‌రో', సూరత్‌లో శాశ్వత ఫ్యాక్టరీ (గోదాములు) కట్టుకోవటానికి గుజరాత్ గవర్నరు నుండి అనుమతి సంపాదించాడు.

ఇంగ్లండ్ దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లు, 1611లో కెప్టెన్ హిప్పన్ అను నావికుణ్ణి **'గ్లోబ్'** అనే నావలో మరికొందరితో కలిపి, దక్షిణభారతదేశ తూర్పుతీరంలో వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేయమని పంపారు. కెప్టెన్ హిప్పన్ బృందం తమ నౌకలో దక్షిణ భారతదేశం తూర్పుతీరంలో అనేక రేవులమీదుగా ప్రయాణించారు. **ఎక్కడికెళ్ళినా అప్పటికే ఆయా రేవుల్లో వ్యాపార కేంద్రాలు స్థాపించి వ్యాపారంలో కాలు నిలద్రొక్కుకున్న డచ్ వ్యాపారులు తారసపడ్డారు. హిప్పన్ బృందం పులికాట్‌లో ప్రథమంగా ప్రయత్నించి విఫలమయి, అక్కడి నుండి మసులీపటాం చేరారు.**

1611, జనవరిలో మసులీపటాం చేరిన కెప్టెన్ హిప్పన్, మరియు అతని సహాయకుడు **'పీటర్ విలియంసన్ ఫ్లోరిస్'** బందరు మార్కెట్‌లో చేనేత వస్త్రాలు, మల్లవోలు తెల్ల మల్లుతానులు, సన్నని రవసెల్లాలు, మసులా మస్లిన్ బట్టలు కొనుగోలు చేసి సరాసరిన తమ గ్లోబు నావలో సయాం, బాంటమ్ దేశాలకెళ్ళి, అక్కడ సరుకుల అమ్మకాలు జరిపి, విశేష లాభాలతో 2013లో మసులీపట్నం చేరారు. **మసులీపటాం సరుకులకు లాభాల పంటను గమనించిన వీరు గోల్కొండ దర్బారు మచిలీపట్నం రాజప్రతినిధితో మాట్లాడి, ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున బందరులో ఒక వర్తక కేంద్రం (ఫ్యాక్టరీ) స్థాపనకు అనుమతి పొందారు.** అయినా డచ్ వారితో ఘర్షణలు పడాల్సివచ్చింది. సూరత్ పట్టణంలో ఒక శాశ్వత స్థావరంకు జహంగీరు చక్రవర్తి నుండి అనుమతి లభించింది.

**1615లో ఇంగ్లండ్ రాజు తరుపున 'సర్‌థామస్ రో' రాయబారిగా జహంగీర్ దర్బారును దర్శించి వ్యాపార రీత్యా పలు రాయితీలు సంపాదించగలిగాడు.**

తూర్పు ఇండియా దీవుల్లో డచ్‌వారి పోటీ ఎక్కువగా ఉన్నందున, ఇంగ్లీషు వారు తూర్పుదీవులు వదిలి, భారతదేశం మీద దృష్టి కేంద్రీకరించారు. **ఇంగ్లీషు వారు తొలిగా తమ వ్యాపార ఫ్యాక్టరీ (గోదాములను) ప్రస్తుత ఇంగ్లీషుపాలెం అనే పేటలో కట్టుకున్నారు.** ఆనాటికి ఇంగ్లీషుపాలెం రామానాయుడుపేటకు శివారుగా ఉండి 'రంగ్రేజ్‌పాలెం'గా పిలువబడుతుండేది.

ఇక్కడ అద్దకం / కలంకారీ బట్టలమీద రంగులద్దే అద్దకందార్లు నివాసముండేవారు. ఇంగ్లీషువారు వచ్చి రంగ్రేజ్‌పాలెంలో తమ వ్యాపార గోదాములు ఏర్పాటు చేసుకొనకముందు కాలంలో, అద్దకం అద్దే పర్షియన్ ముసల్మాను మాష్టర్ వీవర్ల బట్టల షెడ్డులుండేవి. ఉర్దూ / పర్షియన్ భాషల్లో రంగులద్దేవారిని **'రంగరేజు'**లనే వారు (రంగు + రేజులు = రంగులద్దేవారు). వీరు బట్టలమీద రంగులద్దక ముందు / అద్దిన తర్వాత బట్టలను తెలుపు చేయటానికి, రంగులద్దిన పిదప ఉతకటానికి ముసల్మాన్ వర్తకుల వద్ద పనిచేయటానికి రజకులు (చాకళ్ళు) ఉండేవారు. ముసల్మాను వర్తకుల వద్ద పనిచేసే హిందూ చాకళ్ళు, ముసల్మానుల మతప్రభావం వల్ల వాళ్ళుకూడా ఇస్లాంమతం పుచ్చుకోవటం జరిగేది. **ఇలా మతం మార్చుకొన్న కొత్తమతం చాకళ్ళను స్థానికులు 'తురక చాకళ్ళు' అని పిల్చేవారు.** ఇవ్వాల్టికి కూడా ఇదే పేరుతో పిలువబడే తురకచాకలి కుటుంబాలు ఇంగ్లీషుపాలెంలో తోట నర్సయ్య నాయ్డు గారి ఇంటి వెనకాల కాలనీగా నివాసం ఉంటున్నారు. మరొక వర్గం తురకచాకళ్ళు, ఆనాటి ఇంగ్లీషు ఫ్యాక్టరీకు దగ్గర్లో కళ్యాణీప్రెస్ బజారులో **'చాకిరేవుపాలెం'**గా పిలవబడే కాలనీలో ఉండేవారు, ఇప్పటికీ ఉంటున్నారు.



1699, అగష్టు నెలలో **'ది ఆనరుల్ ఈష్ట్ ఇండియా కంపెనీ'** తరపున కొత్త ఈష్ట్ ఇండియా కంపెనీ ఏజెంటు మిష్టర్ జాన్‌పిట్ **'ది ప్రెసిడెంట్ ఆఫ్ ద కోరమండల్ కోష్ట్ అండ్ ద కౌన్సిల్ ఫర్ ద కింగ్ ఆఫ్ ఇంగ్లండ్'** పేరుతో మసులీపట్నంలో ఒక ఫ్యాక్టరీ ప్రారంభించాడు. పాత ఈష్ట్ ఇండియా కంపెనీ కూడా తన తరపున కంపెనీ ఛీఫ్ ఇన్ కౌన్సిల్‌ని నియమించింది. ఈ ముఖ్య కౌన్సిల్ మెంబరుతోపాటు 24గురు సైనికుల బృందం, లెఫ్ట్‌నెంట్ స్థాయి సైనికాధికారి ఒకడు, ఒక సార్జంట్‌ని (వైద్యుణ్ణి) కూడా పాత కంపెనీ నియమించింది. జాన్‌పిట్ 1703లో చనిపోయాడు. పాతకంపెనీ సైనిక బృందంలోని అధికారి జాన్ రోనాల్డ్ 1701, అగష్టు నెల 25న చనిపోయాడు. రోనాల్డ్ సమాధి – పేరు వివరాలు తెలిపే సమాధిఫలకంతోసహా ఇంగ్లీషుపాలెం, శ్రీ తాడికొండ శ్రీరాములు ఇల్లు (ప్రస్తుతం విశ్వభారతి స్కూలు) దాటింతర్వాత, పాత కళ్యాణిప్రెస్ (ఆర్.కె. మాధవ్ నివాసం) దగ్గర్లో ఉండేది. **రోనాల్డ్ సమాధి, ఒక గుమ్మం సమాధి, 1759 నాటి బందరుకోటలో జరిగిన ఆంగ్లో – ఫ్రెంచ్ యుద్ధంలో చనిపోయిన సైనిక కమాండర్ 'కెప్టెన్ క్యాలెండర్' సమాధి – ఈ మూడు సమాధులు షుమారు 1964 ప్రాంతం వరకు ఉండేవి. వాస్తు పిచ్చి నెత్తికెక్కిన మనుషులు సమాధులను ఆక్రమించి, పగులగొట్టి ట్రాక్టరు రిపేరు షెడ్లుగా, సమాధుల పోరంబోకు స్థలాన్ని ఆక్రమించారు.** మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సర్వే లెక్కలలో కూడా ఈ సమాధులకు నెంబర్లు కేటాయించబడి సబ్ డివిజన్ చేసియున్నారు.

1623–28 మధ్యకాలంలో పోర్చుగీసు, డచ్, ఇంగ్లీషు వ్యాపారుల మధ్య వ్యాపార ఘర్షణలు కొనసాగినవి. ఈ ఘర్షణలలో విసుగెత్తటమే కాక ఆర్థికంగా నష్టపోయిన ఇంగ్లీషు కంపెనీ మసులీపటాం వదిలిపెట్టి, 1623లో పులికాట్‌లో ఒక వర్తక సంఘం ఏర్పాటు చేసుకొన్నది. 1624లో బాగా నష్టాలు చవిచూచిన ఇంగ్లీషు కంపెనీ పులికాట్‌కు ఉత్తరంగా నడిచి ఆర్మగాన్‌లో స్థావరం ఏర్పాటు చేసుకొంది. **1627–28 ప్రాంతంలో మచిలీపట్నం మీద సైనికపరంగా పట్టుసాధించిన గోల్కొండ దర్బారు, ఇంగ్లీషు వారికి ధైర్యం చెప్పి బందరులో వ్యాపారం చేసుకోవటానికి ఇంగ్లీషు వారిని తిరిగి ఆహ్వానించింది. స్థానిక అధికారుల అండదండలతో 1628 తరువాత మసులీపటాంలో ఇంగ్లీషువారు తిరిగి వ్యాపారం ప్రారంభించారు,** కాని మచిలీపట్నంలో ఇంగ్లీషుకంపెనీ పూర్వ వైభవం సాధించలేక పోయింది. గతంలో ఇంగ్లీష్ కంపెనీ చేనేత కలంకారీ వర్క్ షెడుల్లో చేతులనిండా పుష్కలంగా పనులు చేసుకొన్న బందరు కార్మికులు గత 10 సం॥లుగా పనుల్లేక పొట్టకూటికోసం మద్రాసులాంటి నగరాలకు వలసపోయారు. అయినా పట్టువదలని ఇంగ్లీషు కంపెనీ అధికారులు మచిలీపట్నం ఫ్యాక్టరీని బలపర్చుకుంటూనే నిజాంపట్నం, మోటుపల్లి, వీరవాసరం, భీమునిపట్నం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా ఇంజరం తదితర ప్రాంతాల్లో వర్తక కేంద్రాలు తెరిచారు. తర్వాత కాలంలో ఇంగ్లీషువారి వర్తకం గాల్లో పడి లాభాలపంట పండించింది.

*(తరువాయి వచ్చే సంచికలో)*

–మహమ్మద్ సిలార్
మెంబర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

ద



*Forum for a Better Hyderabad at Bansilalpet Stepwell*
*- World Environment Day- 2023 (File Photo)*

# 'FBH' 26 ఏళ్ల ప్రయాణం

## జీవ వైవిధ్య పరిరక్షణకు నిరంతర ఉద్యమం

పర్యావరణ పరిరక్షణ, వారసత్వ సంపద సంరక్షణ మరియు హైదరాబాద్ నగర జీవన నాణ్యత అభివృద్ధి లక్ష్యాలతో స్థాపించబడిన ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (FBH) గత 26 సంవత్సరాలుగా విశిష్ట సేవలను అందిస్తోంది. “Inspired by Nature: For Climate, For Our Future” అనే అంశంతో 2026 జూన్ 5న సంస్థ తన 26వ వార్షికోత్సవాన్ని ఖైరతాబాద్‌లోని IEI ప్రాంగణంలో ఉదయం 10:00 గంటలకు ఘనంగా నిర్వహించనుంది.




ఈ సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (FBH) మరియు ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్, ఇండియా (IEI) సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు FBH చైర్మన్ మరియు IEI హైదరాబాద్ చైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ నిపుణులు, పట్టణ ప్రణాళికకర్తలు, ఇంజినీర్లు, మేధావుల వ్యాసాలు, పరిశోధనలు, సూచనలతో రూపొందించిన వార్షిక గ్రంథం (Year Book) ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఇంతకుముందు 2023లో FBH తన 23వ వార్షికోత్సవాన్ని చారిత్రక ప్రాధాన్యత కలిగిన బన్సీలాల్‌పేట మెట్లబావి వద్ద నిర్వహించి, వారసత్వ సంపద మరియు జలవనరుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించింది.

గత రెండున్నర దశాబ్దాలుగా FBH సరస్సులు, అడవులు, జీవ వైవిధ్యం, వారసత్వ కట్టడాల సంరక్షణతో పాటు సుస్థిర పట్టణాభివృద్ధి కోసం ప్రజా చైతన్య కార్యక్రమాలు, సదస్సులు, విధాన చర్చలు నిర్వహిస్తూ విశ్వసనీయ పౌర వేదికగా కొనసాగుతోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాల భవిష్యత్తును సురక్షితం చేయాలనే సంకల్పంతో FBH తన కార్యకలాపాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తోంది.

– శోభా సింగ్
General secretary,Forum for a Better Hyderabad.
e: fbhgreens@gmail.com (RSVP: 8686664949)

ద

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

## విలీనం నుంచి విభజన వరకు, కీలక ఘట్టాలు

**జూ**న్ 2... తెలంగాణ రాష్ట్రం అవతరించిన రోజు. 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం 2014లో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరింది. పన్నేండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

ఈ నేపథ్యంలో భారత్‌లో హైదరాబాద్ ప్రాంతం విలీనం అయినప్పటి నుంచి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు వరకు జరిగిన సుదీర్ఘ పోరాటాల్లో కొన్ని ముఖ్య ఘట్టాలను ఒకసారి గుర్తు చేసుకుందాం.

**1948:** నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రం (ప్రస్తుత తెలంగాణ) పోలీస్ చర్యతో భారత్‌లో విలీనం అయింది. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగింది.

**1956:** ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇరు ప్రాంతాల నేతలతో చర్చలు జరిపింది. పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్ మెన్ అగ్రిమెంట్)తో హైదరాబాద్ రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.




**1969:** పెద్ద మనుషుల ఒప్పందంలోని రక్షణలు అమలు కావడం లేదని భావించిన తెలంగాణ ప్రజలు తొలిసారిగా ఉద్యమించారు. పోలీసుల కాల్పుల్లో 300 మంది చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి పార్టీని స్థాపించారు.

**1973:** ఇరు ప్రాంతాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు నాటి ప్రధాన మంత్రి ఇంధిరా గాంధీ ఆరు సూత్రాల పథకాన్ని (సిక్స్ పాయింట్ ఫార్ములా) ప్రతిపాదించారు. దీనికి ఆంధ్రా, తెలంగాణ నేతలు అంగీకరించారు. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రాంతాల్లో ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఉద్యమాలు ఆగిపోయాయి.

**2001:** తెలుగు దేశం పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆ పార్టీ శాసన సభ్యుడు కె.చంద్రశేఖర్ రావు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేశారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ తదితర మేధావులు కేసీఆర్‌కు మద్దతుగా నిలిచారు.

**2009:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆయన దీక్షకు తెలంగాణ వాదులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి.

తెలంగాణలో ఉద్యమం ఊపందుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి శ్రీకాంత చారి ఆత్మబలిదానం చేసుకున్నారు.

కేసీఆర్ దీక్షతో తెలంగాణలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని డిసెంబర్ 9న కేంద్రం ప్రకటించింది.

**2010:** తెలంగాణ ఏర్పాటుపై ఆంధ్ర ప్రాంతం నుంచి వ్యతిరేకత రావడంతో తెలంగాణ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండు ప్రాంతాలను సందర్శించి తన నివేదికలో ఆరు రకాల ప్రతిపాదనలు చేసింది.

**2011, 2012:** శ్రీకృష్ణ కమిటీ రిపోర్టు ఇరుప్రాంతాలను సంతృప్తి పరచలేక పోయింది. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో తెలంగాణ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ), తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్), ప్రజాసంఘాలు, వివిధ పార్టీలు కలిసి మిలియన్ మార్చ్, సాగర హారం, చలో అసెంబ్లీ, సకల జనుల సమ్మె తదితర రూపాల్లో నిరసనలు తెలుపుతూ ఉద్యమాలు చేశారు.

**2013:** హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

సీడబ్ల్యూసీ నిర్ణయానికనుగుణంగా తెలంగాణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

**2014:** అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చ జరిగింది. బిల్లును వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఆమోదం తెలిపింది.

కానీ, వివిధ పార్టీల మద్దతుతో రాజ్యసభ, లోక్‌సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది.

జూన్ 2న ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది.

– ఎసికె. శ్రీహరి

m : 9849930145

e : ackvs08@gmail.com



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు

**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
(Regd. 720/1982)
హైదరాబాద్

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - May 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

# VOL 14వ వసంతంలో
# 166 ISSUES నూట అరవై ఆరవ సంచిక
## పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



## దక్కన్ ల్యాండ్ పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 జూన్ సంచికతో 166 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ. 400–లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar